Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 | సంచిక : 278 | మేడ్చల్ మల్కాజ్‌గిరి | 27 అక్టోబర్ 2023 | శుక్రవారం | పేజీలు : 4

## రైతులకు శుభవార్త

### రబీలో ఎరువులపై 22 వేల కోట్ల సబ్సిడీ

న్యూఢిల్లీ : రైతులకు శుభవార్త. 2023-24 రబీ సీజన్‌కుగాను (01.10.23-31.03.24) భాస్వరం, నత్రజని, పొటాష్, సల్ఫర్ ఎరువులకు సంబంధించి ఎరువుల విభాగం ప్రతిపాదించిన పోషక ఆధారిత సబ్సిడీ రేట్లకు.. ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్ర క్యాబినెట్ ఆమోద ముద్ర వేసింది. ఈ సబ్సిడీ విలువ రూ.22,303 కోట్ల దాకా ఉంటుందని కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్ తెలిపారు. కేంద్ర క్యాబినెట్ ఆమోదించిన ఈ రేట్లు 2023 అక్టోబరు ఒకటి నుంచి 2024 మార్చి 31 దాకా అమల్లో ఉంటాయని ఆయన వెల్లడించారు. డీఏపీ 50 కిలోల బస్తా రూ.1350కే రైతులకు అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఎన్‌పీకే (బస్తా రూ.1470), ఎస్‌ఎసపీ (రూ.500) ఎరువుల ధరలు అలాగే కొనసాగనున్నాయని.. ఎంవోపీ ఎరువు ధర బస్తా రూ.1700 నుంచి రూ.1655కు తగ్గనుందన్నారు.

# పదేండ్లలో కనీవినీ ఎరుగని అభివృద్ధి సాధించాం



## ఇప్పుడు అడ్డంపొడువు మాట్లాడుతునోళ్లంతా.. నాడు ఎవరి బూట్లు మోసుకుంటూ ఉన్నరో తెలుసు..!

### వనపర్తి ప్రజా ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్

వనపర్తి : ప్రస్తుతం అడ్డంపొడువు మాట్లాడుతునోళ్లంతా.. నాడు ఎవరి బూట్లు మోసుకుంటు ఉన్నరో ప్రజలకు తెలుసునని సీఎం కేసీఆర్ అని విమర్శించారు. వనపర్తి జిల్లా కేంద్రంలో జరిగిన ప్రజా ఆశీర్వాద సభలో ముఖ్యమంత్రి కేసీఆర్ పాల్గొన్నారు. మరోసారి కారు గుర్తుకు ఓటేసి వనపర్తి ఎమ్మెల్యేగా గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'ఎన్నికలు వచ్చేశాయ్. తెలంగాణ సాధన తర్వాత పదో సంవత్సరం జరుగుతున్నది. ఈ పదేళ్లలో ఏం జరిగిందో అదంతా నిలువెత్తుగా మీ కళ్ల ముందు ఉన్నది. నేను మిమ్మల్ని ప్రార్థించేది ఒక్కటే. ఎలక్షన్లు చాలాసార్లు వస్తుంటాయ్.. పోతుంటాయ్. నేను చెప్పే నాలుగుమాటలను మీ గ్రామాలు, బస్తీలకు పోయిన తర్వాత చర్చ జరుపాలని కోరుతున్నాను. నిజానిజాలు తేల్చాలని కోరుతున్నాను. కారణం ఏంటంటే మీరు పేపర్లలో చూస్తున్నరు' అన్నారు.

**ఎవరూ లేనినాడు ఉద్యమాన్ని ప్రారంభించాం..** '24ఏళ్ల నాడు పిడికెడు మందిమి.. ఇందులో నిరంజన్‌రెడ్డి ఒక్కరూ. ఎవరూ లేనినాడు ఉద్యమాన్ని ప్రారంభించాం. ఆ నాడు ఎవరు ఎక్కడ ఉన్నరో తెలుసు. ఎవరి బూట్లు మోసుకుంటు ఉన్నరో మీకు తెలుసు. కానీ, ఇవాళ కేసీఆర్ నువ్వు కొడంగల్‌కు రా.. అని ఒకడు. నువ్వు గాంధీ బొమ్మకాడికి ఇంకొకడు. 119 నియోజకవర్గాల్లో కేసీఆర్‌లు ఉన్నారు. వనపర్తి కేసీఆర్ నా పక్కన నిలబడి ఉన్నడు కాదా? నీ దమ్ము.. నా దమ్ము ఏంటంటే.. ఏ దమ్ము లేకుండా.. దమ్ము కోల్పోయి.. గంజి కేంద్రాలు, అంబలి కేంద్రాలకు ఆలవాలమైన పాత మహబూబ్‌నగర్ జిల్లా ఆ నాడు వలసపడి, గోసపడి ఎవరో వచ్చి గంజి, అంబలి కేంద్రాలు పెడితే బతకాలని ఒక శాపగ్రస్తమైన జిల్లా. ఆ నాడు పక్షుల్లా తిరుగుతుంటే ఈ నాడు ఉన్న నాయకులు ఎక్కడున్నరో మీకు తెలుసు' అని చెప్పారు.

**వాగేది ఎవరో.. పనిలో ఉన్నది ఎవరో తెలుసు..** 'అవాకులు, చెవాకులు.. చిన్న పెద్దంతరం లేకుండా నోటికి వచ్చేది వాగేది ఎవలో.. వాళ్లు ఏం పనిలో ఉన్నరో మీకు తెలుసు. మేం తిరిగిన నాడు.. ధైర్యం లేదు.. మంది లేరు.. నాయకులు లేరు. మంత్రి పదవులు లేవు అయినా పక్షుల్లా రాష్ట్రం నలుమూలల కలియదిగిరి.. జానాన్ని చైతన్యపరిచి.. అద్భుతమైన పాటలు రాసి.. ఇవాళ లేదు కానీ.. నా తమ్ముడు సాయిచంద్, గోరటి వెంకన్నలాంటి కవులు కళాకారులు.. ఎందరో బిడ్డలను ఏకం చేసి తెలంగాణ ఒక్క గొంతై నినదిస్తే అదికూడా 2004లో మన పొత్తుతో గెలిచి.. మన ఆగం చేయాలని చూసి.. 14 సంవత్సరాల తర్వాత నేను చావునోట్లో తలకాయపెట్టి చావునోట్లో ఆమరణ నిరాహార దీక్షకు కూసుకుంటే తెలంగాణ వచ్చింది. ఇవాళ మాట్లాడేది ఎవరో.. ఆ నాడు పోట్లాడింది ఎవరో ఆలోచన చేయాలని కోరుతున్నా'నన్నారు.

**ఉన్న తెలంగాణను ఊడగొట్టిందెవరు..?** 'ఆ నాడు ఉన్న తెలంగాణను ఊడగొట్టింది ఎవరు? గొడగొడ ఏడుస్తుంటే.. తెలంగాణకు నీళ్లల్లో, నిధుల్లో, నియామకమాల్లో, కరెంటులో అన్నింట్లో అన్యాయం జరుగుతుంటే నోరుమూసుకొని కూర్చున్నది ఎవరు? గొంతుపెగిల్చి.. నినాదం ఇచ్చి కోట్లాడింది ఎవరు? ఆలోచన చేయాలి. ఒక్కటే ఒక్క మాట.

ఒక్క పెండింగ్ ప్రాజెక్టు అని పడావు పెడితే ఎకరానికి కూడా నీళ్లు రాలే. ఇవాళ వనపర్తికి కల్వకుర్తి ఎత్తిపోతల పథకం పూర్తి చేస్తే లక్ష ఎకరాలకు నీరు వస్తుంది' అన్నారు.

## బీసీలకు కాంగ్రెస్ అన్యాయం చేసింది



నిజామాబాద్: బీసీలకు కాంగ్రెస్ పార్టీ అన్యాయం చేసిందని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. గురువారం నాడు నిజామాబాద్ జిల్లాలో పర్యటించారు. బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కవిత మీడియాతో మాట్లాడుతూ.. "ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ పార్టీకి ఈ ఎన్నికల్లో రైతన్నలు మద్దుతు ఇవ్వకూడదు. రైతన్నలకు రైతుబంధు మాత్రమే ఆపలా?? ఎన్నికల కోడ్ చెప్పి సంక్షేమ పథకాలను ఆపేందుకు రాహుల్‌గాంధీ కుయుక్తులు పన్నుతున్నారు. నాలుగు ఓట్ల కోసం ప్రజల కడుపు కొట్టె నీచమైన దుర్మార్గానికి కాంగ్రెస్ తెరలేపింది. బీఆర్ఎస్ పార్టీ రాజకీయ సుస్థిరత సాధించింది .. రాజకీయ సుస్థిరత లోపిస్తే మన అవకాశాలు ఎత్తుకుపోయే ప్రమాదం ఉంది. బెంగుళూర్‌ని ఐటీలో క్రాస్ చేశాం .. ఐటీ హబ్‌లు వచ్చాయి .. ఇండస్ట్రీయల్ జోన్స్ కూడా వస్తాయి. తెలంగాణను కేసీఆర్ ఎంత గానో అభివృద్ధి చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ ఆరోపణలు చూస్తే ఆ పార్టీ నేతల్లో అభద్రతా భావం కనిస్పిస్తుంది. ఆఫీసర్లను మార్చాలని, రైతుబంధు, దళిత బంధు ఆపాలని కాంగ్రెస్ అంటుంది. ఆలా అయితే కాంగ్రెస్ వాళ్ల ఇళ్లకు కరెంట్ ఆపాలి. తెలంగాణ వచ్చిన తర్వాతనే కరెంట్ వచ్చింది కదా. బీజేపీ లాగా పేర్లు మార్చి కేసీఆర్ ప్రభుత్వం పథకాలు పెట్టడం లేదు. యూపీఎస్సీ తరహా జాబ్ క్యాలెండర్ అని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీ ఇచ్చింది. కాని దానిని ఆచరణలో పెట్టలేదు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో ఎందుకు ఈ కార్యక్రమాన్ని అమలు చేయడం లేదు. 2010లో ప్రవేశపెట్టిన మహిళా బిల్లులో బీసీలను చేర్చకుండా కాంగ్రెస్ పార్టీ బీసీలకు అన్యాయం చేసింది. అరవింద్‌ను కోరుట్లలో ఓడిస్తాం. రేవంత్‌రెడ్డి కామారెడ్డికి వచ్చిన, ఈటల గజ్వేల్‌లో పోటీ చేసిన మా పార్టీకి వచ్చిన నష్టం లేదు" అని ఎమ్మెల్సీ కవిత అన్నారు.

## నాడు హుజూరాబాద్.. నేడు గజ్వేల్.. రేపు జరగబోయేది ఇదే!



గజ్వేల్ : తెలంగాణలో ఎన్నికలు సమీపిస్తున్నాయి.. ఈసారి కూడా గెలిచి హ్యాట్రిక్ కొట్టాలని, తద్వారా జాతీయ రాజకీయాల్లోనూ చక్రం తిప్పాలని అధికార బీఆరెస్స్ పథకాలు రచిస్తుంది. మరోపక్క కర్ణాటక ఎన్నికల ఫలితాలు తెలంగాణలోనూ రిపీట్ చేయాలని కాంగ్రెస్ తీవ్ర ప్రయత్నాలు చేస్తుంది. ఇదే సమయంలో కర్ణాటక ఫలితాల అనంతరం దక్షిణాదిలో దారులు మూసుకుపోతున్నాయి అనే కామెంట్లకు చెక్ పెట్టాలని బీజేపీ తాపత్రయ పడుతుంది. అయితే... ఈటల రాజేందర్ మాత్రం కేసీఆర్ ని ఓడించాలని మాంచి పట్టుమీదున్నారని అంటున్నారు! అవును... అధికారంలోకి రావడం అనేది ఏ ఒక్కరి చేతుల్లోనూ ఉండదు. పైగా జాతీయ పార్టీల విషయంలో అయితే అది అసలే సాధ్యం కాదు! అక్కడ సమిష్టి కృషి అనివార్యం! ఈ సమయంలో పార్టీ లక్ష్యాలతో పాటు తనకంటూ ఒక పర్సనల్ అజెండా పెట్టుకున్నట్లున్నారు ఈటెల రాజేందర్. ఇందులో భాగంగా ఈసారి గజ్వేల్ లో కేసీఆర్ ని ఓడించాలని కంకణం కట్టుకున్నారని తెలుస్తుంది. ఇందులో భాగంగా ఆయన ఈసారి హుజూరాబాద్ తో పాటు గజ్వేల్ లోనూ బీజేపీ నుంచి పోటీ చేస్తున్నారు. ఈ క్రమంలో తాజాగా వర్గల్ సరస్వతీ దేవి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన ఈటెల రాజేందర్.. అనంతరం పార్టీ కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కీలక వ్యాఖ్యలు చేశారు. ఇందులో భాగంగా... గజ్వేల్ లో ఎన్నికలు కురుక్షేత్ర యుద్ధం లాంటివని, ఈ యుద్ధంలో కేసీఆర్ ను ఎట్టిపరిస్థితుల్లోనూ మట్టికరిపించాలని ఆయన కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఇదే సమయంలో... ఈ ఎన్నికల్లో ప్రజలు బీఆరెస్స్ కు బుద్ధి చెబుతారని.. ఎన్ని కుయుక్తులు పన్నినా గజ్వేల్ లో గెలిచేది బీజేపీనే అని ఈటెల రాజేందర్ ధీమా వ్యక్తం చేశారు. ఇక గజ్వేల్ లో ఏ పార్టీ అయినా మీటింగ్ పెట్టుకోవచ్చు కానీ... బీజేపీ సమావేశాలు నిర్వహిస్తే మాత్రం ప్రజలను అడ్డుకుంటున్నారని ఈటెల ఫైరయ్యారు. అదేవిధంగా... ఎవరైనా బీజేపీ సభలకు, సమావేశాలకూ రావడానికి రెడీ అవుతుంటే... దావతులు ఇచ్చి, పైసలు పంచి రాకుండా ఆపేస్తున్నారని విమర్శించారు. నాడు హుజూరాబాద్ ఉప ఎన్నిక సమయంలోనూ ఇలాంటి పనులే చేశారని.. అయితే, అక్కడ ప్రజలు ఇలాంటి చేష్టలను పాతరేశారని తెలిపారు. అదేతరహాలో ఈసారి గజ్వేల్ లో కూడా చేయాలని.. ఫలితంగా ప్రజాస్వామ్యాన్ని, ధర్మాన్ని కాపాడాలని గజ్వేల్ ప్రజలకు పిలుపునిచ్చారు ఈటెల. ఈ సందర్భంగా గజ్వేల్ తో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు ఈటెల రాజేందర్. ఇందులో భాగంగా... గజ్వేల్ కు తానేమీ కొత్త కాదని, గజ్వేల్ లోనే తొలి పౌల్ట్రీ ఫాం ఏర్పాటు చేసి జీవితం ప్రారంభించినట్లు చెప్పారు ఈటెల. ఇక తెలంగాణ ఉద్యమం తొలినాళ్లలో గజ్వేల్ లోనే ఎక్కువగా తిరిగినట్లు గుర్తుచేసుకున్న ఆయన... నాడు సొంత ప్రాంతంలో తిరగాలని కేసీఆర్ చెప్తే.. హుజురాబాద్ లో ఉద్యమం నడిపినట్లు తెలిపారు.

# హీటెక్కిన తెలంగాణ రాజకీయం

## కామారెడ్డి బరిలోకి రేవంత్‌రెడ్డి




హైదరాబాద్ : త్వరలో జరగబోతున్న తెలంగాణ శాసనసభ ఎన్నికల్లో పోరు రసవత్తరంగా మారింది. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ గజ్వేల్ తో పాటు కామారెడ్డిలో కూడా పోటీ చేసేందుకు సిద్ధమవుతున్న సంగతి తెలిసిందే. ఈ రెండిట్లో ఏదో ఒక చోట కేసీఆర్ విజయం సాధిస్తారని పార్టీ శ్రేణులు ధీమా వ్యక్తం చేస్తున్నాయి. అయితే, ఈసారి కేసీఆర్ గెలుపు నల్లేరు మీద నడక కాదని కాంగ్రెస్ నేతలు అంటున్నారు. ఈ క్రమంలోనే అధిష్టానం ఆదేశిస్తే కామారెడ్డిలో కేసీఆర్ పై పోటీ చేస్తానని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి సంచలన ప్రకటన చేశారు. కొడంగల్ తో పాటు కామారెడ్డిలో కూడా పోటీ చేస్తానని రేవంత్ రెడ్డి చేసిన ప్రకటన తెలంగాణ రాజకీయాలలో హాట్ టాపిక్ గా మారింది. మరోవైపు గజ్వేల్ లో కేసీఆర్ పై పోటీ చేసేందుకు సిద్ధమని బిజెపి నేత ఈటల రాజేందర్ కూడా ప్రకటించిన సంగతి తెలిసిందే. హుజురాబాద్ ఉప ఎన్నికలో ఈటలను ఓడించేందుకు కేసీఆర్ సర్వశక్తులు ఒడ్డిన సంగతి తెలిసిందే.

ఈ నేపథ్యంలోనే గజ్వేల్ లో కేసీఆర్ పై పోటీ చేసి ప్రతీకారం తీర్చుకోవాలని ఈటల భావిస్తున్నట్టుగా తెలుస్తోంది. తెలంగాణ రాజకీయాల్లో సీనియర్ నేతగా ఉన్న ఈటల...ఉద్యమ నాయకుడిగా కూడా పాపులర్ అయిన నేపథ్యంలో గజ్వేల్ లో కేసీఆర్ కు గట్టి పోటీనిస్తారని బిజెపి అధిష్టానం భావిస్తుందట. మరోవైపు, కామారెడ్డిలో రేవంత్ ను బరిలోకి దించడం ద్వారా కేసీఆర్ ను దీటుగా ఎదుర్కొనేందుకు కాంగ్రెస్ అధిష్టానం కూడా వ్యూహం రచిస్తున్నట్టుగా తెలుస్తోంది.

టిపిసిసి పగ్గాలు చేపట్టిన రేవంత్ రెడ్డి దూకుడుగా వ్యవహరిస్తూ కేసీఆర్, కేటీఆర్ లకు సవాల్ విసురుతున్న నేపథ్యంలోనే కాంగ్రెస్ హై కమాండ్ ఈ నిర్ణయం దిశగా ఆలోచనలు చేస్తుందని తెలుస్తోంది. కామారెడ్డి లో తొలిసారిగా పోటీ చేస్తున్న నేపథ్యంలో అక్కడ కేసీఆర్ కు రేవంత్ రూపంలో గట్టి పోటీ ఎదురయ్యే అవకాశముందని తెలుస్తోంది. అయితే, కాంగ్రెస్ తరపున కామారెడ్డి బరిలో దిగేందుకు మాజీ మంత్రి షబ్బీర్ అలీ కూడా రెడీ అవుతున్నారు. ఒకవేళ కాంగ్రెస్ అధిష్టానం రేవంత్ కు కామారెడ్డి సీట్ కేటాయిస్తే షబ్బీర్ అలీకి వేరే స్థానం కేటాయించడం లేదంటే ఎమ్మెల్సీ పదవిని ఇచ్చి నచ్చచెప్పడం జరిగే అవకాశాలు ఉన్నాయి. కామారెడ్డి గజ్వేల్ లో కేసీఆర్ ఫేవరెట్ గా బరిలోకి దిగుతున్నప్పటికీ మాస్ లీడర్లుగా పేరు ఉన్న రేవంత్ రెడ్డి, ఈటలలు ఆయనకు ప్రత్యర్థులుగా దిగితే మాత్రం కేసీఆర్ గెలుపు నల్లేరు మీద నడక కాదని రాజకీయ విశ్లేషకులు కూడా అభిప్రాయపడుతున్నారు.

## సంపాదకీయం

# సోషల్ మీడియాలో దూసుకుపోతోందా ?

ఎన్నికలు దగ్గరపడుతున్న నేపథ్యంలో బీఆర్ఎస్ సోషల్ మీడియా ప్రచారంలో దూసుకుపోతోంది. అందుబాటులో ఉన్న ప్రతి సోషల్ మీడియా వేదికను నూరుశాతం ఉపయోగించుకోవాలని మంత్రి కేటీయార్ స్పష్టంగా ఆదేశించారు. ఈ ప్రచారం కూడా రెండు విధాలుగా ఉండాలని చెప్పారు. మొదటిదేమో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలకు విస్తృతమైన ప్రచారం కల్పించటం. ఇక రెండో పద్దతేమో ప్రత్యర్థులపై తీవ్రస్థాయిలో విరుచుకుపడటం. ఇందుకోసం ప్రతి నియోజకవర్గంలోను ప్రత్యేకంగా ఒక వార్ రూమ్ ను ఏర్పాటు చేశారు. అలాగే ప్రతి గ్రామంలోను వీలైనన్ని వాట్సప్ గ్రూపులను ఏర్పాటుచేసి ప్రచారాన్ని మానిటర్ చేయబోతున్నారు. ఈ వార్ రూములకు, సోషల్ మీడియా గ్రూపులను కేంద్ర కమిటీతో అనుసంధానం చేశారు. ఈ కేంద్ర కార్యాలయం హైదరాబాద్ లోని పార్టీ ఆఫీసులో ఏర్పాటుచేశారు. 24 గంటలూ అభ్యర్థుల ప్రచారాన్ని, పార్టీ మద్దతు ప్రచారాన్ని ఇక్కడినుండే పర్యవేక్షించాలని కేటీయార్ డిసైడ్ చేశారు. ఇందుకోసం ప్రత్యేకంగా కేంద్ర కార్యాలయంలో 400 మందితో పెద్ద టీమునే ఏర్పాటు చేశారు. గ్రూపులతో పాటు వార్ రూములను నిర్వహించేవారితో కేటీయార్ రెగ్యులర్ గా టచ్ లో ఉంటు ఎప్పటికప్పుడు అవసరమైన దిశానిర్దేశం చేస్తున్నారు. ఇందులో కూడా కాంగ్రెస్, బీజేపీలకు వ్యతిరేకంగా ప్రచారం చేయటం కోసం ప్రత్యేకమైన బృందాలను ఏర్పాటు చేశారు. ఈ బృందాల పనేమిటంటే ఎన్నికల ప్రచారం ముగిసేంతవరకు 24 గంటలూ పై రెండు పార్టీలకు వ్యతిరేకంగా ప్రచారం చేస్తుండటమే. వ్యతిరేక ప్రచారం కూడా ఎప్పటికప్పుడు జనాలను ఆకట్టుకునేట్లుగా సెటైర్లు, మీమ్స్, జోక్స్ తదితరాలతో ఉండాలని కేటీయార్ ఆదేశించారు. సోషల్ మీడియా అంటే వాట్సప్, ట్విట్టర్, ఇన్ స్టాగ్రామ్, ఫేస్ బుక్ తదితరాల్లో అభ్యర్థుల తరపున వార్ రూములు, వాట్సప్ గ్రూపులు విస్తృతంగా పనిచేయబోతున్నాయి. అధికారంలో ఉందికాబట్టి ఖర్చులకు ఏమాత్రం వెనకాడటంలేదు. అందుకనే ప్రతిగ్రామంలోనే వందమందితో వాట్సప్ గ్రూపులను ఏర్పాటుచేసి ప్రత్యర్థులను ఉక్కిరిబిక్కిరి చేయాలని పెద్ద ప్లాన్ చేశారు. ప్రచారం చేసే క్రమంలో ఎవరు కూడా ఎన్నికల కమీషన్ నిబంధనలను ఉల్లంఘించి సమస్యలను కొనితెచ్చుకోవద్దని స్పష్టంగా కేటీయార్ చెప్పారు. లీగల్ సమస్యల్లో ఇరుక్కోవద్దని కూడా వార్నింగ్ ఇచ్చారు.

# ఎందుకంత నిరాసక్తత..!



ఖమ్మం : గతంలో సింగరేణిలో కొలువు అంటే ఎంతో ప్రియం. కష్టమైనా ఇబ్బందులను అధిగమిస్తూ ఇష్టంగా పనిచేసేవారు. అధిక వేతనాలకు తోడు కొలువుల విషయంలో బయట అవకాశాల లేమి ఇందుకు ప్రధాన కారణంగా ఉండేది. ప్రస్తుత పరిస్థితి అందుకు భిన్నంగా మారుతోంది. సింగరేణి కొలువుపై కొందరు ఉద్యోగుల్లో నిరాసక్తత అధికమైంది. విధుల్లో గైర్హాజరు అయ్యే వారి సంఖ్య క్రమేణా పెరుగుతుండటమే ఇందుకు నిదర్శనం. ప్రధానంగా యువతలో ఈ పరిస్థితి ఎక్కువగా ఉంది. నిబంధనల ప్రకారం ఏడాదికి కనీసం వంద మస్టర్లు ఉద్యోగులు పూర్తి చేయాలి. కానీ వాటిని కూడా పూర్తి చేయకుండా సింగరేణి వ్యాప్తంగా గత ఉత్పాదక సంవత్సరం వెయ్యి మందికి పైగా ఉద్యోగులు విధులకు గైర్హాజరయ్యారు. ఈ తరహా పరిస్థితులతో ఉత్పత్తి లక్ష్య సాధన పూర్తి చేయటం యాజమాన్యానికి పెద్ద తలనొప్పిగా మారింది. భూపాలపల్లి ఏరియాలో వంద మస్టర్లు పూర్తి చేయని 48మంది ఉద్యోగులను ఇటీవల యాజమాన్యం డిస్మిస్ చేసింది. ప్రభుత్వ ఉద్యోగం సంపాదించాలని వేల మంది నిరుద్యోగులు నిత్యం సాధన చేస్తున్నారు. కానీ గనిలో ఉద్యోగం పొందిన కొందరు విధులకు గైర్హాజరవుతూ భవిష్యత్తును అంధకారంలోకి నెట్టుకొంటున్నారు.

పరివర్తన లేదు

గైర్హాజరు అయ్యే వారు సక్రమంగా విధులు నిర్వర్తించేలా అధికారులు గనులవారీగా సదరు ఉద్యోగులకు, వారి కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు. అయినా చాలామందిలో ఎటువంటి మార్పు రావటం లేదు. చాలామేర కొరడా ఝుళిపించకుండా మానవీయ కోణంలో మార్పు కోసం ప్రయత్నిస్తుంది. గనుల వారిగా ఉన్న సంక్షేమ అధికారులు ఉద్యోగుల ఇళ్లకు వెళ్లి విధులకు హాజరు కావాలని నచ్చజెబుతున్నారు. పూర్తి స్థాయి మస్టర్లు లేకుంటే ఉద్యోగికి, సింగరేణి కలిగే నష్టాన్ని వివరిస్తూ హాజరు శాతం పెరిగేలా కృషి చేస్తున్నారు.

యువ ఉద్యోగులే ఎక్కువ

గైర్హాజరు అయ్యే వారిలో యువ ఉద్యోగులే ఎక్కువగా ఉంటున్నారు. గత తొమ్మిదేళ్ల నుంచి వారి సంఖ్య పెరుగుతూ వస్తుంది. కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగాలు పొందిన చాలామంది డిగ్రీ, బీటెక్, పీజీ వంటి ఉన్నత విద్య అభ్యసించిన వారై ఉంటున్నారు. వారికి తొలుత బదిలీ వర్కర్‌గా భూగర్భ గనుల్లో విధులు కేటాయిస్తున్నారు. ఒక్కసారిగా విధి నిర్వహణ వాతావరణం మారటంతో అసౌకర్యానికి గురవుతున్నారు. మరికొంత మంది ప్రైవేటు కొలువులు నిర్వరిస్తూ సింగరేణిలో విధులకు డుమ్మా కొడుతున్నారు. ఇంకొంత మంది అనారోగ్యంతో బాధపడుతున్నారు.

విధులకు హాజరుకాని వారికి ఎప్పటికప్పుడు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నాం.

వారిలో కొంత మార్పు ఉంటోంది. ఉద్యోగుల హాజరు శాతం పెరిగేలా ప్రయత్నిస్తున్నాం. గైర్హాజరుతో సింగరేణికి, ఉద్యోగికి నష్టం ఏర్పడుతుంది. అధికారులు సూచనలు పట్టించుకోకుండా విధులకు హాజరు కాని ఉద్యోగులపై చర్యలుంటాయి. దుర్గం రామచందర్, జీఎం, మణుగూరు.

# నాలుగు దిశల్లో ముదింపు

కొత్తగూడెం : పట్టణాల్లో ఉత్పత్తవుతున్న వ్యర్థాలను వేర్వేరుగా సేకరించడం, వాహనాల ద్వారా తరలించడం, యంత్రాలను ఉపయోగించి పునర్వినియోగించడం.. ఇలా వ్యర్థాలకు అర్థం కల్పిస్తూ ఆదాయంగా మలుస్తున్నారు. పౌరుల భాగస్వామ్యంతో పట్టణ పారిశుద్ధ్యం మెరుగుపర్చడం, ఆహ్లాద వాతావరణాన్ని కల్పిస్తున్న సంస్థలకు కేంద్రం ర్యాంకులు, అవార్డులు, నగదు ప్రోత్సహాకాన్ని అందజేస్తోంది. 2016 నుంచి కేంద్రం స్వచ్ఛసర్వేక్షణ్ పేరుతో కార్యక్రమాన్ని రూపొందించి అమలు చేస్తోంది. ఏటా కేంద్ర బృందాలు స్థానిక సంస్థల పనితీరును గుర్తిస్తున్నాయి. తాజాగా స్వచ్ఛ సర్వేక్షణ్ 2023




టూల్‌కిట్‌ను దిల్లీలో కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ కార్యదర్శి మనోజ్‌జోషి ఇటీవల విడుదల చేశారు. 2023లో ఆర్‌ఆర్‌ఆర్(రెడ్యూస్ రీసైకిల్ రీయూజ్)కు ప్రాధాన్యం ఇస్తున్నారు. ఇప్పటివరకు జరిగిన సర్వేల్లో మూడు దశలుండగా తాజాగా నాలుగు దశల్లో మదిస్తారు.

ఈసారి ఆర్‌ఆర్‌ఆర్‌కే ప్రాధాన్యం

స్వచ్ఛసర్వేక్షణ్ ఒక్కో ఏడాది ఒక్కో అంశాన్ని లక్ష్యంగా చేసుకుని పనులను నిర్దేశిస్తున్నారు. గతేడాది సామాజిక, బహిరంగ మరుగుదొడ్ల నిర్మాణం, తడి, పొడి వ్యర్థాలను వేరు చేయడం వంటి అంశాలను లక్ష్యంగా ఉంచారు. 2023లో వ్యర్థాలను పునర్వినియోగం చేసి ఆదాయాన్ని ఆర్జిస్తున్న పురపాలికలను గుర్తించనున్నారు. దీనినే ఆర్‌ఆర్‌ఆర్(రెడ్యూస్ రీయూజ్ రీసైకిల్)గా పిలుస్తున్నారు. దీనికి సంబంధించిన పనులు త్వరలో ప్రారంభం కానున్నాయి.

# వెనకబడితే టీసీ ఇచ్చేస్తారు!




ఖమ్మం : కూసుమంచి మండలానికి చెందిన దివ్యాంగురాలైన బాలిక, తండ్రిలేని మరో విద్యార్థిని.. కొణిజర్ల కేజీబీవీలో ఏడోతరగతి పూర్తిచేశారు. చదువులో వెనకబడ్డారనే సాకుతో వారి కుటుంబ సభ్యులను పిలిచి నాలుగు రోజుల క్రితం నిర్వాహకులు టీసీలు ఇచ్చారు. విద్యార్థులు బతిమిలాడినా కనికరించలేదు. తల్లిదండ్రుల్లేని పిల్లలు, చదువు మధ్యలో మానేసిన పేద విద్యార్థులే ఎక్కువ మంది కేజీబీవీల్లో చదువుతుంటారు. సాధారణంగా వీరు చదువులో కొంత వెనకబడి ఉంటారు. వీరిని తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదే. కొణిజర్ల కేజీబీవీలో ఉత్తీర్ణత శాతం ఆశించిన స్థాయిలో లేదనే సాకుతో వెనకబడిన విద్యార్థులను గుర్తించి ఏటా టీసీ ఇచ్చి పంపిస్తుండటం గమనార్హం.

కొణిజర్ల మండలం బస్వాపురం సమీపంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం మొదటినుంచి వివాదాలకు నిలయంగా మారుతోంది. పాఠశాలలో ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు 292 మంది విద్యార్థినులున్నారు. ఇక్కడ ఉపాధ్యాయులు రెండు వర్గాలుగా విడిపోయి పరస్పర ఫిర్యాదులు చేసుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. మెనూ పూర్తిస్థాయిలో అందించకున్నా అమలుచేసినట్లు, పరాయి వ్యక్తులు పాఠశాలకు వచ్చి అధిక సమయం ఇక్కడే ఉంటారని అందులో సిబ్బంది నుంచే ఫిర్యాదులు వస్తున్నాయి. విద్యాలయంలో సమావేశాలు, విధుల విషయంలో లోపభూయిష్ట నివేదికలు పంపిస్తున్నారనే విమర్శలున్నాయి. ఇటీవల కొందరు ఉపాధ్యాయులు తమ వద్దనున్న ఆధారాలతో కలెక్టర్‌ను కలిసేందుకు యత్నించగా అధికారులు సర్దిచెప్పారు.

విచారణ జరిపితే..కొణిజర్ల కేజీబీవీలో నిర్వాహకురాలు, ఉపాధ్యాయుల మధ్య తరచూ వివాదాలు తలెత్తుతున్నాయి. ఇటీవల నిర్వాహకురాలు అక్కడ పనిచేసే అటెండర్‌పైకి బాటిల్ విసిరేయడం, ఆమెకు దెబ్బతగలడంతో వివాదాస్పదమైంది. ఉన్నతాధికారులు విషయాన్ని నాలుగు గోడల మధ్య రాజీచేసి మిన్నకున్నారు. ఉపాధ్యాయులు రెండు వర్గాలుగా విడిపోయి సక్రమంగా బోధించటం లేదనే ఆరోపణలున్నాయి. ఇంకోపక్క చదువులో విద్యార్థులు వెనకబడితే టీసీలు ఇచ్చి పంపిస్తున్నారు. కలెక్టర్ స్పందించి విచారణ జరిపితే మరిన్ని విషయాలు వెలుగుచూస్తాయని విద్యార్థుల తల్లిదండ్రులు చెబుతున్నారు. పిల్లలకు టీసీలు ఇచ్చిన విషయం నా దృష్టికి రాలేదు. వివరాలు సేకరించి విచారణ చేపడతాం. అటెండర్‌తో గొడవ జరిగితే సర్దిచెప్పాం. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. శ్యాంసన్, ఎంఈఓ, కొణిజర్ల

# లారీలు రాక... కాంటాలు కాక

వేములవాడ : ఈ ధాన్యం బస్తా వద్ద కూర్చొన్న మహిళా రైతు పేరు కొంపల్లి లచ్చవ్వ. ఈమెది వేములవాడ గ్రామీణ మండలంలోని మల్లారం. ధాన్యం తీసుకొచ్చి వారం రోజులైంది. తేమ శాతం వచ్చినా లారీల కొరత కారణంగా కాంటా పెట్టలేదు. దీంతో రోజూ కుప్పను చూస్తూ ఇలా చెట్టు కింద కూర్చొంటుంది. లచ్చవ్వనే కాదు ఇలా చాలా మంది అన్నదాతలు ధాన్యం కాంటాలు కాక పడిగాపులు కాస్తున్నారు. ఆరుగాలం చెమటోడ్చి పండించిన ధాన్యం విక్రయించుకునేందుకు రైతులు కొనుగోలు కేంద్రాల్లో పడిగాపులు కాయాల్సిన దుస్థితి ఏర్పడింది. చాలా కేంద్రాల్లో లారీలు రాకపోవడంతో కేంద్రాల నిర్వాహకులు ధాన్యం కాంటాలు పెట్టడం లేదు. దీంతో కేంద్రాల్లో వేలాది క్వింటాళ్ల ధాన్యం కుప్పలు, కాంటాలైన బస్తాలు పేరుకుపోయాయి. పలు దఫాలుగా కురిసిన వర్షాలతో ఇబ్బందులు పడిన రైతులకు రోజూ ఆకాశంలో మబ్బులు కమ్ముకోవడం మరింత ఆందోళనకు గురిచేస్తోంది. జిల్లాలో యాసంగిలో 1.18 లక్షల ఎకరాల్లో రైతులు వరి పంటను సాగు చేశారు. ఈ సీజన్‌లో పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు సింగిల్ విండోలు, ఐకేపీ, డీసీఎంఎస్, మెప్మా ద్వారా 265 కొనుగోలు కేంద్రాలను అధికారులు ప్రారంభించారు. 3 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. జిల్లాలో కొనుగోళ్లు ప్రారంభమై దాదాపు 20 రోజులు కావస్తోంది. ఇప్పటి వరకు 1.20 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించినట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. తూకాలైన బస్తాలను మిల్లులకు తరలించడానికి అవసరమైన లారీలు, ఇతర వాహనాల కొరత కారణంగా చాలా కేంద్రాల్లో బస్తాలు పేరుకుపోతున్నాయి. మరోవైపు వర్షాల భయం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులను ఆందోళనకు గురిచేస్తోంది. తూకాలైన బస్తాలపై



టార్పాలిన్ కవర్లు కప్పి పెట్టారు. లారీలు వస్తే మిల్లులకు తరలించేందుకు ఎదురుచూస్తున్నారు. మరో వైపు కాంటాలు కాక రైతులు ధాన్యం కుప్పల వద్ద పడిగాపులు పడుతున్నారు.

వారం రోజులుగా నిరీక్షణ...లారీల కొరతతో కేంద్రాల్లో సకాలంలో ధాన్యం కాంటాలు కావడం లేదు. ఫలితంగా రైతులు తమ ధాన్యం కుప్పల వద్ద వారం రోజులుగా నిరీక్షిస్తున్నారు. చాలా చోట్ల రోజుల తరబడి కుప్పలు కాంటాలకు నోచుకోవడం లేదు. జిల్లాలో రోజూ 270 నుంచి 280 వరకు లారీల ధాన్యాన్ని తరలిస్తున్నట్లు అధికారులు చెబుతున్నప్పటికీ క్షేత్ర స్థాయిలో అలా జరగడం లేదు. కొన్ని ప్రాంతాల్లో రైసు మిల్లుల యజమానులు సకాలంలో లారీల నుంచి ధాన్యం బస్తాలను దింపుకోవడం లేదు. దీనివల్ల మిల్లుల వద్ద లారీలు నిలిచిపోయి ధాన్యం తరలింపులో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ధాన్యం తరలింపులో జరుగుతున్న జాప్యంతో కేంద్రాల్లో పెద్ద ఎత్తున నిల్వలు, కాంటాలైన బస్తాలు పేరుకుపోతున్నాయి. మిల్లుల్లో నిల్వలుండటంతో మిల్లుల యజమానులు ధాన్యం దింపుకునేందుకు వెనుకంజ వేస్తునట్లు తెలుస్తోంది. జిల్లాలో ఒక్కొక్క కేంద్రంలో దాదాపు రెండు, మూడు లారీల ధాన్యం బస్తాలు నిల్వ ఉన్నట్లు కర్షకులు పేర్కొంటున్నారు. ధాన్యం కాంటాలు పెడితే సమస్యలు ఎక్కువ అవుతుందని కేంద్రాల నిర్వాహకులు లారీల రాకను బట్టి తూకాలు వేస్తున్నారు. దీంతో రైతులు రోజుల తరబడి కుప్పల వద్ద నిరీక్షించాల్సిన దుస్థితి ఏర్పడింది.

కొనుగోళ్ల వేగవంతానికి చర్యలు- హరికృష్ణ, జిల్లా పౌరసరఫరాల మేనేజరుధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. సాధ్యమైనంత వరకు లారీల కొరత లేకుండా చూస్తున్నాం. జిల్లాలో ప్రతి రోజు 185 లారీల్లో ధాన్యం లోడ్ చేసి మిల్లులకు తరలిస్తున్నాం. లారీలతో పాటు డీసీఎం వ్యాన్లు, ట్రాక్టర్లను ధాన్యం తరలింపునకు వినియోగిస్తున్నాం. ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తూ చర్యలు తీసుకుంటున్నాం.

# రామాలయ పాలన గాడిన పడేనా..!

భద్రాచలం : భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారి ఆలయంలో గత ఏడాది రూ.40 కోట్ల వార్షిక బడ్జెట్ అమలు చేశారు. 2023-24లో రూ.44 కోట్లు ఉంటుందని అంచనా. ఏడాదికి 30 లక్షల మంది భక్తులు స్వామివారి దర్శనానికి వస్తున్నారు. నవమి ఉత్సవాలకు సందర్భంగా మొత్తంగా రూ.4 కోట్ల ఆదాయం సమకూరింది. ఖర్చులు పోను కొంత మిగులుతుందని అంచనా వేశారు. ఆలయానికి ఆదాయ వనరులున్నా ఆశించిన స్థాయిలో అభివృద్ధి లేదు. అడిగేందుకు ధర్మకర్తల మండలి లేదు. సమస్యల పరిష్కారానికి అధికారులే చొరవ తీసుకోవాల్సి ఉంది. నూతనంగా ఈవోగా బాధ్యతలు స్వీకరించిన రమాదేవి ఇటీవల పాలనాపరమైన అంశాల్లో కొంత దూకుడు ప్రదర్శిస్తున్నారు. అంతర్గత బదిలీలు చేసి తనిఖీ బృందాలను ప్రకటించారు.

కనీస సౌకర్యమైనా లేకపాయె..!

భక్తులకు సరైన సదుపాయాల కొరవడ్డాయి. అందుబాటులో మరుగుదొడ్లు లేకపోవడంతో గంటల తరబడి ఉగ్గపట్టి ఉండాల్సి వస్తోంది. కల్యాణకట్ట సమీపంలోని ఖాళీ ప్రదేశంలో వీటిని నిర్మించాలనే ప్రతిపాదనలు కార్యరూపు దాల్చలేదు. ఆలయ సిబ్బంది అవసరాలకు వీఐపీ మార్గంలోని పాత వాహనశాలలో మరుగుదొడ్లు ఉన్నాయి. స్టేడియం వద్ద కొన్ని మరమ్మతులకు గురయ్యాయి. దీంతో భక్తులకు అవస్థలు తప్పటం లేదు. స్వచ్ఛంద సంస్థ సహకారంతో తాగునీటి సమస్య కొంతమేర తగ్గింది.

భవిష్యత్తు అవసరాలను గుర్తించాలి

కేంద్ర ప్రభుత్వం 6 రాష్ట్రాల్లోని 11 ప్రాంతాలను కలుపుతు రామాయణ వలయం రైలు నడుపుతున్నారు. ఇందులో భద్రాచలానికి ప్రాధాన్యం ఉన్నందున రానున్న రోజుల్లో యాత్రికుల తాకిడి తప్పదు. రాష్ట్రపతి ముర్ము ఇటీవల ఇక్కడకు పర్యాటక పనులకు శంకుస్థాపన చేశారు. ఇవి పూర్తయితే టూరిజానికి కొత్తందాలు సమకూరుతాయి. ఇప్పుడున్న



వసతి సదుపాయం రానున్న రోజుల్లో సరిపోదు. కొన్ని కుటీరాలు పూర్తిగా దెబ్బతినడంతో వాడడం మానేశారు. పూర్తయినవాటిని స్వాధీనం చేసుకోకుండా తాత్సారం చేస్తున్నారు.

ఉద్యోగుల సంగతేంటి..

నెల క్రితం ఓ ఉప ప్రధానార్చకుని ఉద్యోగ విరమణతో సీనియర్ ముఖ్య అర్చకుడు మురళీకృష్ణమాచార్యులుకు ఉద్యోగోన్నతి కల్పిస్తున్నారు. వచ్చే నెల మరో ముఖ్య అర్చకుడు, ఇద్దరు వాద్య విద్వాంసులు ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఈ ఖాళీలను భర్తీ చేసే చర్యలు అవసరం. ఓ అర్చకుడు ఏడాది నుంచి సెలవుల్లో ఉన్నారు. ఇంకో ఉద్యోగి ప్రత్యేక కారణాలతో విధులు మానేసి ఇటీవల వచ్చారు. తిరిగి విధుల్లో చేరేందుకు కమిషనర్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. ఇలాంటి అంశాలపైనా దృష్టి సారిస్తేనే సిబ్బంది కొరతను నియంత్రించే వీలుంటుంది.

# 'లెక్క' తప్పుతోంది!

హైదరాబాద్: కరోనా వ్యాప్తి తర్వాత తెలంగా ణ సహా వివిధ రాష్ట్రాల్లో పాఠశాల స్థాయిలో విద్యా ర్థుల అభ్యసన దిగజారుతున్నట్లు తాజా అధ్యయనం తేల్చింది. ముఖ్యంగా గణితంలో 49 శాతం మంది విద్యార్థులు కనీస సామర్థ్యాలు కనబర్చలేకపోతు న్నారని జాతీయ విద్య, పరిశోధన, శిక్షణ మండలి (ఎన్‌సీఈఆర్టీ) సర్వేలో వెల్లడైంది. ప్రధాన రాష్ట్రాల్లో మాతృభాషలతోపాటు గణిత సామర్థ్యంపై ఈ అధ్యయనం జరిగింది.దేశవ్యాప్తంగా మొత్తం 10 వేల ప్రభుత్వ, ప్రైవేటు ఎయిడెడ్ పాఠశాలల్లో దాదాపు 90 వేల మంది విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించగా రాష్ట్రం నుంచి 180 స్కూళ్లకు చెందిన 1,500 మందికిపైగా విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించా రు. ఈ అధ్యయనం ప్రకారం కరోనా తర్వాత చదవ డం, రాయడం విద్యార్థుల్లో పూర్తిగా సన్నగిల్లింది. మాతృభాషలో కనీసం చదవలేని పరిస్థితి ఉన్నవాళ్లు 19 శాతంగా తేలారు.

పట్టుమని పది పదాలు తప్పు లు లేకుండా చదవగలిగిన వారు 6 శాతం, 20 పదాలు చదివిన వాళ్లు 13 శాతమే ఉన్నారు. ఇక 70 పదాలు తప్పులు లేకుండా చదవగలిగే వాళ్లు 12 శాతంగా తేలారు.



లెక్కల్లో బేసిక్స్ కూడా తెలియని విద్యార్థులు ఎక్కువమంది ఉన్నారు. ముఖ్యంగా మూడవ తరగతి వరకూ కనీసం అంకెలు కూడా గుర్తించలేని పరిస్థితి కనిపించింది.

రెండంకెల కూడి కలు, తీసివేత లు కూడా చేయలేని స్థితిలో 43 శాతం విద్యార్థులు మూడో తరగతిలో ఉన్నట్లు సర్వే గుర్తించింది. గతేడాది రాష్ట్ర విద్యాశాఖ జరిపిన పరిశీల నలో సైతం గణితంలో సగం మందికిపైగా టెన్త్ విద్యా ర్థులు క్లిష్టమైన లెక్కలు చేయలేకపోతున్నారని వెల్లడైంది. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే ఇంజనీ రింగ్ విద్య వరకూ వచ్చే విద్యార్థుల్లో నాణ్యతా ప్రమాణాలు లోపించే అవకాశాలున్నాయని నిపు ణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# వణికిస్తున్న జ్వరాలు



జగిత్యాల : వాతావరణంలో అనూహ్య మార్పులు చోటుచేసుకోవడంతో కాలానుగుణ వ్యాధులు ప్రబలుతున్నాయి. మొన్నటి వరకు ఉక్కపోత వెంటనే తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో జ్వరాల తీవ్రత పెరిగింది. మూడు నెలలుగా జిల్లాలో డెంగీ జ్వరాల ప్రభావం అంతంత మాత్రంగానే ఉంది. గడిచిన పది రోజుల్లో అన్ని మండలాల్లోనూ డెంగీ కేసులు నమోదవుతుడటం ఆందోళన కలిగిస్తోంది. ప్రభుత్వ ఆసుపత్రులతోపాటు ప్రైవేటు ఆసుపత్రుల్లో జ్వరపీడితుల సంఖ్య పెరిగింది. అత్యధికంగా సాధారణ జ్వరాలే అయినప్పటికీ డెంగీపై ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. కలెక్టర్ యాస్మిన్‌బాషా, జిల్లా వైద్యాధికారి పి.శ్రీధర్ ఆదేశాల మేరకు జిల్లాలో ఇంటింటి సర్వే కొనసాగుతోంది. ఇందులో అధికంగా జ్వరాల కేసులు బయటపడుతున్నాయి. మరో వారంపాటు సర్వే కొనసాగుతోంది. వారం రోజులుగా జిల్లా ప్రధాన ఆసుపత్రిలో ఓపీతోపాటు జ్వరాలకు సంబంధించిన కేసులు రెట్టింపయ్యాయి. త్వరలో మరిన్ని కేసులు వెలుగుచూసే అవకాశం ఉంది.

పరిసరాల పరిశుభ్రతే ప్రధానం..

జిల్లాలో డెంగీ ఇతర విషజ్వరాల నిర్మూలనకు పరిసరాల పరిశుభ్రతే ప్రధానమని వైద్య అధికారులు స్పష్టం చేస్తున్నారు. వైద్యశాఖ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీల్లో ప్రత్యేక పారిశుద్ధ్య చర్యలు చేపడుతున్నారు. బావుల్లో క్లోరినేషన్ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రతి ఇంట్లోనూ దోమ తెరలు వాడాలని సూచిస్తున్నారు. మురుగుకాల్వలు శుభ్రం చేయాలని నీరు నిలవకుండా జాగ్రత్తలు పాటించాలని చెబుతున్నారు. మురుగు ఉన్న పొంతాల్లో గంబూసియా చేపలు వదలాలని జిల్లాలో ప్రతి శుక్రవారం డ్రైడే పాటించి పరిసరాలు శుభ్రం చేయాలని అవగాహన కల్పిస్తున్నారు.

విస్తరిస్తున్న డెంగీ..

జిల్లాలో క్రమంగా డెంగీ కేసులు నమోదవుతున్నాయి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో పరిశీలిస్తే.. కొడిమ్యాలలో 3, మల్లాపూర్ 1, గొల్లపల్లి 2, పెగడపల్లి 2, మల్యాల 3, రాయికల్ 6, మేడిపల్లి 8, సారంగపూర్ 1, వెల్గటూర్ 2, జగ్గాసాగర్ 3, అయిలాపూర్ 1, ఇబ్రహీంపట్నం 1, జగిత్యాల మోతెవాడ 1, జెఎస్‌రాంవెల్ 1 మొత్తం 35 డెంగీ కేసులు నమోదయ్యాయి. వీరికి ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో చికిత్సనందిస్తున్నారు. కాలానుగుణ వ్యాధుల తీవ్రతపై గత నెలలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు వైద్య సిబ్బందికి చేపట్టాల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు. ఈ మేరకు అన్ని ఆసుపత్రుల్లోనూ అవసరమైన మందులు అందుబాటులో ఉంచారు. మలేరియా, డెంగీ కేసుల కోసం ప్రత్యేక కిట్లు సిద్ధం చేశారు. జ్వర పీడితుల రక్తనమూనాలను సేకరించి రోగ నిర్ధారణ పరీక్ష కేంద్రానికి పంపుతున్నారు.

బయటి ఆహారం తీసుకోవద్దు ఎన్.శ్రీనివాస్, జిల్లా ఉప వైద్యాధికారిప్రజలు బయట దొరికే ఆహార పదార్థాలు తీసుకోకపోవడమే శ్రేయస్కరం. ఎలాంటి అనుమానాలున్నా సమీపంలోని ఆరోగ్య కేంద్రాలకు వెళ్లి రక్తనమూనాలు ఇవ్వాలి. జ్వరం ఉన్నట్లయితే సొంత వైద్యం జోలికి వెళ్లొద్దు. వైద్యుడు లేదా ఆరోగ్యకేంద్రానికి వెళ్లి చికిత్స తీసుకోవాలి. చేతులు ప్రతిసారీ శుభ్రం చేసుకోవాలి.

# కొనుగోళ్లకు సన్నద్ధం

జనగామ : జిల్లాలో వర్షాకాలం ధాన్యం కొనుగోలుకు సంబం ధించి జిల్లా యంత్రాంగం సిద్ధమవుతోంది. కొను గోలు కేంద్రాల ఏర్పాటు, అవసరమైన వసతుల కల్పన, నిర్వాహకులకు శిక్షణ వంటి అంశాలపై అధి కారులు కసరత్తు చేస్తున్నారు. ఓ వైపు అధికారులంతా ఎన్నికల హడావిడిలో ఉన్నప్పటికీ రైతులకు ఇబ్బంది కలగకుండా ధాన్యం కొనుగోళ్లను సైతం సజావుగా నిర్వహించాలని భావిస్తున్నారు. జిల్లావ్యాప్తంగా వరి కోతలు ప్రారంభం అవుతుండడంతో కొనుగోలు ప్రక్రి యను మొదలు పెట్టాలని యంత్రాంగం నిర్ణయించింది. ఒకటి, రెండు రోజుల్లో కేంద్రాల నిర్వాహకులకు శిక్షణ ఇచ్చి దసరా తర్వాత సెంటర్లను ప్రారంభించాల ని నిర్ణయానికి వచ్చారు. జిల్లాలో గత వానాకాలం వచ్చిన దిగుబడి, సేకరణను బట్టి ఈ ఏడాది దిగుబ డిని అంచనా వేసుకొని అందుకు తగ్గట్లుగా కొనుగోళ్ల కోసం ఏర్పాట్లు చేశారు. కొనుగోళ్లకు సంబంధించి సంబంధిత అధికారులతో కలెక్టర్ సీహెచ్.శివలింగయ్య ఇటీవల సమావేశం ఏర్పాటు చేసి దిశానిర్దేశం చేశారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున కొనుగోలు, రవా ణాలో ఇబ్బందులు ఎదురుకాకుండా పకడ్బం దీగా వ్యవహరించాలని ఆదేశించారు.

జిల్లాలో 177 కొనుగోలు కేంద్రాలు

వానాకాలం వడ్ల కొనుగోలుకు సంబం ధించి జిల్లాలోని 12 మండలాల పరిధిలో 177 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాల ని అధికారులు నిర్ణయించారు. గత ఏడాది వానాకాలం సీజన్‌లో 175 కేంద్రాలను ఏర్పాటు చేయగా ఈసారి అదే స్థాయిలో 177 కేంద్రాలను ప్రారంభించనున్నారు. ఇందులో ఐకేపీ ఆధ్వర్యంలో 80, పీఏసీఎస్‌ల ఆధ్వ ర్యంలో 97 కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. గత ఏడాది ఇదే సీజన్‌లో జిల్లావ్యాప్తంగా 1.74 లక్షల ఎకరా ల్లో వరి సాగు చేయగా 2.50 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం సెంటర్లకు వస్తుందని భావించా రు. కాని 1.11 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే వచ్చింది. కాగా.. ఈ సీజన్‌లో 1.90 లక్షల ఎకరాల్లో సాగు చేయ గా 2.30 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అంచనా వేస్తున్నారు. దిగుబడి అయిన ధాన్యంలో రైతులు తినడానికి సన్నరకం ఉం చుకోగా కేంద్రాలకు గత ఏడాది లాగే సుమారు 1.10 లక్షల మెట్రిక్ టన్నుల నుంచి 1.50 లక్షల మెట్రిక్ టన్నుల వరకు సెంటర్లకు వస్తుం దని భావిస్తున్నారు. ధాన్యం కొనుగోళ్ల కోసం 28 లక్షల గన్నీ సంచులు అందుబాటులో ఉంచారు. వీటితో పాటు కాంటాలు, టార్పాలిన్లు, ప్యాడీ క్లీనర్లు, మాయిశ్చర్ మిషన్లను అందుబాటులో ఉంచినట్లు అధికారులు చెబుతున్నారు.

దసరా తర్వాత కేంద్రాల ప్రారంభం

జిల్లాలో వానాకాలం సీజన్‌కు సంబంధించిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను దసరా తర్వాత ప్రారంభించాలని అధికారులు భావిస్తున్నారు. జిల్లాలో ఇప్పటికే ఎడగారు పంట ధాన్యం కోతలు పూర్తయ్యాయి. జిల్లాలో ఈ సీజన్‌లో సుమారుగా 15 వేల మెట్రిక్ టన్నుల వరకు ఎడగారు పంట ధాన్యం వచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. కాగా.. వానాకాలం కోతలు కూడా అక్కడక్కడ ప్రారంభం కావడంతో త్వరితగతిన కేంద్రాలను ప్రారంభించాలని అధికారులు సన్నద్ధం అవుతున్నారు.

సెంటర్ల ఏర్పాటుకు సంబంధించి కసరత్తు దాదాపు గా పూర్తయింది. దసరా తర్వాత ప్రారంభించనున్నారు. కేంద్రాల నిర్వాహకులకు ఒకటి, రెండు రోజుల్లో శిక్షణ ఇచ్చి ప్రారంభించాలని భావిస్తున్నారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ఎటువంటి ఆర్భాటం లేకుండా సాదాసీదాగానే కేంద్రాలను ప్రారంభించనున్నారు.

కొనుగోళ్లకు ఏర్పాట్లు చేస్తున్నాం..– రోహిత్‌సింగ్, అదనపు కలెక్టర్

వానాకాలం ధాన్యం కొనుగోళ్లను సజావుగా నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నాం. జిల్లాలోని 12 మండలాల పరిధిలో 177 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని నిర్ణయించాం. ఇందుకు సంబంధించిన కసరత్తు దాదాపుగా పూర్తయింది. ఒకటి, రెండు రోజుల్లో కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు శిక్షణ ఇచ్చి దసరా తర్వాత కేంద్రాలను ప్రారంభిస్తాం. ధాన్యం అమ్మకం, విషయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నాం.

# మూడో వంతు స్థానాల్లో.. ముస్లింలే కీలకం

హైదరాబాద్: రాష్ట్రంలోని మొత్తం 119 అసెంబ్లీ సెగ్మెంట్లకు గాను మూడింట ఒక వంతు స్థానాల్లో ముస్లింల ఓట్లే కీలకం కానున్నాయి. ఈ ఓటర్లు ఎవరి వైపు మొగ్గు చూపితే.. వారి గెలుపు కాస్త సులభతరం అయ్యే అవకాశం ఉందని రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. రాష్ట్రంలో దాదాపు 14% వరకు ముస్లింల జనాభా ఉండగా 40 వరకు నియోజకవర్గాల్లో వీరి ప్రభావం ఉంటుందని అంచనా వేస్తున్నారు. అంటే వీరి మద్దతు పొందిన పార్టీ గెలుపు అవకాశాలు ఎక్కువగా ఉంటాయనే విషయం స్పష్టమవుతోంది. ఈ కారణంగానే పోటీలో ఉన్న ప్రధాన పార్టీలు వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో వారిని తమ వైపు ఆకర్షించేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నాయి. అయితే ఈసారి ముస్లింలు ఎవరికి మద్దతు పలికే అవకాశం ఉందనేది ఆసక్తికరంగా మారింది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తరువాత మెజారిటీ వర్గం ప్రధానంగా తెలంగాణ రాష్ట్ర సమితి (ప్రస్తుతం బీఆర్ఎస్)కే మద్దతు ఇస్తూ వచ్చింది. అంతకుముందు వీరు కాంగ్రెస్ పార్టీ ఓటు బ్యాంకుగా ఉన్న సంగతి తెలిసిందే. 2004లో ఉమ్మడి రాష్ట్రంలో జరిగిన ఎన్నికల సమయంలో డాక్టర్ రాజశేఖరరెడ్డి ముస్లింలకు బీసీ రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇవ్వడమేకాక.. ఆ వాగ్దానాన్ని నెరవేరుస్తూ ఆయన అధికారంలోకి వచ్చిన తరువాత నాలుగు శాతం రిజర్వేషన్లు కల్పించారు. తర్వాత 2014 ఎన్నికల నుంచి బీఆర్ఎస్‌కు ముస్లింలు మద్దతుగా నిలిచారు. ఎంఐఎం) పూర్తిస్థాయి సహకారం ఈ పార్టీకి లభిస్తూ వస్తోంది.

ఈసారి కూడా ఎంఐఎం పార్టీ పోటీ చేస్తున్న స్థానాల్లో మినహా మిగతా చోట్ల పార్టీ కార్యకర్తలతో పాటు యావత్ ముస్లింలు బీఆర్ఎస్‌కు మద్దతివ్వాలంటూ ఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ ఒక ప్రకటనలో బహిరంగంగానే విజ్ఞప్తి చేశారు. కానీ ఈసారి పరిస్థితిలో కాస్త మార్పు వచ్చే అవకాశం ఉందని, ఆ పార్టీ వర్గాల్లోనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. గంపగుత్తగా ఓట్లు పడే అవకాశం లేదంటూ.. కర్ణాటక ఎన్నికల్లో అక్కడి ముస్లింలు జేడీఎస్‌ను కాంగ్రెస్‌కు బాసటగా నిలవడాన్ని వారు గుర్తు చేస్తున్నారు. ఇక్కడ కూడా ఆ విధమైన వాతావరణం ఏర్పడే చాన్స్‌ను తోసిపుచ్చలేమని అంటున్నారు.

రాజధాని నియోజకవర్గాలతో పాటు..: హైదరాబాద్ నగర పరిధిలోని యాకుత్‌పురా, చాంద్రాయణగుట్ట, చార్మినార్, మలక్‌పేట, బహదూర్‌పురా, నాంపల్లి, కార్వాన్, ఖైరతాబాద్, సనత్‌నగర్, జూబ్లీహిల్స్, శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్, అంబర్‌పేట, ముషీరాబాద్ నియోజకవర్గాల్లో ముస్లిం ఓట్లు అధికంగా ఉన్నారు.

అదే విధంగా ఉమ్మడి మెదక్ జిల్లాలోని సంగారెడ్డి, జహీరాబాద్, ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని నిజామాబాద్ అర్బన్, బోధన్, కామారెడ్డి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఆదిలాబాద్, ముధోల్, ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని కరీంనగర్, జగిత్యాల, ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వరంగల్ ఈస్ట్, వరంగల్ వెస్ట్, ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని నల్లగొండ, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని మహబూబ్‌నగర్, నారాయణపేట, ఉమ్మడి రంగారెడ్డిలోని తాండూరు, మల్కాజిగిరి, మహేశ్వరం, వికారాబాద్ అసెంబ్లీ సెగ్మెంట్లలో ముస్లిం ఓటర్లు అధిక సంఖ్యలో ఉన్నట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. కాగా వీరి మద్దతుతో ముఖ్యంగా హైదరాబాద్ పాతబస్తీయేతర నియోజకవర్గాల్లో పాగా వేయాలని అధికార బీఆర్ఎస్, ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ ప్రయత్నిస్తున్నాయి.

ఆ మూడూ ఒక్కటే అంటూ కాంగ్రెస్...: కర్ణాటకలో గెలుపుతో ఉత్సాహంగా ఉన్న కాంగ్రెస్ ఈసారి ఎలాగైనా మైనారిటీలను తమ వైపు తిప్పుకునేందుకు శతవిధాలా ప్రయత్నిస్తోంది. అందులో భాగంగానే బీజేపీకి బీఆర్ఎస్ బీ టీంగా వ్యవహరిస్తోందని, బీజేపీతో రహస్య ఒప్పందం కుదుర్చుకుందని ఆరోపిస్తూ విస్తృతంగా ప్రచారం చేస్తోంది. మైనారిటీలకు రిజర్వేషన్లు కల్పించింది కాంగ్రెస్ పార్టీయేనంటూ గుర్తు చేస్తోంది.

ముందు నుంచి మైనారిటీలపై కాంగ్రెస్‌ది సానుకూల దృక్పథమేనని చెబుతోంది. బీజేపీ, బీఆర్ఎస్, ఎంఐఎం పార్టీలు మూడూ ఒక్కటేనని, అంతర్గత అవగాహనతో పనిచేస్తున్నాయనే ప్రచారాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లే ప్రయత్నం చేస్తోంది. ఇతర రాష్ట్రాలలో కాంగ్రెస్ పార్టీ బలంగా ఉన్న ఇతర రాష్ట్రాలలోని సీట్లలో ఎంఐఎం పోటీ చేస్తూ బీజేపీకి సహకరిస్తోందని ఆరోపిస్తోంది. మైనారిటీల సంక్షేమానికి భవిష్యత్తులో కూడా కట్టుబడి ఉంటామని గట్టిగా హామీ ఇస్తోంది.

సంక్షేమ పథకాలే ఆలంబనగా బీఆర్ఎస్..: మైనారిటీలను ఆకట్టుకోవడానికి బీఆర్ఎస్ గడచిన తొమ్మిదిన్నరేళ్లుగా ఆ వర్గానికి అందించిన సంక్షేమ పథకాలపైనే భరోసా పెట్టుకుంది. ఈసారి కూడా ముస్లింలు తమకే మద్దతు పలుకుతారనే ధీమాతో ఉంది. అదే సమయంలో వారు తమ చేజారే అవకాశం లేకుండా.. తాము బీజేపీతో ఎట్టిపరిస్థితుల్లోనూ కలిసే అవకాశం లేదంటూ స్పష్టత ఇచ్చే ప్రయత్నం చేస్తోంది.

కాంగ్రెస్, బీజేపీ పార్టీలే పరస్పరం సహకరించుకుంటున్నారంటూ ప్రతి విమర్శలు చేస్తోంది. మరోవైపు మైనారిటీలకు రాజకీయంగా అవకాశాలు కల్పించడమేకాకుండా..మంత్రివర్గంలో కీలకమైన పదవిని ఆ వర్గానికి ఇచ్చిన విషయాన్ని గుర్తు చేస్తోంది. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో మత సామరస్యం కొనసాగుతుండటాన్ని, కర్ఫ్యూల్లాంటివి లేకుండా ప్రజలు ప్రశాంతంగా జీవిస్తుండటాన్ని కూడా ప్రధానంగా ప్రస్తావిస్తోంది.

ఇటీవలి బహిరంగ సభల్లో సీఎం కేసీఆర్..వినాయక నిమజ్జన సమయంలో ముస్లింలు పెద్ద మనస్సు చేసుకుని మిలాద్ ఉన్ నబీ ఊరేగింపును వాయిదా వేసుకున్నారంటూ పదే పదే గుర్తు చేయడం ద్వారా ఆ వర్గానికి మరింత చేరువయ్యేందుకు ప్రయత్నిస్తున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతుండటం కూడా గమనార్హం.

# గోదావరి కావేరి అనుసంధానంపై మళ్లీ కదలిక

హైదరాబాద్: గోదావరి కావేరి నదుల అనుసంధానం ప్రాజెక్టు విషయంలో ముందడుగు వేసేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమైంది. నవంబర్ 3న హైదరాబాద్‌లో ఇందుకు సంబంధించిన రెండు కీలక సమావేశాలను నిర్వహించతలపెట్టింది. ఉదయం 11.30 గంటలకు నేషనల్ వాటర్ డెవలప్ మెంట్ ఏజెన్సీ(ఎన్‌డబ్ల్యూడీఏ) డైరెక్టర్ జనరల్ భోపాల్ సింగ్ ఆధ్వర్యంలో గోదావరి%--%కావేరి నదుల అనుసంధానంపై వేసిన స్టాండింగ్ కమిటీ ఐదో సమావేశం నిర్వహించాలని కేంద్రం నిర్ణయించింది. అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు నదుల అనుసంధానంపై ఏర్పాటు చేసిన టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశం కూడా చైర్మన్ వెదిరే శ్రీరామ్ అధ్యక్షతన జరగనుంది. ఉదయం జరిగే సమావేశంలో మెమోరాండం ఆఫ్ అండర్‌స్టాండింగ్ (ఎంఓయూ)ముసాయిదాను ఆయా రాష్ట్రాలకు అందజేయనున్నారు. చివరిసారిగా జరిగిన 4వ స్టాండింగ్ కమిటీ సమావేశంలో గోదావరిపై ఎక్కడ బ్యారేజీ నిర్మించి నీళ్లను తరలించాలనే అంశంపై ఎన్‌డబ్ల్యూడీఏ ఆధ్వర్యంలో అధ్యయనం జరపా లని నిర్ణయం తీసుకున్నారు. ఈ నేపథ్యంలో ఇచ్చంపల్లి వద్దే గోదావరిపై బ్యారేజీ నిర్మించాలని తాజాగా ఎన్‌డబ్ల్యూడీఏ నిర్ణయం తీసుకున్నట్టు తెలిసింది. దీనిపై నవంబర్ 3న జరగనున్న స్టాండింగ్ కమిటీ, టాస్క్‌ఫోర్స్ సమావేశాల్లో విస్తృతంగా చర్చించి అన్ని రాష్ట్రాల సమ్మతి పొందాలని ఎన్‌డబ్ల్యూడీఏ భావిస్తోంది. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం వినియోగించుకోని 141 టీఎంసీల గోదావరి జలా లను గోదావరి%--%కావేరి అనుసంధానం ప్రాజెక్టులో భాగంగా



తరలించాలని గతంలో నిర్ణయం తీసుకోగా, తాజాగా ఆ పరిమాణాన్ని 151 టీఎంసీలకు పెంచాలని నిర్ణయం తీసుకున్నారు. దీంతో కర్ణాటక కోటాను 19 టీఎంసీలకు పెంచనున్నారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం వాడుకోని 151 టీఎంసీల నీళ్లను తరలించడానికి ఆ రాష్ట్ర ప్రభుత్వం నిరభ్యంతర పత్రం జారీ చేస్తేనే ఈ ప్రాజెక్టు విషయంలో ముందుకు వెళ్లాలని ఇప్పటికే తెలంగాణ, ఏపీ రాష్ట్రాలు కోరాయి. ఈ నేపథ్యంలో నవంబర్ 3న జరగనున్న సమావేశాల్లో ఎలాంటి నిర్ణయాలు ఉంటాయోనన్నది ఆసక్తికరంగా మారింది.

# ఖాళీ ప్లాట్లు.. దోమలతో పాట్లు

మహబూబాబాద్:రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా నగరంలో దోమల సమస్య తీవ్రంగా ఉంది. ఉదయం, పగలు, రాత్రి అనే తేడా లేకుండా స్వైరవిహారం చేస్తున్నాయి. దోమ కాటుతో ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు. గ్రేటర్ వరంగల్ పరిధిలో దోమల సమస్యకు ప్రధాన కారణం కాలనీల్లో ప్రైవేటు ఖాళీ స్థలాలేనని తేల్చారు. ఇళ్ల మధ్య సంవత్సరాల తరబడి వృథాగా ఉంటున్న ఖాళీ స్థలాలు(ప్లాట్లు) వ్యర్థాలకు నిలయాలుగా మారాయి. చుట్టుపక్కల ఇళ్లలో పోగవుతున్న చెత్తాచెదారాన్ని వీటిలో పడేస్తున్నారు. వర్షా కాలం వచ్చేసరికి వాన నీళ్లు నిలిచిపోయి దోమలకు ఆవాసాలుగా మారుతున్నాయి. కోట్లాది లార్వా దోమలు పుట్టుకొస్తున్నాయి. కాలనీల ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు.

కంటితుడుపు చర్యలు..నగరంలోని 66 డివిజన్లలో 3500 పైచిలుకు ప్రైవేటు ఖాళీ స్థలాలు(ప్లాట్లు) ఉన్నాయని బల్దియా ప్రజారోగ్యం, అర్బన్ మలేరియా విభాగాల లెక్కలు చెబుతున్నాయి. ఏటా వర్షాకాలంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, జవాన్లు కాలనీల్లో తిరిగి ఖాళీ ప్లాట్ల వివరాలు సేకరిస్తున్నారు. యజమాని పేరు, ఎక్కడ ఉంటారు.., ఎన్నేళ్ల నుంచి స్థలం వృథాగా ఉంటుంది.. తదితర వివరాలు సేకరించారు. 550 మంది యజమానులకు నోటీసులు ఇచ్చారు. కేవలం 20–30 స్థలాలు శుభ్రం చేయించారు. తదుపరి చర్యలు తీసుకోవడం లేదు.

నిబంధనల ప్రకారం ప్రజారోగ్య భద్రత దృష్ట్యా ప్రైవేటు ఖాళీ స్థలాలపై చర్యలు తీసుకునే అధికారం బల్దియా' కమిషనర్‌కు ఉంది. ఖాళీ స్థలాన్ని శుభ్రం చేసుకోవాలని సంబంధిత యజమానికి నోటీసు జారీ చేయాలి. వారం, పది రోజుల్లో సమయం ఇవ్వాలి. స్పందించకపోతే యజమానికి రూ.25వేల వరకు జరిమానా విధించాలి. యజమాని ఇక్కడ లేకపోతే స్థలాన్ని నగరపాలక సంస్థ స్వాధీనం చేసుకోవాలి. ప్రజారోగ్యం, అర్బన్ మలేరియా విభాగాలు ఖాళీ స్థలాలపై చర్యలు తీసుకోకుండా అధికారులు ఉత్తిత్తి నోటీసులు ఇచ్చేసి చేతులు దులుపుకుంటున్నారు. స్థలాలు శుభ్రం చేయడం లేదు. యజమానులపై జరిమానాలు విధించడం లేదు.

ఎక్కడెక్కడ స్థలాలు ఉన్నాయంటే..వరంగల్ ప్రాంతంలో ఎన్టీఆర్ నగర్, సాయినగర్, గాయత్రి కాలనీ, బృందావన్ కాలనీ, సంతోషిమాత కాలనీ, బ్యాంకు కాలనీ, మర్రి వెంకటయ్య కాలనీ, ఆటోనగర్, దేశాయిపేట, కాశీబుగ్గ, పద్మ నగర్, ఎనుమాముల, మధురానగర్, లక్ష్మీగణపతి కాలనీ, సాయి గణేశ్ కాలనీ, లేబర్ కాలనీ, చింతల్, శివనగర్, విశ్వనాథ కాలనీ, గిర్మాజీపేట, శంభునిపేట, రంగశాయిపేట, ఉర్సు, ఎస్ఆర్ఆర్ తోట, విద్యానగర్, ఏకశిలానగర్, జన్మభూమి జంక్షన్ రోడ్ ఖాళీ స్థలాలున్నాయి.

హనుమకొండ ప్రాంతంలో కాకతీయ కాలనీ, యాదవనగర్, రెడ్డికాలనీ, బాలసముద్రం, పద్మాక్షి కాలనీ, ఎస్బీహెచ్ కాలనీ, వడ్డేపల్లి, ప్రశాంత్ నగర్, ఎఫ్‌సీఐ కాలనీ, వెంకటాద్రినగర్, సోమిడి, డీజిల్ కాలనీ, దర్గా, ప్రగతినగర్, ఎన్ఐటీ ఉద్యోగుల కాలనీ

ఇళ్ల మధ్య మురికి కూపాలు– హరి, గిర్మాజీపేట, వరంగల్

ఇళ్ల మధ్య ప్రైవేటు ఖాళీ స్థలాలు మురికి కూపాల్లా మారాయి. వానాకాలం వచ్చిందంటే చాలు వరదనీరు ఆగుతుంది. లక్షల కొద్దీ దోమలు పుట్టుకొస్తున్నాయి. సంబంధిత స్థలాల యజమానులపై చర్యలు తీసుకోవడం లేదు. అధికారులు కఠినంగా వ్యవహరించాలి. ప్రజలు రోగాల బారిన పడకుండా చూడాలి.

దోమలతో ఇబ్బందులు– టి.మంజుల, కాశీబుగ్గ

దోమలతో అల్లాడుతున్నాం. తలుపు తీస్తే చాలు దోమలు ఈగల్లా వాలుతున్నాయి. కాశీబుగ్గ, పద్మనగర్‌లో ఇళ్ల చుట్టూ ఖాళీ ప్లాట్లు ఉన్నాయి. చాలామంది చెత్తాచెదారం పడేస్తున్నారు. వాన పడగానే నీళు అన్నీ చేరుతున్నాయి. మూడు, నాలుగు నెలలు ఇబ్బందులు తప్పడం లేదు.

నోటీసులు జారీ చేస్తాం..– డాక్టర్ రాజేష్, ముఖ్యఆరోగ్యాధికారి

నగరంలోని 66 డివిజన్లలో గుర్తించిన ప్రైవేటు ఖాళీ స్థలాల యజమానులకు నోటీసులు జారీ చేస్తాం. సమస్య తీవ్రంగా ఉన్న స్థలాలు చదును చేయించి, యజమానులకు జరిమానా విధిస్తాం. దోమల నివారణ చర్యలు మరింత ముమ్మరంగా సాగుతున్నాయి.

నీటి కుంటలు.. తుప్ప పొదలతో చిత్తడి

నర్సంపేటలో ఇళ్ల మధ్య ఉన్న ఖాళీ స్థలాల్లో వర్షపు నీటి నిల్వలు, తుమ్మలు, పిచ్చిమొక్కలు, పొదలు, తుప్పలతో నిండిఉన్నాయి. పట్టణ ప్రగతిలో ఖాళీ స్థలాలను శుభ్రం చేయిస్తామని చెప్పి మాటలు కార్యరూపం దాల్చలేదు. పరిసరాల అపరిశుభ్రతతో దోమకాటుకు గురై మలేరియా, డెంగీ వంటి జబ్బులతో ఆసుపత్రుల పాలవుతున్నా, విషపురుగుల సంచారం పెరిగినా మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యం వీడటం లేదు.నివాసాల మధ్య..పైచిత్రం నర్సంపేట పట్టణం 15వ వార్డు. తెలంగాణ కాలనీలో చుట్టూ పెద్ద భవనాలతో కూడిన నివాసాల మధ్య ఉన్న ఖాళీ స్థలం. ఏటా వరద, నివాసాల వృథా నీటికి తోడు పిచ్చి మొక్కలు, రబ్బరు(కట్లాయి)చెట్లు విపరీతంగా పెరిగి ప్రస్తుతం నీటి కుంటను తలపిస్తోంది. ఏడాది పొడవునా దోమల బారినపడి అనారోగ్యం పాలవుతున్నట్లు పరిసర ఇళ్ల ప్రజలు తెలిపారు.

తాఖీదులు ఇచ్చాం–వీరస్వామి, టీపీవో నర్సంపేట

మొదటి పట్టణ ప్రగతిలో ఖాళీ స్థలాల సొంతదారులను గుర్తించి వాటిల్లో మట్టి పోసి ఎత్తు లేపాలని, తుమ్మలు, పొదలు, పిచ్చి మొక్కలు తొలగించాలని 350–400 స్థలాల వారికి తాఖీదులు ఇచ్చాం.

# అలరించిన 'నెలనెలా వెన్నెల'

ఖమ్మం : ప్రతి నాటకంలోనూ ఓ సందేశం ఉంటుందని, సమాజానికి ఉపయోగపడేలా నాటకాలను ప్రదర్శించడం అభినందనీయమని ఖమ్మం జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.ఎస్.జగ్జీవన్‌కుమార్ పేర్కొన్నారు. నగరంలోని భక్తరామదాసు కళాక్షేత్రంలో నిర్వహించిన 'నెలనెలా.. వెన్నెల' కార్యక్రమం వీక్షకులకు అలరించింది. సభకు ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా న్యాయమూర్తి బి.ఎస్.జగ్జీవన్‌కుమార్ మాట్లాడుతూ..



ప్రస్తుత తరుణంలోనూ నాటకాల ద్వారా ప్రేక్షకులను రంజింపజేయడం శుభపరిణామన్నారు. తాడేపల్లికి అరవింద ఆర్ట్స్ కళాకారులు ప్రదర్శించిన 'మనస్విని' నాటకం ఆకట్టుకుంది. ఆత్మీయ అతిథులు నిర్మల్ హృదయ్ విద్యా సంస్థల చైర్మన్ వంగా సాంబశివారెడ్డి, మిత్రా ఫౌండేషన్ చైర్మన్ కురువెళ్ల ప్రవీణ్, కొల్లి సత్యనారాయణ, అన్నాబత్తుల రవీంద్రనాథ్ మోటమర్రి జగన్మోహన్‌రావు, అన్నాబత్తుల సుబ్రహ్మణ్యకుమార్, నాగబత్తిని రవి, ప్రజానాట్య మండలి అధ్యక్షుడు నామా లక్ష్మీనారాయణ, కళాకారులు పాల్గొన్నారు.

# అండర్ బ్రిడ్జి నిర్మాణానికి మోక్షమెన్నడో!

పాలకుర్తి: పాలకుర్తి మండలం కన్నాల రైల్వే గేటు వల్ల సమీప గ్రామాల ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రజా రవాణాపై దృష్టి పెట్టిన రైల్వేశాఖ రైల్వే గేట్ల వద్ద రాకపోకలు కొనసాగించేందుకు ప్రత్యామ్నాయ దిశగా ఆలోచించడం లేదని స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన రైల్వే మార్గం కావడంతో ప్రతి క్షణం ఏదో రైలు వస్తూనే ఉంటోంది. ఈ సమయంలో కన్నాల గేటు మూసివేయడంతో రైలు వెళ్లే వరకు వాహనదారులు, ప్రయాణికులు నిరీక్షించాల్సి వస్తుంది. ప్రధానంగా ఈ గేటు నుండి కన్నాల, బామ్లానాయక్ తండా, రాణాపూర్, ఎల్కలపల్లి, గుంటూరుపల్లి, ఎల్కలపల్లి గేటు గ్రామాల ప్రజలు నిత్యం మండల



కేంద్రానికి వివిధ పనుల నిమిత్తం రాకపోకలు సాగిస్తుంటారు. రైల్వే గేటు వేసి ఉండటంతో సమయానికి చేరుకోవడం లేదని వాపోతున్నారు. ముఖ్యంగా గేటు అవతలి ప్రాంతాల్లో ప్రమాదవశాత్తు ఏదైనా ఘటన జరిగితే అత్యవసర సేవల వాహనాలు సైతం రావడానికి అధిక సమయం పడుతుంది. కనీసం అత్యవసర సేవలకు కూడా మినహాయింపు ఇవ్వడం లేదని స్థానికులు అంటున్నారు. రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణం చేయాలని స్థానిక నాయకులు, ప్రజలు పలుమార్లు రైల్వే అధికారులను కలిసి విన్నవించినా స్పందన కరవైందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి పనులు చేపట్టేలా కృషి చేయాలని కోరుతున్నారు.

# 'గ్రీన్ హైడ్రోజన్' ఉత్పత్తి దిశగా సింగరేణి అడుగులు



సింగరేణి : ఉత్పత్తి, నిర్వహణ అంశాల్లో పర్యావరణ హిత నిర్ణయాలకు సింగరేణి ప్రాధాన్యమిస్తోంది. 'గ్రీన్ హైడ్రోజన్' తయారీ దిశగా అడుగులు వేస్తోంది. ఈ ఘనత సాధిస్తే దేశంలోనే తొలి పరిశ్రమగా గుర్తింపు పొందనుంది. ఈ నెల మొదటి వారంలో నిర్ణయం తీసుకున్నారు. సింగరేణి మంచిర్యాల జిల్లా జైపూర్‌లో 1,200 మెగావాట్ల సామర్థ్యంతో థర్మల్ విద్యుత్తు ఉత్పత్తి కేంద్రం నిర్వహిస్తోంది. ఈ ప్లాంటులో జనరేటర్ల వేడి తగ్గించేందుకు శీతలీకరణ ధాతువుగా హైడ్రోజన్ వినియోగిస్తారు. ఈ వాయువు ఉత్పత్తికి ఇక్కడి ప్లాంటులోనే ఓ తయారీ కేంద్రం ఉంది. హైడ్రోజన్‌ను ప్రస్తుతం థర్మల్ విద్యుత్తు సాయంతో తయారు చేస్తున్నారు. ఏటా 10 వేల క్యూబిక్ మీటర్ల ఉత్పత్తి జరుగుతుండగా.. ఇందుకోసం 100 కిలోవాట్ల విద్యుత్తు ఖర్చవుతోంది. ఇకపై థర్మల్‌కు బదులు సౌర విద్యుత్తు వినియోగించాలని యాజమాన్యం తాజాగా నిర్ణయించింది. ఇప్పటికే జైపూర్‌లో 15 మెగావాట్ల సామర్థ్యంతో (10o5) ఉత్పత్తి చేపడుతున్న రెండు 'సౌర' కర్మాగారాల సాయంతో 'గ్రీన్ హైడ్రోజన్' తయారు చేస్తారు. మరో కొత్త హైడ్రోజన్ ప్లాంటును

రామగుండం ఏరియాలో ఏర్పాటు చేసేందుకు సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేయాల్సిందిగా ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.శ్రీధర్ అధికారులను ఆదేశించారు. ఇప్పటికే ప్రతిపాదనలను సిద్ధం చేయగా, ప్లాంటు ఏర్పాటు పనులు సైతం ప్రాథమిక దశలో ఉన్నాయి. త్వరగా కార్యరూపం దాల్చితే సింగరేణి గ్రీన్ హైడ్రోజన్ ప్లాంట్ల సంఖ్య రెండుకు చేరనుంది. రామగుండంలో హైడ్రోజన్ తయారీ ప్లాంటు ఏర్పాటుకు సరైన దిశగా చర్యలు చేపడుతున్నట్లు డైరెక్టర్ (ఈ అండ్ ఎం) డి.సత్యనారాయణరావు తెలిపారు. అక్కడి ఎరువుల కర్మాగారంతో పాటు ఇతర పరిశ్రమల అవసరాలకు ఉత్పత్తి సరఫరా చేస్తామన్నారు.

# దారులు అధ్వానం.. ప్రయాణం నరకం

నార్నూర్ : గ్రామీణ ప్రాంత ప్రజలకు మౌలిక సౌకర్యాలు నేటికీ అందని ద్రాక్షగా మిగిలాయి. ప్రజాప్రతినిధులు, అధికారుల నిర్లక్ష్యం వల్ల నేటికి 108 వాహనాలు రాలేని దుస్థితిలో గ్రామీణ ప్రాంతాల రహదారులు ఉన్నాయి. నార్నూర్ – గాదిగూడ మండలాల పరిధిలోని గ్రామీణ ప్రాంత రహదారులపై ప్రయాణం అంటేనే జనం వణికిపోతున్నారు. ఈ రెండు మండలాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విద్యార్థుల చదువు, వైద్యం, నిత్యావసర సరకుల కొనుగోలు, పండిన పంటల విక్రయాలు తదితరాలన్నీ ఈ రోడ్లతోనే ముడిపడి ఉండటంతో నానా అవస్థలు పడుతున్నారు.

నార్నూర్ మండలంలోని తాడిహత్నూర్–సోనాపూర్ రహదారి 2005లో



వేశారు. అప్పటి నుంచి కనీసం మరమ్మతులకు నోచుకోవడం లేదు. చిత్తగూడ నుంచి ధన్నుగూడ వెళ్లే మార్గంలో చెరువు ఉండటంతో వర్షాకాలంలో దన్నుగూడ ఆదివాసీలు బాహ్య ప్రపంచానికి దూరంగా ఉండాల్సి వస్తోంది. షేకుగూడ– మహాదాపూర్ గ్రామానికి వెళ్లే 7 కి.మీ రహదారి పనులను ఓ గుత్తేదారు ఏడాది కిందట ప్రారంభించి ఇప్పటికీ పూర్తి చేయకపోవటంతో ప్రయాణికులకు ఇబ్బందిగా మారింది.

భీంపూర్ – గణేష్‌పూర్ రహదారి అయిదేళ్ల కిందట ఎన్ఆర్ఈజీఎస్‌లో నిర్మించగా.. వర్షాలకు పాడై ప్రయాణానికి కష్టంగా మారింది.

గాదిగూడ మండలంలోని దాబా(బి) నుంచి పౌనూర్–లొద్దిగూడకు వెళ్లే రహదారి కనీసం 108 వాహనం వెళ్లే పరిస్థితిలో లేదు. ఓ గుత్తేదారు ఏజెన్సీలోని రహదారులను నిర్మించగా.. కొన్ని నెలలకే కొట్టుకుపోవటం గమనార్హం.కుండి గ్రామ రహదారి నిర్మాణం లేక ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు.

# భాష.. భావోద్వేగాలు ఇక మాతృభాషలో

హైదరాబాద్: "పరభాషలో ఘనం విజయం సాధించిన ఏదైనా సినిమాను నేరుగా ఓటీటీలో చూస్తున్నప్పుడు.. అందులోని పాత్రధారులంతా తమ సొంత భాషలో మాట్లాడుతుంటే మనకేమాత్రం అర్థంకాదు.. నటులు రౌద్రాన్ని ప్రదర్శించినా.. హాస్య సన్నివేశాలొచ్చినా స్క్రీన్ కిందవచ్చే సబ్‌టైటిల్స్‌ను చూసి అర్థం చేసుకోవడమే.. అలా కాకుండా వారేం మాట్లాడుకుంటున్నారో.. ఎలా తిట్టుకుంటున్నారో మన తెలుగులో తెలిస్తే...?"

"ప్రధాని మోదీ హైదరాబాద్‌కు వచ్చి హిందీలో ప్రసంగిస్తుంటే ప్రత్యక్షప్రసారం చూస్తున్నప్పుడు ఆయన చెబుతోంది అర్థమవుతున్నా.. ఆ భాషలోని కొన్ని పదాలకు అర్థం తెలీదు.. ఆయన మాట్లాడుతున్నప్పుడు టీవీ తెరపై మన మాతృభాషలోనే పదాలొస్తే.."

పై రెండు ప్రశ్నలకు గతంలో సమాధానాలుండేవి కావు.. ఇందుకు పరిష్కారంగా ట్రిపుల్ఐటీ హైదరాబాద్ పరిశోధకులు ప్రొఫెసర్ రాజీవ్ సంగల్, ధ్రువ్‌శ్రీవాత్సవ, ఆదిత్యకుమార్‌సింగ్, ప్రొఫెసర్ మకరంద్ తపస్విలు ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌లను రూపొందిస్తున్నారు. వచ్చేఏడాది ప్రథమార్థం నాటికి ఇవి అందుబాటులోకి రానున్నాయి. సంతోషం, ఆగ్రహం, నవ్వు.. ఇలా వేర్వేరు పరిస్థితుల్లో సంబంధిత వ్యక్తుల భావోద్వేగాలు ఏ స్థాయిలో ఉన్నాయి? వారి మాటలు, ముఖకవళికల ద్వారా ఏం చెప్పదల్చుకున్నారు? అనే అంశాలను మిషన్ లెర్నింగ్ సాఫ్ట్‌వేర్ ఉన్న కంప్యూటర్లు విశ్లేషించి భావోద్వేగాలస్థాయిని వివరించనున్నాయి.

మిషన్ లెర్నింగ్ మాయాజాలం

ఇతర భాషల్లోని సినిమాలు చూస్తున్నప్పుడు సంబంధిత భాషలు అర్థం కావు. పాత్రధారుల భావోద్వేగాలనూ అర్థం చేసుకోలేం. హిందీ, తమిళం, మలయాళం, ఆంగ్ల సినిమాలను థియేటర్లు, ఓటీటీల ద్వారా చూస్తున్నప్పుడు తెరకింద స్థానిక భాషల్లో పదాలు వస్తుంటాయి.

మిషన్ లెర్నింగ్ సాఫ్ట్‌వేర్‌ను అనుసంధానిస్తే స్థానిక భాష ఆధారంగా



వీక్షకులు సన్నివేశాల్లోని భావోద్వేగాలు అర్థం చేసుకుంటారు.

మన భాషకాని ఏ చలనచిత్రాన్ని మనం చూసినా... మిషన్ లెర్నింగ్ సాఫ్ట్‌వేర్ ద్వారా భావోద్వేగాలు కూడా తెలిసిపోతాయి. దీంతో సినిమా మనకు మరింత వినోదభరితంగా కనిపిస్తుంది.

అంతర్లీన భావోద్వేగాలను గుర్తించడంలో ఈ సాఫ్ట్‌వేర్‌లో కొన్ని ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ పరిస్థితిని చక్కదిద్దేందుకు వీలుగా పరిశోధనలు చేపడుతున్నారు.

ఆచార్యుల బోధన.. వేర్వేరు భాషల సినిమాలు..

భాష.. భావోద్వేగాలను గుర్తించే సాఫ్ట్‌వేర్‌లను కనుగొనేందుకు ప్రొఫెసర్లు రాజీవ్‌సంగల్, మకరంద్‌లు వేర్వేరుగా రెండేళ్ల నుంచి ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రొ.రాజీవ్ సంగల్ ఐఐటీబాంబే, ఐఐటీ మద్రాస్ ఆచార్యుల బృందంతో కలిసి ఆచార్యుల బోధనపై సాఫ్ట్‌వేర్‌ను రూపొందిస్తున్నారు. ఉస్మానియా వర్సిటీలో విధులు నిర్వహిస్తున్న భౌతికశాస్త్రం ఆచార్యులు తెలుగులో పాఠం చెప్పిన అనంతరం ఆ వీడియోకు ఒక సాఫ్ట్‌వేర్‌ను అనుసంధానం చేస్తారు. దీని సాయంతో భౌతికశాస్త్రం ఆచార్యులు తెలుగులో చెప్పిన పాఠం 22 భాషల్లోకి తర్జుమా అవుతుంది. కేంద్ర విద్యాశాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న 'స్వయం' వెబ్‌సైట్ డిజిటల్ పాఠాల కోసం 45 వేల వీడియోలను రాజీవ్ సంగల్ రూపొందించారు. వీటిల్లోని చిన్నపాటి లోపాలను సవరిస్తున్నారు. నాలుగైదు వాక్యాలు ఏకబిగిన తర్జుమా చేసే సాఫ్ట్‌వేర్‌నూ రూపొందిస్తున్నారు. ప్రొ.మకరంద్ బృందం మాత్రం వేర్వేరు భాషల సినిమాలను ఎంచుకుంది. వీటిని స్థానిక మాతృభాషల్లోకి మార్చేలా మిషన్ లెర్నింగ్ సాఫ్ట్‌వేర్‌ను ఎంచుకున్నారు.

# కుంటుపడుతున్న.. కుట్టుమిషన్!



మంచిర్యాల : ప్రతి ఒక్కరు కొత్త దుస్తులు కొనుగోలు చేయడం ఆనవాయితీ. చిన్నపిల్లల దగ్గర నుంచి పెద్దవారి వరకు వస్త్రాలు(క్లాత్స్) తీసుకునేందుకు ప్రత్యేక శ్రద్ధ చూపుతుండేవారు. కనీసం నెల ముందు నుంచే హడావుడి మొదలయ్యేది. కొనుగోలు దగ్గర నుంచి టైలర్ దుకాణానికి చేరవేసే వరకు ఉత్సాహం కనిపించేది. ఇక అక్కడి నుంచి కుట్టడం పూర్తయిందా..? లేదా..? అంటూ తరచూ ఆరా తీయడం జరిగేవి. సంబరాలు ప్రారంభమయ్యే కొద్ది నిమిషాల వరకు టైలర్ నిర్వాహకులు తీరిక లేకుండా ఉండేవారు. ప్రస్తుతం ఆయా షాపులకు కళ తప్పింది. ఒకప్పుడు వేలమందికి ఉపాధి కల్పించిన కుట్టుమిషన్(టైలరింగ్) వృత్తి ప్రస్తుతం చతికిలపడిపోతోంది. విజయదశమి వేళ.. కళకళలాడాల్సిన షాపులు వెలవెలబోతున్నాయి. కార్పొరేట్ వస్త్ర దుకాణాలు వెలిగిపోతున్నాయి. పాతకాలంలో కుట్టుమిషన్ వృత్తిలో మేర, పద్మశాలీ కులస్థులు ఉండేవారు. ఆ తర్వాత బీసీలోని చాలా కులాలు ఈ వృత్తిపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. గతంలోనూ రెడిమెడ్ దుస్తులు అందుబాటులో ఉన్నా.. స్వయంగా వస్త్రాలు కొనుగోలు చేసి టైలర్‌షాపులో ఇచ్చే వారు. కాలక్రమేణా వీటిపై మక్కువ తగ్గుతూ వచ్చింది. ప్రస్తుతం మరింత దీనస్థితికి చేరింది. ఒకప్పుడు జీన్స్, టీషర్ట్స్ లాంటి వాటికే పరిమితమైన షాపులు.. ఇప్పుడు ఏ ట్రెండ్ మారితే దానికి తగ్గట్లుగా తయారు చేస్తుండటంతో టైలర్ వంక చూసేవారు లేకుండా పోతున్నారు.

జిల్లా కేంద్రంలోనే 50కి పైగా..

ఒకప్పుడు జిల్లా కేంద్రంలోనే యాభైకి పైగా షాపులు అందుబాటులో ఉండగా.. జిల్లా మొత్తం సుమారు 200దుకాణాలు ఉండేవి. దాదాపు నాలుగు వేల మందికి ప్రత్యక్షంగా, మరో రెండువేల మంది పరోక్షంగా ఉపాధి పొందుతుండే వారు. కానీ ప్రస్తుతం ఆయా షాపులు జిల్లాలో కనుమరుగవుతున్నాయి. ప్రస్తుతం పట్టణంలో పది షాపులు కూడా లేకపోవడం చూస్తే ఏ స్థాయికి చేరిందో అర్థం చేసుకోవచ్చు. ఈ వృత్తినే నమ్ముకున్న చాలామంది కార్పొరేట్ సంస్థల్లో పనిచేయాల్సిన దుస్థితి ఏర్పడింది. ఆయా ట్రెండ్‌కు తగ్గట్టుగానే రెడిమేడ్ దుకాణాలు అందుబాటులోకి తీసుకురావడంతో.. ఆయా టైలర్‌షాపులు కేవలం కొలతలు తగ్గించడానికి ఉపయోగపడుతున్నాయి.

సంప్రదాయ వృత్తిని ఆదరించాలి

మంతెన గట్టయ్య, టైలర్‌షాపు నిర్వాహకుడు

మా సంప్రదాయ వృత్తిని గౌరవించి ఆదరించండి. ఇప్పటికే చాలా వరకు జిల్లాలో షాపులు మూసివేశారు. యజమానులు కాస్త కూలీలుగా మారారు. కార్పొరేట్ సంస్థలతో పాటు తమను గుర్తించాలి. ప్రస్తుత ట్రెండ్‌కు తగ్గట్లుగా కుట్టడం మా వృత్తిదారులు సైతం అందిపుచ్చుకుంటున్నారు. యంత్రాలు సైతం వినియోగిస్తున్నారు. ముఖ్యంగా పండగ సమయంలో ఆదరిస్తే మా నివాసాల్లోనూ సంబరాలు చేసుకునే అవకాశం ఉంటుంది.

# పనులు ప్రారంభించి.. మధ్యలో నిలిపేసి

ఆదిలాబాద్ : జిల్లా కేంద్రంలో వీధి వ్యాపారుల ఉపాధికి భరోసా కల్పించేందుకు ప్రారంభించిన వీధి వ్యాపారుల సముదాయ నిర్మాణం మధ్యలోనే నిలిచిపోయింది. డైట్ కళాశాల మైదానం సమీపంలో రహదారి పక్కన రెండు నెలల కిందట ప్రారంభించిన షెడ్ల నిర్మాణ పనులు ఆగిపోయాయి. అధికారులు నిర్మాణ పనులపై దృష్టి సారించకపోవడంతో ఎలాంటి పురోగతి లేకుండా పోయింది. మరోవైపు రోడ్డుకు ఇరువైపులా పొట్టకూటి కోసం చిరు వ్యాపారాలు చేస్తున్న వారు పనులు ఎప్పుడు పూర్తి చేస్తారో? షెడ్లను ఎప్పుడు కేటాయిస్తారోనని ఎదురుచూస్తున్నారు.

పురోగతి లేక రెండు నెలలు

జిల్లా కేంద్రంలో రహదారులపైనే వ్యాపారాలు చేస్తుండటంతో పట్టణ ప్రజలకు ట్రాఫిక్ సమస్యలు తప్పడం లేదు. ఎండా, వానలకు వర్తకులు ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలో 8 వేల మందికి పైగా వీధి వ్యాపారులకు గుర్తింపు కార్డులున్నాయి. వాస్తవంగా రోడ్లపై వ్యాపారాలు చేసుకునేవారు 5 వేల మంది వరకు ఉంటారని అంచనా. వారి కోసం మూడేళ్ల కిందట సాత్నాల, పాత బస్టాండ్ ప్రాంతంలో 125 షెడ్లు నిర్మించారు. వాటిని లబ్ధిదారులకే కేటాయించడంతో ఆ ప్రాంతంలో వర్తకులు సాఫీగా తమ వ్యాపారాలు చేసుకుంటున్నారు. తెలంగాణ కూడలి– వినాయక్‌చౌక్ రహదారి పక్కన షెడ్లు నిర్మించాలని బల్దియా యంత్రాంగం గతంలోనే నిర్ణయించినా రహదారి విస్తరణ, నాలాల నిర్మాణ పనులు జరగడంతో ఆలస్యమైంది. రెండు నెలల కిందట డైట్ కళాశాల మైదానానికి ఆనుకుని రహదారిపై రూ.28 లక్షలతో 57 షెడ్ల నిర్మాణ పనులు ప్రారంభించారు. అటవీశాఖ ముందున్న రహదారి పక్కన సైతం షెడ్లను నిర్మించాలని భావించినా పనులు ప్రారంభించలేదు. పనుల్లో ఎలాంటి పురోగతి లేకపోవడంతో



షెడ్ల నిర్మాణం ఎప్పుడు పూర్తిచేస్తారోనని వీధి వ్యాపారులు ఎదురుచూస్తున్నారు. గతంలో నిర్మించిన షెడ్లలో కొందరు అనర్హులకు కట్టబెట్టారని ఆరోపణలు వచ్చాయి. ఇకపై అలా జరకుండా పకడ్బందీగా సర్వేచేసి అర్హులైన వ్యాపారులకే షెడ్లను కేటాయించాలని కోరుతున్నారు.

పూర్తి చేసేందుకు చర్యలు ఎ.శైలజ, కమిషనర్, బల్దియా

వీధి వ్యాపారుల సముదాయం నిర్మాణ పనులు నిధుల సమస్యతో ఆగిపోయాయి. గుత్తేదారుకు గతంలో ఇవ్వాల్సిన బిల్లులు పేరుకుపోవడంతో పనులు చేయడం లేదు. ఎన్నికల ప్రక్రియ పూర్తికాగానే నిర్మాణ పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటాం. అర్హులైన వ్యాపారులకే షెడ్లను కేటాయిస్తాం.

# గిఫ్టు కొట్టు.. ఓటు పట్టు

హైదరాబాద్ : ఎన్నికల వేళ...ఓటర్లను ఎలాగైనా తమ వైపు తిప్పుకొనేందుకు రాజకీయ పార్టీలు ఎన్నెన్నో గిమ్మిక్కులు చేస్తుంటాయి. కొన్ని డబ్బు పంచడం, మరికొన్ని బహుమతులు అందించటం ద్వారా ఆకట్టుకునేందుకు ప్రయత్నిస్తుంటాయి. వచ్చే ఎన్నికల దృష్ట్యా పోటీలో ఉండే అభ్యర్థుల తరఫున వారి అనుచరులు ఓటర్లను మభ్యపెట్టే యత్నాలు ఇప్పటికే మొదలుపెట్టారు. బస్తీలు, కాలనీలే లక్ష్యంగా కొన్నిచోట్ల చీరలు, గోడగడియారాలు, గొడుగులు వంటివి పంపిణీ చేస్తున్నారు. తాజాగా కుక్కర్లు, హాట్‌బాక్సులు, మిక్సీలు వంటివి పంచేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. ఇలాంటి సామగ్రికి హోల్‌సేల్ మార్కెట్లుగా నగరంలోని బేగంబజార్, సికింద్రాబాద్, కోఠి వంటి ప్రాంతాలు పేరొందాయి. ముంబయి, కోల్‌కతా, దిల్లీ ప్రాంతాల నుంచి భారీగా ఈ సామగ్రిని ఇక్కడకు తరలిస్తుంటారు. సాధారణ రోజుల్లో నెలకు ఒక్క బేగంబజార్‌కే పది ట్రక్కుల వరకు ఇలాంటి సామగ్రి చేరుతుంటుంది. ఎన్నికల నేపథ్యంలో ఈసారి మరో ఐదారు ట్రక్కులు ఎక్కువగా ఆర్డర్లు పెట్టినట్లు వ్యాపారులు చెబుతున్నారు. ఇందులో ఎక్కువ శాతం రైస్ కుక్కర్లు, మిక్సర్ గ్రైండర్లు తదితర వంటింటి సామగ్రికి ఎక్కువ డిమాండ్ ఉన్నట్లు చెబుతున్నారు. వివిధ పార్టీల నేతల ఆర్డర్లకు అనుగుణంగా కొందరు వ్యాపారులు అదనంగా లోడ్లు తెప్పిస్తుండగా...మరికొందరు ఎన్నికల దృష్ట్యా ఎక్కువ లోడ్లు ఆర్డర్ ఇస్తున్నట్లు ఓ వ్యాపారి తెలిపారు. సాధారణ రోజులతో పోల్చితే



ఎన్నికల సమయంలో ఇలాంటి గిఫ్టు సామగ్రికి మంచి డిమాండ్ ఉండటంతో ఆర్డర్లు పెంచినట్లు వివరించారు.

ఇక్కడ నుంచే... గ్రేటర్‌తో పాటు రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో సైతం ఓటర్లను ప్రలోభపెట్టడానికి డబ్బులే కాకుండా గిఫ్టుల వల విసురుతుంటారు. దీంతో హైదరాబాద్‌లోని హోల్‌సేల్ మార్కెట్‌పై ఎక్కువ మంది ఆధారపడుతుంటారు. గిఫ్టులు పంపకాల్లో నేతల తరఫున చోటామోటా నేతలు కీలకంగా వ్యవహరిస్తుంటారు. నేరుగా వీటిని పంచుతూ పట్టుబడితే అసలుకే ఎసరు వచ్చే ముప్పుండటంతో రకరకాల దారుల్లో వీటిని చేర్చే ప్రయత్నం చేస్తుంటారు. స్థానిక కింది స్థాయి నేతలే నేరుగా వీటిని ఇంటికే అందిస్తుంటారు. లేదంటే టోకెన్‌లు పంచి స్థానిక వ్యాపారుల నుంచి వీటిని తెచ్చుకునేలా ఏర్పాట్లు చేస్తుంటారు. ముఖ్యంగా ఓటింగుకు ఒకటి, రెండు రోజుల ముందు ఈ తంతు నడుపుతుంటారు. అయితే గిఫ్ట్‌లతో ఓట్లు కొంటే ఓటర్లే చివరికి మోసపోయే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. గిఫ్టుకో, రూ.500 నోటుకో ఓటు తాకట్టు పెట్టడం వల్ల గెలిచిన నేతలను ప్రశ్నించే హక్కులను కోల్పోయినట్లేనని వారు చెబుతున్నారు.

# అప్రమత్తతతోనే అడ్డుకట్ట

కరీంనగర్ : ఆందోళన చెందకుండా ఆలోచనతో అగ్నిప్రమాదాలను అరికట్టవచ్చని అగ్నిమాపక అధికారులు సూచిస్తున్నారు. ఇటీవల మెట్‌పల్లి డివిజన్ కేంద్ర అగ్నిమాపకశాఖ పరిధిలోని ఆసుపత్రులు, కళాశాలలు, పాఠశాలలు, వర్తక దుకాణాలు, ఆర్టీసీ బస్టాండ్లు, ప్రభుత్వ కార్యాలయాలు, అపార్ట్‌మెంట్లతో పాటు వివిధ చోట్ల అగ్నిప్రమాదాల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. దీంతో పాటు ప్రత్యేక ప్రదర్శనలు, కరపత్రాలు, గోడప్రతుల ఆవిష్కరణలు చేస్తూ అగ్నిమాపక వారోత్సవాలను నిర్వహించారు. అగ్నిప్రమాదాలు జరిగే సమయంలో ఉపయోగించే పరికరాలను అధికారులు వివరించారు.

బ్రీతింగ్ ఆపరేటివ్(బీఏ): ఈ పరికరాన్ని విష వాయువులతో పాటు ఫ్యాక్టరీలలో అగ్నిప్రమాదం జరిగిన సమయంలో అగ్నిమాపక సిబ్బంది లోనికి వెళ్లలేని పరిస్థితిలో ధరించి లోనికి వెళ్తారు. సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చి, మంటల్లో చిక్కుకున్న వారిని కూడా కాపాడేందుకు వినియోగిస్తారు. నిప్పు ఆర్పేందుకు: లండన్ హైండ్ కంట్రోల్, మల్టీపర్పస్ నాజిల్, రివాల్వింగ్ నాజిల్, ఫోం బ్రాంచ్‌లుగా పిలువబడే ఈ పరికరాలు అగ్నిప్రమాదాలను నివారించేందుకు, మండుతున్న వాటిపై నీటిని చల్లి తొందరగా అరికట్టేలా వీటిని వినియోగిస్తారు.

హైడ్రాలిక్ కట్టర్: ఈ పరికరాన్ని రోడ్డు ప్రమాదాల్లో రెండు వాహనాలు ఢీకొన్న సమయంలో వాటిని విడదీసేందుకు, దుకాణాలు, బ్యాంకుల్లో అగ్నిప్రమాదం జరిగిన సమయంలో డోర్‌లాక్ అయితే తొలగించి



లోనికి వెళ్లి అగ్నిప్రమాదాలను నివారించేలా వీటిని ఉపయోగిస్తారు.

మిస్ట్ బుల్లెట్: ఈ మిస్ట్‌బుల్లెట్ వాహనాన్ని చాలాచోట్ల, ముఖ్యంగా ప్రముఖులు వచ్చిన సమయంలో తప్పకుండా వినియోగిస్తారు. అగ్నిమాపక వాహనం లోనికి వెళ్లలేని పరిస్థితిలో ముందుగా దీనిని పంపించి మంటలను అదుపులోకి తెస్తారు. ఈ వాహనంపై ఇద్దరు వెళ్లేందుకు అవకాశం ఉంది.

లైఫ్ జాకెట్: లైబాయ్–లైఫ్ జాకెట్ అనే పరికరాలు వరదల సమయంలో ఎక్కువగా ఉపయోగిస్తారు. నీటి ప్రవాహాలు ఎక్కువగా ఉన్న చోట నీటిలో చిక్కుకున్న వారిని కాపాడడానికి వీటిని వినియోగిస్తారు.

సమయస్ఫూర్తితో వ్యవహరించాలి– మల్లికార్జున్ యాదవ్, అగ్నిమాపక అధికారి, మెట్‌పల్లి డివిజన్

ప్రతి వ్యక్తి అగ్ని ప్రమాదాలు జరిగిన సమయంలో ఆందోళన చెందకుండా సమయస్ఫూర్తితో వ్యవహరిస్తే ప్రమాదాలను నివారించవచ్చు. ఏప్రిల్–14 నుంచి 20 వరకు అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా అన్ని వర్గాల వారికి అవగాహన కల్పించాం. ఎక్కడైనా అగ్నిప్రమాదాలు జరిగిన సమయంలో 08725–235101, 87126 99236, 87126 99237తో పాటు 101కు సమాచారం అందించాలి. సంఘటన జరిగిన వివరాలు క్లుప్తంగా అందిస్తే సకాలంలో చేరుకుని ప్రమాదాలను నివారించే అవకాశం ఉంటుంది.

# ఇదే తరుణం.. ఇంకెప్పుడో మోక్షం

పెద్దపల్లి: ఎస్సారెస్పీ కాలువలకు మరమ్మతు, పూడికతీత పనులు మరింత ఆలస్యం అయ్యే పరిస్థితి కనిపిస్తోంది. యాసంగి పంటలకు నీటి విడుదల మరో పక్షం రోజుల వరకు కొనసాగే అవకాశ ముంది. పంట కోతలు చివరి దశలోకి వచ్చినప్పటికీ పలు చోట్ల పంటలు ఆలస్యంగా సాగు చేయడంతో మరికొంత కాలం నీటిని అందించాల్సి ఉంది. ఈ యాసంగిలో ఆటంకాల్లేకుండా సరఫరా జరుగుతున్నా వానాకాలంలో సమృద్ధిగా సాగునీటిని అందించాల్సి రావడం, సీజన్ ముగిసే వరకు సరఫరాకు అంతరాయం లేకుండా పర్యవేక్షించేందుకు అధికారులు సమయాత్తం కావాల్సి ఉంది. ఇప్పటికే వచ్చే సీజన్‌కు సంబంధించి నిధుల కేటాయింపు, మరమ్మతులు, పూడికతీత, లీకేజీల నివారణ, అదనంగా కొత్త కాలువల అనుసంధాన ప్రక్రియపై సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందించాల్సి ఉంది. కాగా ఇప్పటివరకు ఎలాంటి కార్యాచరణ రూపొందించలేదని అధికారులే చెబుతున్నారు.

ఏటా అస్తవ్యస్తంగా సరఫరాసాగునీటి సరఫరాకు ఇబ్బందులు లేకుండా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఉపాధిహామీ కూలీలతో కాలువల్లో పూడికతీత, ముళ్ల చెట్లు, చెత్తచెదారాల తొలగింపు పనులు చేపట్టాల్సి ఉంది. కాగా కాలువల్లో నీటి సరఫరా ఉండటంతో పనులు చేపట్టే పరిస్థితి లేదు. జిల్లాలో డీ–83 కింద ధర్మారం, జూలపల్లి, పెద్దపల్లి, సుల్తానాబాద్, కాల్వశ్రీరాంపూర్, రామగుండం, మంథని, కమాన్‌పూర్, ముత్తారం, పాలకుర్తి, అంతర్గాం, రామగిరి, ఎలిగేడు మండలాల పరిధిలో 1,06,623 వేరాలు, డీ–86 కింద జూలపల్లి, ధర్మారం, ఎలిగేడు, సుల్తానాబాద్, ఓదెల,



కాల్వశ్రీరాంపూర్, పెద్దపల్లి మండలాల పరిధిలో 90 వేల ఎకరాలకు ఎస్సారెస్పీ నీటిని అందిస్తున్నారు. జిల్లాలో రెండు కాలువలు 136 కి.మీ.ల మేర విస్తరించగా అసంపూర్తి పనులకు మోక్షం కలగడం లేదు. పలు చోట్ల వంతెనలు కూలిపోవడం, సైడ్‌వాల్స్ దెబ్బతినడం, ముళ్లచెట్లు పెరగడం వంటి సమస్యలు గుర్తించినప్పటికీ మరమ్మతు చేయడం లేదు. దీంతో భారీ వర్షాలు కురిస్తే కాలువల్లో నీరు నిలిచి, శిథిలమై కూలిపోయే ప్రమాదం ఉంది. జిల్లావ్యాప్తంగా గత వానాకాలంలో 2,89,003 ఎకరాల్లో పంటలు సాగు చేయగా వరి 1,67,800 ఎకరాలు, పత్తి 1,00,000, ఇతర పంటలు 21,203 ఎకరాల్లో వేశారు. డీ–83 కాలువ కింద 1,06,623 ఎకరాలకు 1,850 క్యూసెక్కుల నీటిని విడుదల చేయాల్సి ఉంటుంది. డీ–86 కాలువ ద్వారా 90 వేల ఎకరాలకు 1,200 క్యూసెక్కుల నీటిని అందించాల్సి ఉంది. మే మొదటి వారంలో సమగ్ర కార్యాచరణ–సత్యరాజ్‌చంద్ర, ఎస్సారెస్పీ ఎస్‌ఈవానాకాలం సీజన్‌కు ఎస్సారెస్పీ నీటి విడుదలకు ముందే కాలువల్లో పూడికతీత పనులు చేయాల్సి ఉన్నా ఇంకా గుర్తించలేదు. మరమ్మతు పనులు, పూడికతీత, నిధుల ప్రతిపాదనలు, నీటి కేటాయింపులపై త్వరలో కమిటీ సమావేశం నిర్వహించనుంది. మే మొదటి వారంలో సమగ్ర కార్యాచరణ రూపొందిస్తాం.

# క్రమబద్ధీకరణకు కదలిక



గోదావరిఖని: స్థలాల క్రమబద్ధీకరణలో మూడున్నరేళ్ల తర్వాత కదలిక వచ్చింది. ప్రభుత్వం భూ క్రమబద్ధీకరణకు సంబంధించి తాజాగా దరఖాస్తులను ఆహ్వానించింది. 2019, నవంబరు, డిసెంబరులో ఆన్‌లైన్‌లో రూ.1000 చెల్లించి దరఖాస్తులు చేసుకున్న భూ యజమానులకు క్రమబద్ధీకరణ ప్రక్రియ నిలిచిపోవడంతో తిరిగి ఎప్పుడు మోక్షం లభిస్తుందోనని ఎదురు చూస్తున్నారు. ఎల్‌ఆర్‌ఎస్ (లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీం) ద్వారా ఆదాయన్ని సమకూర్చుకోవాలని భావించిన ప్రభుత్వం మౌఖిక ఆదేశాలతో క్రమబద్ధీకరణ ప్రక్రియను మొదలు పెట్టినట్లు తెలుస్తోంది. ఇటీవల రాష్ట్ర పురపాలక శాఖ అధికారులు ఇచ్చిన ఆదేశాలతో నగరపాలక, పురపాలక ప్రాంతాల్లోని లేఅవుట్ ప్లాట్లు, ఇంటి స్థలాలను ఎల్‌ఆర్‌ఎస్ ద్వారా క్రమబద్ధీకరించనున్నారు. పెద్దపల్లి జిల్లాలోని రామగుండం నగరపాలక సంస్థ, పెద్దపల్లి, సుల్తానాబాద్, మంథని పురపాలక సంఘాల పరిధిలో మొత్తం 14,850 మంది క్రమబద్ధీకరణకు దరఖాస్తులు చేసుకున్నారు. వీటిని పరిశీలించాల్సిన అధికారులు మూడున్నరేళ్లుగా పక్కన పెట్టారు. తాజాగా వచ్చిన మౌఖిక ఆదేశాలతో దరఖాస్తులు చేసుకున్న వారి స్థలాలను అన్నీ సక్రమంగా ఉంటే క్రమబద్ధీకరించనున్నారు.

30 శాతం అనుమతులు

మూడున్నరేళ్ల క్రితం ఎల్‌ఆర్‌ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్న స్థల యజమానులు ఇళ్ల నిర్మాణం అనుమతుల్లోనే ఎల్‌ఆర్‌ఎస్ కింద 14 శాతం సర్‌ఛార్జి చెల్లించి భవన నిర్మాణ అనుమతులు పొందారు. అప్పుడు దరఖాస్తు చేసుకున్న 30 శాతం మంది పక్కా భవనాలు నిర్మించుకున్నట్లు అధికారులు భావిస్తున్నారు. ఇంకా 70 శాతం మంది స్థలాలను పరిశీలించి వాటిని క్రమబద్ధీకరించాల్సి ఉంది. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న యజమాని వివరాలు, స్థలం ఉన్న ప్రాంతాలను టౌన్ ప్లానింగ్ అధికారుల పరిశీలించి క్రమబద్ధీకరించనున్నారు. రామగుండం నగరపాలక సంస్థ పరిధిలో 7,800 మంది భూ యజమానులు దరఖాస్తులు చేసుకున్నారు. రూ.1000 చెల్లించి ఆన్‌లైన్‌లో తమ భూమి వివరాలు నమోదు చేశారు. ఇందులో కొంతమంది ఎల్‌ఆర్‌ఎస్ కింద ఫీజులు చెల్లించి అనుమతులు పొంది భవనాలు నిర్మించుకున్నారు. మరికొంత మంది ఇప్పటికే ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు పొందారు. పెద్దపల్లి పురపాలక సంఘం పరిధిలో 5,700 మంది భూ యజమానులు దరఖాస్తు చేసుకున్నారు. వాటిని పరిశీలించి క్రమబద్ధీకరణకు చర్యలు చేపట్టనున్నారు. ఇందులో లేఅవుట్‌లకు సంబంధించిన స్థలాలు ఉన్నాయి. సుల్తానాబాద్ పురపాలక సంఘం పరిధిలో 1200 దరఖాస్తులున్నాయి. స్థలాలను క్రమబద్ధీకరించాలని యజమానులు దరఖాస్తు చేసుకొని వాటి కోసం ఎదురు చూస్తున్నారు.

మంథని పురపాలక సంఘం పరిధిలో 150 మంది స్థలాల క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తు చేసుకున్నారు.

ఇదీ ప్రక్రియ

ఎల్‌ఆర్‌ఎస్ ఆర్జీల వివరాలు సేకరించి వాటి సర్వే నెంబర్ల ఆధారంగా స్థలాలను పరిశీలిస్తారు. 300 గజాల లోపు స్థలాలుంటే టీపీబీవోలు పర్యవేక్షిస్తారు. నిబంధనల ప్రకారం ఉంటే వాటిని క్రమబద్ధీకరిస్తారు. వివాదాలుంటే వాటిని పక్కన పెడతారు. 300 గజాల కంటే ఎక్కువ స్థలం ఉంటే ఏసీపీలు పరిశీలిస్తారు. స్థలాల క్రమబద్ధీకరణ మార్కెట్ విలువ ప్రకారం ఫీజు నిర్ణయిస్తారు. రిజిస్ట్రేషన్ శాఖ ఖరారు చేసిన మార్కెట్ విలువ ప్రకారం ఫీజు చెల్లించాల్సి ఉంటుంది.

# మత్స్య సంపద.. ఉపాధి మెండుగా



కరీంనగర్ : మత్స్యకారులకు ఉపాధి కల్పనే లక్ష్యంగా ప్రభుత్వం జలాశయాలు, చెరువుల్లో చేపలు, రొయ్య పిల్లలను వదులుతుంది. జలాశయాలు, చెరువులు జలకళను సంతరించుకోవడంతో మత్స్య సంపద బాగా పెరగడం వల్ల మత్స్యకారులకు ఉపాధి అవకాశాలు కలుగుతున్నాయి. గ్రామాల్లో మత్స్యకారులతోపాటు చేపల విక్రయాల ద్వారా మరికొందరికి ఉపాధి లభిస్తోంది. జిల్లాలో రాజరాజేశ్వర (మధ్యమానేరు), అన్నపూర్ణ, ఎగువ మానేరు జలాశయాలు ఉన్నాయి. రాజరాజేశ్వర జలాశయంలో నీటి నిల్వ అనంతరం చేప, రొయ్య పిల్లలను వదులుతున్నారు. జిల్లాలోని 430 చెరువులు, జలాశయాల్లో చేప, రొయ్య పిల్లలు వదిలారు. ఇందులో భాగంగా రాజరాజేశ్వర జలాశయంలో 28.50 లక్షల చేప, 26.63 లక్షల రొయ్య పిల్లలు, ఎగువ మానేరులో 10.50 లక్షల చేప, 5.25 లక్షల రొయ్య పిల్లలు విడిచిపెట్టారు. జిల్లాలో 116 మత్స్య పారిశ్రామిక సంఘాలు ఉండగా సుమారు 7,562 మంది సభ్యులున్నారు. నెల రోజుల వయసున్న రొయ్య పిల్లలను జలాశయాల్లో వదులుతుండగా నాలుగు నుంచి ఐదు నెలల వ్యవధిలో సుమారు 450 గ్రాముల బరువు పెరుగుతుంది. చెరువుల్లో 35 నుంచి 40 ఎం.ఎం. బొచ్చె, బంగారు తీగ పిల్లలు, జలాశయాల్లో 80 నుంచి 100 ఎం.ఎం. బొచ్చె, రవు, మోసు రకం చేప పిల్లలు వదులుతున్నారు. కిలో నుంచి పది కిలోల బరువు ఉన్న చేపలు మత్స్యకారులకు లభిస్తున్నాయి.

ప్రతి నిత్యం వేట..మత్స్యకారులు రోజూ సాయంత్రం వేళలో జలాశయంలో తెప్పపై వెళ్లి వలలను అమర్చి వస్తున్నారు. మరుసటి రోజు ఉదయం వెళ్లి వలలో చిక్కిన చేపలను తీసుకొచ్చి సమీపంలోని వ్యాపారులకు విక్రయిస్తున్నారు. ఒక్కో మత్స్యకారుడికి సుమారు పది కిలోల చేపలు పడుతున్నట్లు చెబుతున్నారు. మత్స్యకారులతోపాటు కొదురుపాక, సంకెపల్లి, రుద్రవరం, జలాశయం సమీప గ్రామాల్లో టేలాలు ఏర్పాటు చేసుకొని చేపల విక్రయాల ద్వారా కొంత మంది ఉపాధి పొందుతున్నారు. కరీంనగర్–సిరిసిల్ల ప్రధాన రహదారి వెంబడి చేపల విక్రయాలు జరుగుతుండటంతో తాజా చేపలను అనేక మంది వాహనదారులు కొనుగోలు చేసి తీసుకెళ్తున్నారు.

ఇతర ప్రాంతాల నుంచి వస్తున్నారు

– సత్తయ్య, కొదురుపాకరాజరాజేశ్వర జలాశయంలో లభిస్తున్న చేపలతో నిత్యం ఉపాధి లభిస్తుంది. రోజూ సాయంత్రం జలాశయంలో వలలు అమర్చి ఉదయం వెళ్లి చేపలు తీసుకొచ్చి స్థానికంగా విక్రయిస్తున్నాను. తాజా చేపలు లభిస్తుండటంతో ఇతర ప్రాంతాల నుంచి వచ్చి తీసుకెళ్తున్నారు. ప్రధాన రహదారి వెంబడి విక్రయాలు జరుగుతుండటంతో వాహనదారులు అధికంగా కొనుగోలు చేస్తున్నారు. రోజూ రూ.800 వరకు ఆదాయం లభిస్తుంది.

అనేక మందికి అవకాశాలు– శివప్రసాద్, జిల్లా మత్స్యశాఖ అధికారి

జిల్లాలోని మత్స్యకారులకు ఉపాధి కల్పించాలన్న ప్రభుత్వ లక్ష్యం మేరకు జలాశయాలు, చెరువుల్లో చేప, రొయ్య పిల్లలు వదులుతున్నాం. అనుకున్న లక్ష్యం మేరకు చేప, రొయ్యల ఉత్పత్తి వస్తుంది. మత్స్యకారులతోపాటు విక్రయాల ద్వారా అనేక మందికి ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి.

# చెత్త, పూడికతో డ్రైనేజీలు

కరీంనగర్ : కశ్మీర్‌గడ్డలోని అగ్నిమాపక శాఖ కార్యాలయం వెనకాల చెత్తాచెదారం ఇది. స్థానికులతో పాటు రిక్షా కార్మికులు తీసుకొచ్చి డంపింగ్ చేస్తుండగా అందులో ప్లాస్టిక్ వ్యర్థాలే అధికంగా ఉంటున్నాయి. ఇలా పలు ప్రాంతాల నుంచి వస్తున్న చెత్తతో స్థానికంగా ఇబ్బందికరంగా మారుతోంది. కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో పారిశుద్ధ్య పనుల నిర్వహణ సవాల్‌గా మారింది. ఓ వైపు స్వచ్ఛ సర్వేక్షణ్‌లో పోటీ పడటంతో పాటు నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకుంటుండగా.. మరోవైపు చెత్త సేకరణ మరింత ఇబ్బందికరంగా మారింది. శివారు కాలనీల్లో మురుగునీటి కాల్వలు అధ్వానంగా తయారయ్యాయి. పైపైనే పనులుప్రధాన వరదకాల్వలకు టెండర్లు పిలిచి పూడిక తీయిస్తుండగా, అంతర్గత వీధుల్లోని మురుగునీటి కాల్వల్లో పైపైనే పూడికతీత పనులు చేస్తున్నారు. ఆయా డివిజన్ల పరిధిలో 11 మంది కార్మికులు పని చేస్తుండగా అందులో ఎవరెవరు ఎక్కడ పని చేస్తున్నారో అర్థంకాని గందరగోళం ఉంటుంది. ప్రతీ వీధిలో మురుగునీటి కాల్వలు ఉన్నా కల్వర్టులు, ఇరుకుగా ఉన్న ప్రాంతాల్లో చెత్తాచెదారం తొలగించడం లేదు. చెట్లు ఉన్న ప్రాంతాల్లో ఎండిన ఆకులు కాల్వల్లో పడుతుండడంతో మురుగు నీరు ముందుకు కదలడం లేదు. విలీన కాలనీల్లో కచ్చా కాల్వలు ఎక్కువగా ఉండగా వీటిని ఎప్పటికప్పుడూ కాల్వల మాదిరిగా చేయాల్సి ఉంటుంది. లేదంటే మురుగు నీరు అలాగే నిల్వ ఉండి పందులు, జంతువులకు అడ్డాగా మారుతోంది. ఎక్కడ పడితే అక్కడే..నగర వీధుల్లో చెత్త సమస్య ఇబ్బందికరంగా మారుతోంది. స్వచ్ఛ ఆటో కార్మికులు సరైన విధంగా సేకరించకపోవడంతో ఖాళీ స్థలాల్లో ఇంటి యజమానులు పడేస్తున్నారు. కూలర్ల గడ్డి, థర్మకోల్ షీట్లు, కొబ్బరిబొండాలు, ఇంట్లో ఉన్న చెట్లకు సంబంధించిన ఎండిన ఆకులను తీసుకెళ్లడం లేదనే ఫిర్యాదులు అధికంగా ఉన్నాయి. దాంతో వీటిని బయట పడేస్తున్నారు. ఇదిలా ఉంటే తడి, పొడి చెత్తను తీసుకొచ్చి వీధులలో మూల మలుపుల దగ్గర పడేస్తుండడంతో దుర్గంధంగా మారుతోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్లాస్టిక్ నిషేధానికి కఠిన చర్యలు తీసుకుంటున్నా.. క్రయ, విక్రయాలు ఆగడం లేదు. ఫలితంగా చెత్త కుప్పల్లో ప్లాస్టిక్ శాతమే ఎక్కువగా కనిపిస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. ముందస్తు చర్యలకు ఆదేశాలు– సేవా ఇస్లావత్, కమిషనర్, కరీంనగర్‌వర్షాకాలం రాకముందే ముందస్తు చర్యలు తీసుకోవాలని సమీక్షలో ఆదేశించాం. డ్రైనేజీల్లోని పూడిక తొలగించాలని, రోడ్లపై నీరు నిల్వకుండా, ఖాళీ స్థలాలు శుభ్రం చేసేలా శానిటేషన్ సిబ్బందికి సూచించాం.

# సేకరణ సజావుగా సాగేనా!

మెట్‌పల్లి : జిల్లాలో యాసంగి సీజన్ ధాన్యం సేకరణ అటు అధికార యంత్రాంగానికి, ఇటు అన్నదాతలకు సవాలుగా మారనుంది. ఒకవైపు వాతావరణంలో మార్పులు రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తుండగా, మరోవైపు అధికారులు రైతులకు ఇబ్బందులు లేకుండా సకాలంలో ధాన్యం సేకరణ, మిల్లులకు తరలింపు చేయాల్సి ఉంది. అన్ని అడ్డంకులు అధిగమిస్తేనే సేకరణ సజావుగా సాగుతుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

జిల్లాలో యాసంగిలో సుమారు లక్షా 18 వేల హెక్టార్లలో వరి సాగు చేపట్టగా 5.31 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనా. ధాన్యం సేకరణకు ఐకేపీ ఆధ్వర్యంలో 139, సహకార సంఘాల ఆధ్వర్యంలో 275 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ప్రస్తుతం వరి కోతలు జరుగుతుండగా, పలు కేంద్రాల్లో రైతులు ధాన్యం కుప్పలు పోశారు. ఆలస్యంగా సాగైన చోట మరికొన్ని రోజుల్లో కోతలు పూర్తి కానున్నాయి. ఇదిలా ఉంటే ఈదురు గాలులు, వర్షం మూలంగా రైతులు ఆందోళన చెందుతున్నారు. కొనుగోళ్లు ప్రారంభమవుతున్న సందర్భంలో వర్షం కురవడం, ఆకాశంలో మబ్బులు ఉంటే తేమశాతం పెరిగి కొనుగోళ్లలో జాప్యం జరుగుతుందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. కేంద్రాలను త్వరగా ప్రారంభించడమే కాకుండా ఎలాంటి ఇబ్బందులు లేకుండా సేకరణ త్వరగా ముగిసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఇంకా ప్రారంభించని కొనుగోళ్లు



జిల్లాలో ఐకేపీ ఆధ్వర్యంలో 75, సహకార సంఘాల ఆధ్వర్యంలో 108 కొనుగోలు కేంద్రాలను ఇప్పటి వరకు ప్రారంభించారు. కేంద్రాలు ప్రారంభించినా ఇంకా ధాన్యం సేకరణ మొదలవ్వలేదు. కేవలం ఒక కేంద్రంలో మాత్రమే లారీ లోడ్ ధాన్యాన్ని సేకరించారు. రైతులు ఇప్పటికేచాలా కేంద్రాల్లో ధాన్యం కుప్పలు పోశారు. కొన్ని చోట్ల ఇంకా ధాన్యం రాకపోవడంతో కేంద్రాలు ప్రారంభించనట్లుగా తెలుస్తోంది.

వాతావరణ మార్పులతో..వాతావరణంలో మార్పులు రావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మబ్బులు పడుతుండడం, ఈదురు గాలులతో వర్షం కురుస్తుండడంతో ఇబ్బందికరంగా మారిందని వాపోతున్నారు. కేంద్రాల్లో పోసిన ధాన్యం ఉష్ణోగ్రతలు తగ్గడంతో తేమశాతం పెరుగుతుందని ఆవేదన చెందుతున్నారు. కేంద్రాల్లో పోసిన ధాన్యాన్ని ఎప్పటికపుడు సేకరించి మిల్లులకు తరలించే ప్రక్రియ వేగవంతం చేస్తేనే తమ ఇబ్బందులు తీరుతాయని పేర్కొంటున్నారు. లేకపోతే పగలంతా ఆరబోయడం, ఆకాశం మబ్బులు పడితే మళ్లీ కుప్ప చేయడం, తేమ శాతం పెరగడం వల్ల రోజుల తరబడి పడిగాపులు కాయాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఇబ్బందులు లేకుండా చేస్తేనే..

గతంలో తేమశాతం లేదని, తప్పతాలు ఉన్నాయని కోతలు విధించడంతో పాటు ధాన్యం దించుకోక, తరలింపులో జాప్యం, రైతులకు ఇబ్బందులు ఎదురయ్యాయి. ప్రస్తుతం మిల్లుల్లో ధాన్యం నిల్వలు పేరుకుపోయాయని తెలుస్తోంది. ఈ ప్రభావం కొనుగోళ్లపై పడే అవకాశముందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఏది ఏమైనా కొనుగోళ్లను వేగవంతం చేసి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని రైతులు కోరుతున్నారు. కొనుగోలు కేంద్రాలు త్వరగా ప్రారంభించాలని చెప్పడం జరిగిందని, ప్రారంభించిన కేంద్రాల్లో మబ్బుల వల్ల తేమశాతం రాకపోవడంతో ఇంకా కొనుగోళ్లు ప్రారంభం కాలేదని జిల్లా సహకార శాఖ అధికారి రామానుజాచారి, ఐకేపీ డీపీఎం మల్లేశం తెలిపారు. రైతులకు ఇబ్బందులు లేకుండా సేకరణ జరుపుతామని పేర్కొన్నారు.

# టెండర్లు లేకుండానే విక్రయాలు

మల్యాల: కొండగట్టులో కొన్ని పనులను అధికారులు గుట్టు చప్పుడు కాకుండా నచ్చిన వారికి అప్పగించడం రివాజుగా మారింది. దేవుడి సన్నిధిలో చేపట్టే ప్రతి పనిలో పారదర్శక పాటించాల్సిన అధికారులు సొంత నిర్ణయాలు తీసుకోవడం విమర్శలకు, వివాదాలకు తావిస్తోంది. తాజాగా ఆలయ అధికారులు ఆంజనేయస్వామి చిత్రంతో కూడిన రాగి లాకెట్లు తయారు చేసి సరఫరా చేసే కాంట్రాక్టును అప్పగించడంపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. రాగి లాకెట్ల సరఫరాకు సంబంధించి అధికారుల వద్ద సరైన సమాచారం లేకపోవడం గమనార్హం. 6 గ్రాముల లాకెట్‌ను రూ.30లకు, 8 గ్రాముల లాకెట్‌ను రూ.35లకు, 12 గ్రాముల లాకెట్‌ను రూ.40లకు విక్రయించడం ప్రారంభించారు. గుత్తేదారు ఏ మేరకు, ఎంత ధరకు



రాగి లాకెట్లు సరఫరా చేస్తున్నారన్న వివరాలను కూడా సరిగా వెల్లడించడంలేదు. భక్తుల అవసరాల మేరకు గుత్తేదారు తాము విక్రయించే ధర కంటే రూ.10 తక్కువ రేటుతో సరఫరా చేస్తున్నట్లు ఈవో వెంకటేశ్ తెలిపారు. అంజన్న చిత్రంతో తయారైన రాగి లాకెట్లను తెప్పించి విక్రయించడానికి దేవాదాయశాఖ కమిషనరు నుంచి అనుమతి తీసుకున్నట్లు వివరించారు. వెండి లాకెట్లు ఎక్కడ?: స్వామివారికి చెందిన వెండి నిలువలను కరిగించి లాకెట్లుగా తయారు చేసి విక్రయించాలని అధికారులు నిర్ణయించారు. అందులో భాగంగా 9 నెలల క్రితం ఆలయంలో నిలువ ఉన్న 394 కిలోల వెండిని హైదరాబాద్‌లోని 'మింట్'కు అప్పగించారు. ఇప్పటివరకు అధికారులు మింట్ నుంచి వెండిని తీసుకురాలేదు. ఈ విషయమై ఈవో వెంకటేశ్‌ను సంప్రదించగా లాకెట్ల తయారీ రిస్క్‌తో కూడుకుని ఉంటుందని, మింట్‌కు అప్పగించిన వెండిని త్వరలో తీసుకొస్తామన్నారు.

# కర్ణాటకలో ఘోర రోడ్డు ప్రమాదం.. 13 మంది ఏపీ వాసుల దుర్మరణం



చిక్‌బళ్లాపూర్: కర్ణాటకలోని చిక్‌బళ్లాపూర్ సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. రోడ్డుపై ఆగి ఉన్న ట్యాంకర్‌ను టాటా సుమో వాహనం వేగంగా వచ్చి ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో 13 మంది వలస కూలీలు దుర్మరణం చెందగా.. తీవ్రంగా గాయపడిన మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. వీరంతా ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీసత్యసాయి జిల్లా గోరంట్ల మండలానికి చెందిన వారిగా పోలీసులు గుర్తించారు. మృతుల్లో 9 మంది పురుషులు, ముగ్గురు మహిళలు, ఓ బాలుడు ఉన్నట్లు చిక్‌బళ్లాపూర్ పోలీసు అధికారి నాగేశ్ తెలిపారు. దసరా పండగకు కూలీలంతా సొంతూళ్లకు వెళ్లారు. తిరిగి ఉపాధి కోసం బెంగళూరులోని హొంగసంద్ర వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. తెల్లవారుజామున పొగమంచు ఉండటంతో డ్రైవర్ నరసింహులు.. ఆగి ఉన్న ట్యాంకర్ గమనించకుండా ఢీ కొట్టాడు. దీంతో ఆ వాహనంలో ప్రయాణిస్తున్న 14 మందిలో ఐదుగురు అక్కడికక్కడే దుర్మరణం పాలవగా.. 8 మంది చిక్‌బళ్లాపూర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

**ప్రభుత్వం ఆదుకోవాలి: నారా లోకేశ్ :** ఈ ఘటనపై తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శ్రీసత్యసాయి జిల్లా వాసుల మృతి తీవ్రంగా కలచివేసిందని ఆయన ట్వీట్ చేశారు. మృతులంతా వ్యవసాయ కూలీలే కావడం బాధాకరమన్నారు. వారి కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# జక్కంపూడి గణేష్ వివాహ రిసెప్షన్‌కు హాజరైన సీఎం జగన్



తూర్పుగోదావరి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం తూర్పుగోదావరి జిల్లాలో పర్యటించారు.

రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా సోదరుడు గణేష్ వివాహ రిసెప్షన్‌కు సీఎం జగన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను సీఎం జగన్ ఆశీర్వదించారు.

తాడేపల్లిలోని తన నివాసం నుంచి బయలుదేరి రాజానగరం మండలం దివాన్‌చెరువుకు చేరుకున్న సీఎంకు వైఎస్సార్‌సీపీ నేతలు, అధికారులు ఘన స్వాగతం పలికారు.

# రెండో రోజుకు 'నిజం గెలవాలి' యాత్ర.. కార్యకర్త కుటుంబాన్ని ఓదార్చిన భువనేశ్వరి



తిరుపతి: తెదేపా అధినేత చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి చేపట్టిన 'నిజం గెలవాలి' యాత్ర కొనసాగుతోంది. చంద్రబాబు అరెస్ట్‌తో మనస్తాపానికి గురై మరణించిన తెదేపా కార్యకర్తలు, అభిమానుల కుటుంబాలను ఆమె పరామర్శిస్తున్నారు.

రెండో రోజు తిరుపతి, శ్రీకాళహస్తి నియోజకవర్గాల్లో మరణించిన తెదేపా కార్యకర్తల కుటుంబాలను భువనేశ్వరి ఓదార్చారు. తంగెళ్లపాలెంలో మోడం వెంకటరమణ కుటుంబాన్ని ఆమె పరామర్శించి ధైర్యం చెప్పారు.

తెదేపా తరఫున రూ.3లక్షల చెక్కును ఆ కుటుంబానికి అందించారు. వెంకటమరణ కుటుంబానికి పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని భువనేశ్వరి వారికి భరోసా ఇచ్చారు.

**ఈ నిర్బంధాలు చంద్రబాబును ప్రజల నుంచి దూరం చేయలేవు: లోకేశ్ –** చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేసి తెదేపాను దెబ్బకొట్టామని వైకాపా నేతలు అనుకుంటున్నారని.. కానీ ఈ నిర్బంధాలు ప్రజల నుంచి ఆయన్ను దూరం చేయలేవని తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ అన్నారు.

"నాన్నని అక్రమంగా అరెస్టు చేసి తెలుగుదేశం పార్టీని దెబ్బకొట్టామనుకుంటున్నారు వైకాపా సైకోలు. మా నాన్నని ఈ నిర్బంధాలు ప్రజల్నించి దూరం చేయలేవని, నిజం గెలిచి తీరుతుందని, మరింత బలంగా చంద్రబాబు నాయుడు ప్రజల కోసం–రాష్ట్ర ప్రగతి కోసం పనిచేస్తారని మా అమ్మ చెప్పింది"అని లోకేశ్ ట్వీట్ చేశారు.

# కర్ణాటక రోడ్డు ప్రమాద ఘటనపై సీఎం జగన్ దిగ్భ్రాంతి



తాడేపల్లి : కర్ణాటకలో జరిగిన రోడ్డు ప్రమాదంలో సత్యసాయి జిల్లాకు చెందిన ప్రయాణికులు దుర్మరణం చెందడంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. 'చిక్‌బళ్ళాపూర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో సత్యసాయి జిల్లాకు చెందిన ప్రయాణికులు దుర్మరణం చెందడం ఎంతో కలచివేసింది. మృతిచెందిన వారి ఆత్మకు శాంతి కలగాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తున్నాను. బాధిత కుటుంబాలకు మన ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తుంది. ప్రమాదంలో గాయపడి పరిస్థితి విషమంగా ఉన్న మరో వ్యక్తికి మెరుగైన వైద్యం అందేలా చేస్తున్నాం' అని సీఎం జగన్ ట్వీట్ చేశారు.

# 28న చంద్రగ్రహణం.. దుర్గమ్మ ఆలయం మూసివేత

విజయవాడ: రాహుగ్రస్త పాక్షిక చంద్రగ్రహణం సందర్భంగా ఈనెల 28న కనకదుర్గమ్మ ఆలయాన్ని మూసివేయనున్నారు. ఆగమశాస్త్ర ప్రకారం 28న సాయంత్రం 6:30 గంటలకు అమ్మవారి ప్రధానాలయంతో పాటు ఇతర ఉపాలయాలకు కవాట బంధనం చేయనున్నారు. 28న శనివారం సాయంత్రం అమ్మవారికి ప్రదోష కాల హారతులు నిర్వహించిన అనంతరం సాయత్రం 6:30 గంటలకు కవాట బంధనం చేయనున్నారు. ఈ సందర్భంగా సాయంత్రం నిర్వహించే నిత్య పల్లకి సేవ నిలిపివేయనున్నారు. గ్రహణకాలం అనంతరం 29న ఆదివారం ఉదయం 3:00లకు అమ్మవారి ప్రధానాలయంతో పాటు ఉప ఆలయాలను కవాట ఉద్ఘాటన చేసి దేవతామూర్తులకు స్నపనాభిషేకాలు నిర్వహించనున్నారు.

29న ఉదయం 9:00 గంటలకు భక్తులకు అమ్మవారి దర్శనానికి అనుమతి ఇవ్వనున్నారు. 29 తెల్లవారుజామున నిర్వహించే ఆర్జిత సేవలు, సుప్రభాతం, వస్త్రం సేవ మరియు ఖడ్గమలార్చన నిలివేయనుండగా.. గ్రహణకాలం అనంతరం అన్ని ఆర్జితసేవలు యధావిధిగా జరుగనున్నాయి.

# ఆ రెండు సంస్థలకూ పుట్టిన విష పుత్రిక ఇండో సోల్

అమరావతి : విద్యుత్ రంగంలో జగన్ ప్రభుత్వం భారీ స్కాంలకు పాల్పడుతోందంటూ మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. పవర్ సెక్టారులో స్కాంలో సీక్వెల్‌ను ప్రభుత్వం తెర లేపిందని తెలిపారు. పవర్ స్కాంలని పార్టులు పార్టులుగా బయట పెడతామన్నామన్నారు. రూ.7 వేల కోట్ల స్మార్ట్ మీటర్ల కుంభకోణాన్ని తాము బయటపెట్టామని సోమిరెడ్డి తెలిపారు. స్మార్ట్ మీటర్ల కుంభకోణంపై హైకోర్టులో పిల్ వేశానని త్వరలో విచారణకు రాబోతోందన్నారు. అరబిందో.. షిర్డీ సాయి అనేవి జగన్‌కు దత్తపుత్రులు అని పేర్కొన్నారు. ఈ రెండు సంస్థలకు పుట్టిన విష పుత్రిక ఇండో సోల్ సంస్థ అని సోమిరెడ్డి తెలిపారు. "ఇండోసోల్ ప్రాజెక్టుకు సోలార్ ప్రాజెక్టులు కట్టబెడుతున్నారు. విద్యుత్ రంగంలో భారీ ఎత్తున ట్రాన్స్ ఫార్మర్ల కుంభకోణం జరిగింది. వివిధ కెపాసిటీలతో ఉన్న ఒక్కో ట్రాన్సఫార్మరులోనే రూ.1 లక్ష నుంచి రూ.8 లక్షల వరకూ దోపిడీ జరిగింది.

ప్రస్తుతం తెలంగాణ ప్రభుత్వం కొనుగోలు చేస్తున్న ట్రాన్సఫార్మర్ల కంటే చాలా అధిక మొత్తంలో ఏపీలో ధరలు ఉన్నాయి. ఏపీసీపీడీసీఎల్ పరిధిలో దాదాపు 62 శాతం మేర ఆర్డర్లు షిర్డీ సాయి సంస్థకే వెళ్తున్నాయి. షిర్డీ సాయి సంస్థకు నాసిరకం ట్రాన్సఫార్మర్ల సరఫరా చేస్తోందనే అంశంపై గత ప్రభుత్వం పెనాల్టీ విధించింది. గత ప్రభుత్వం విధించిన ఆ పెనాల్టీని జగన్ ప్రభుత్వం రద్దు చేసింది. పెనాల్టీ రద్దు వెనుక మరో స్కాం ఉంది. పవర్ స్కాం పార్ట్–2లో మరిన్ని వివరాలు బయటపెడతా. దీన్ని వదిలి పెట్టేదే లేదు.. స్మార్ట్ మీటర్ల కుంభకోణంపై ఇప్పటికే హైకోర్టును ఆశ్రయించాం.. అవసరమైతే సుప్రీంకోర్టుకు వెళ్తాం. ప్రతి ఒక్కరూ ఆధారపడే విద్యుత్ రంగంలో భారీ దోపిడీనా..? ఈ స్కాంల వల్లే పేదలపై విద్యుత్ భారం" అని సోమిరెడ్డి పేర్కొన్నారు.

# పేదవాడి విజయానికి బస్సు యాత్ర బాటలు వేయాలి

## ఎక్కడా వెనకడుగు వేయలేదు.. సామాజిక సాధికార యాత్ర గురించి సీఎం జగన్ ట్వీట్



గుంటూరు: ఏపీ అధికార పక్షం వైఎస్సార్‌సీపీ చేపట్టిన సామాజిక సాధికార యాత్రపై ఆ పార్టీ అధినేత, రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పందించారు. ఈ నాలుగేళ్లలో జరిగిన సామాజిక న్యాయాన్ని బస్సు యాత్రలో ఎలుగెత్తి చాటాలని, తద్వారా రాబోయే రోజుల్లో పెత్తందారులతో జరిగే యుద్ధంలో పేదవాడి విజయానికి బాటలు వేయాలని ఆకాంక్షించారాయన. మన ప్రభుత్వంలో నా ఎస్సీ, నా ఎస్టీ, నా బీసీ, నా మైనార్టీలకు కల్పించిన ప్రాధాన్యత ఈ రాష్ట్ర చరిత్రలోనే కాదు, దేశచరిత్రలోకూడా మునుపెన్నడూ చూడనిది. ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో ప్రగతిని ఒక హక్కుగా మన ప్రభుత్వం వారికి అందించింది. గత 53 నెలల కాలంలో రూ. 2.38 లక్షల కోట్ల డీబీటీలో 75శాతం ఈ వర్గాలకు చేరడమే దీనికి నిదర్శనం అని సీఎం జగన్ తన ట్వీట్‌లో ప్రస్తావించారు. చట్టం చేసి నామినేటెడ్ పదవుల్లో 50శాతం ఈ వర్గాలకు ఇస్తూ పట్టం కట్టిన ప్రభుత్వంకూడా మనదే. పెత్తందారీ పోకడలున్న వ్యక్తులు, శక్తులు అడుగడుగునా అడ్డుపడ్డా ఎక్కడా వెనకడుగు వేయలేదు. రాబోయే రోజుల్లోకూడా పెత్తందారులకు, పేదలకు మధ్య యుద్ధం జరగబోతోంది. ఈరోజు నుంచి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చేపట్టిన "సామాజిక సాధికార యాత్ర" ద్వారా వీరంతా ఏకమై మన ప్రభుత్వంలో జరిగిన సామాజిక న్యాయాన్ని ప్రతిధ్వనించాలి. పేదవాడి విజయానికి బాటలు వేయాలి అని ట్వీట్‌లో పేర్కొన్నారాయన. వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు.. వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికార యాత్రకు సిద్ధమైంది. ఉత్తరాంధ్రలో ఇచ్ఛాపురం, దక్షిణ కోస్తాలో తెనాలి, రాయలసీమలో శింగనమల నుంచి ఈ యాత్ర ప్రారంభం అయ్యింది. నేటి నుంచి నవంబర్ 9 వరకు మొదటి విడత బస్సుయాత్ర జరగనుంది.

**బస్సు యాత్ర షెడ్యూల్ :**

అక్టోబర్ 26 – ఇచ్ఛాపురం, తెనాలి, శింగనమల
అక్టోబర్ 27 – గజపతినగరం, నరసాపురం, తిరుపతి
అక్టోబర్ 28 – భీమిలి, చీరాల, పొద్దుటూరు
అక్టోబర్ 30 – పాడేరు, దెందులూరు, ఉదయగిరి
అక్టోబర్ 31 – ఆముదాలవలస, నందిగామ, ఆదోని
నవంబర్ 1 – పార్వతీపురం, కొత్తపేట, కనిగిరి
నవంబర్ 2 – మాడుగుల, అవనిగడ్డ, చిత్తూరు
నవంబర్ 3 – నరసన్నపేట, కాకినాడ రూరల్, శ్రీకాళహస్తి
నవంబర్ 4 – శృంగవరపుకోట, గుంటూరు ఈస్ట్, ధర్మవరం
నవంబర్ 6 – గాజువాక, రాజమండ్రి రూరల్, మార్కాపురం
నవంబర్ 7 – రాజాం, వినుకొండ, ఆళ్లగడ్డ
నవంబర్ 8 – సాలూరు, పాలకొల్లు, నెల్లూరు రూరల్
నవంబర్ 9 – అనకాపల్లి, పామర్రు, తంబళ్లపల్లె

ఆదివారాలు మినహా రోజూ రాష్ట్రవ్యాప్తంగా 3 ప్రాంతాల్లో ప్రతిరోజూ యాత్ర ఉంటుంది. మొత్తంగా డిసెంబర్ 31 వరకూ 60 రోజుల పాటు సభలు జరుగుతాయి. రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో ఈ యాత్రను నిర్వహించనున్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ నాయకులు ఈ యాత్రలో పాల్గొంటారు. జగనన్న పాలనలో జరిగిన అభివృద్ధి, సంక్షేమం ప్రజలకు వివరించడమే ఈ యాత్ర ఉద్దేశం. ఎమ్మెల్యేలు, స్థానిక సమన్వయకర్తలు ఈ బస్సు యాత్రకు అధ్యక్షత వహిస్తారు.



# 22 మందిని చంపిన నరహంతకుడి కోసం వేట..!

వాషింగ్టన్: కాల్పుల మోతతో అగ్రరాజ్యం అమెరికా ఉలిక్కిపడింది. మైనేలోని లెవిస్టన్ ప్రాంతంలో జరిగిన కాల్పుల్లో 22 మంది మృతిచెందగా.. మరో 60 మంది వరకు గాయపడ్డారు. అమెరికా కాలమానం ప్రకారం బుధవారం సాయంత్రం ఈ ఘటన చోటుచేసుకుంది. లెవిస్టన్‌లోని ఓ బార్ అండ్ రెస్టారెంట్, బౌలింగ్ అలే వద్ద ఈ కాల్పులు చోటుచేసుకున్నాయి. రద్దీగా ఉన్న ఈ ప్రాంతాల్లో దుండగుడు విచక్షణారహితంగా కాల్పులు జరపడంతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. కాల్పుల నుంచి ప్రాణాలు కాపాడుకొనేందుకు పరుగులు తీశారు. సమాచారమందుకున్న పోలీసులు వెంటనే అక్కడకు చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను ఆసుపత్రులకు తరలించారు. నిందితుడి కోసం గాలింపు చేపట్టారు.

**నిందితుడు.. ఆర్మీలో మాజీ సభ్యుడే..!** కాల్పులు జరిపినట్లు భావిస్తున్న అనుమానితుడి ఫొటోను పోలీసులు సోషల్ మీడియాలో విడుదల చేశారు. అందులో అతడు సెమీ ఆటోమేటిక్ రైఫిల్‌తో కన్పించాడు. గతంలో యూఎస్ ఆర్మీలో పనిచేసిన ఓ రిజర్వ్ సభ్యుడిగా అతడిని అనుమానిస్తున్నారు. నిందితుడిని రాబర్ట్ కార్డ్‌గా గుర్తించారు. ఇతడు మైనేలోని యూఎస్ ఆర్మీ రిజర్వ్ ట్రైనింగ్ సెంటర్‌లో ఫైర్‌ఆర్మ్స్ ఇన్‌స్ట్రక్టర్‌గా పనిచేసి రిటైర్ అయినట్లు పోలీసులు తెలిపారు. 40 ఏళ్ల రాబర్ట్.. గతంలో గృహహింస కేసులో అరెస్టయి విడుదలయ్యాడని పేర్కొన్నారు. ఈ ఏడాది ఆరంభంలో అతడి మానసిక పరిస్థితి సరిగా లేకపోవడంతో మైనే ప్రాంతంలోని ఓ మానసిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స తీసుకుంటున్నట్లు వెల్లడించారు.

**అత్యంత ప్రమాదకర వ్యక్తి..** కాల్పులు జరిగిన ప్రాంతంలో అతడి కోసం గాలింపు కొనసాగుతోంది. నిందితుడి ఆచూకీ తెలిస్తే సమాచారమివ్వాలని పోలీసులు ప్రజలను కోరారు. నిందితుడి వద్ద ఆయుధం ఉందని, అతడు అత్యంత ప్రమాదకర వ్యక్తి అని పోలీసులు హెచ్చరించారు. ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావొద్దని సూచించారు. మరోవైపు, కాల్పులు జరిగిన ప్రాంతానికి 8 మైళ్ల దూరంలోని లిస్బన్ ప్రాంతంలో ఓ అనుమానాస్పద కారును పోలీసులు గుర్తించారు. అది నిందితుడిదే అయి ఉంటుందని భావిస్తున్నారు. కాల్పుల ఘటనపై అధ్యక్షుడు జో బైడెన్‌కు సమాచారం అందినట్లు వైట్‌హౌస్ వెల్లడించింది. మైనే గవర్నర్ జానెత్ మిల్స్, అక్కడి సెనెటర్లతో బైడెన్ ఫోన్‌లో మాట్లాడినట్లు తెలిపింది. ఈ విపత్కర పరిస్థితుల్లో మైనేకు అండగా ఉంటామని అధ్యక్షుడు హామీ ఇచ్చినట్లు పేర్కొంది.

# ప్రజా విజయభేరి మోగించే సమయం దగ్గర్లోనే ఉంది: రాఘవేంద్రరావు, అశ్వనీదత్



అమరావతి: తెదేపా అధినేత చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి 'నిజం గెలవాలి' పర్యటనకు ప్రముఖ దర్శక నిర్మాతలు రాఘవేంద్రరావు, అశ్వినీదత్ సంఘీభావం తెలిపారు. తమ సోదరి చేపట్టిన యాత్రకు లభిస్తున్న గొప్ప స్పందన చూస్తుంటే నిజంగానే నిజం గెలుస్తుందనే నమ్మకం ఉందన్నారు. నిజం గెలిచి ప్రజా విజయభేరి మోగించే సమయం దగ్గర్లోనే ఉందన్నారు.

చంద్రబాబు అరెస్టుపై ప్రపంచవ్యాప్త వెల్లువెత్తుతున్న వ్యతిరేక జ్వాలలు.. ఈ అరాచక వైకాపా ప్రభుత్వాన్ని కూకటి వేళ్లతో సహా దహించక మానవన్నారు. ఈ యాత్ర చంద్రబాబు రేపటి విజయానికి హృదయపూర్వక ఆహ్వాన పర్వం అంటూ ఓ ప్రకటన విడుదల చేశారు.

# పేదల బతుకులు బాగుచేసిన ఘనత సీఎం జగన్‌దే'

## వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికార బస్సు యాత్ర ప్రారంభం

శ్రీకాకుళం జిల్లా: ఇచ్ఛాపురం నుంచి వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికార బస్సు యాత్ర ప్రారంభించడం సంతోషంగా ఉందని ఆ పార్టీ నేతలు అన్నారు.

గురువారం.. ఇచ్ఛాపురంలో మంత్రి బొత్స సత్యనారాయణ జెండా ఊపి బస్సు యాత్రను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైవీ సుబ్బారెడ్డి, మంత్రులు బొత్స సత్యనారాయణ, మేరుగ నాగార్జున, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే వి.కళావతి, గొర్లె కిరణ్ కుమార్, ఎమ్మెల్సీలు దువ్వాడ శ్రీనివాస్, వరదు కల్యాణి పాల్గొన్నారు. "గత నాలుగున్నరేళ్లుగా అందించిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తాం. ఇచ్చిన హామీలను అమలు చేసిన నాయకుడు సీఎం జగన్. అన్ని వర్గాలకూ సంక్షేమ పథకాలు అందించాం. కేబినెట్ లోనూ సామాజిక న్యాయం చేసిన నాయకుడు సీఎం జగన్. వైఎస్సా రేసీపీకి ఓటు వేయని వారికి సంక్షేమ పథకాలు అందించాం. సీఎం జగన్ ఆలోచనలకు అనుగుణంగా ప్రతీ నాయకుడూ, కార్యకర్త పనిచేస్తున్నారు, అవినీతికి తావులేకుండా సంక్షేమ పథకాలు అందించాం. విద్యారంగంలో సరికొత్త మార్పులకు శ్రీకారం చుట్టాం. నాడు–నేడుతో విప్లవాత్మక మార్పులు తెచ్చాం. పేదల బతుకులు బాగుచేసిన ఘనత సీఎం జగన్‌దే" అని వైఎస్సార్‌సీపీ నేతలు పేర్కొన్నారు.

# త్వరలోనే కొడాలి నాని నాలుకకు వాతలు పెడతాం

పల్నాడు: గుట్కా, మట్కా, క్యాసినో బ్యాచ్‌లకు ఏం తెలుసు చంద్రబాబు గొప్పతనం అంటూ మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు విమర్శలు గుప్పించారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. జగన్ మెచ్చుకోలు, పదవుల కోసం కొడాలి ఇష్టానుసారం వాగుతున్నారని మండిపడ్డారు. మతిభ్రమించిన కొడాలి నానిని పిచ్చాస్పత్రికి తరలించాలన్నారు. ఎందరో మహానుభావులు పుట్టిన గుడివాడ గడ్డపై చెడబుట్టారంటూ వ్యాఖ్యలు చేశారు. వినాశకాలే విపరీత బుద్ధి అన్నట్లు కొడాలి మాట్లాడుతున్నారన్నారు.

కొడాలి నాని బూతు పురాణం వెనుక తాడేపల్లి ప్యాలెస్ ఉందని ఆరోపించారు. చంద్రబాబు కుటుంబంపై పిచ్చి ప్రేలాపనలు పేలితే సహించేది లేదని.. త్వరలోనే కొడాలి నాని నాలుకకు వాతలు పెడతామని హెచ్చరించారు. అసెంబ్లీలో భువనేశ్వరమ్మపై చేసిన వ్యాఖ్యలను ఎవరూ మరిచిపోలేదని ప్రత్తిపాటి పుల్లారావు పేర్కొన్నారు.






# స్టైల్ తోనే హార్ట్ బీట్ పెంచుతూ..

గంగోత్రి సినిమాలో చైల్డ్ యాక్టర్ గా నటించిన చిన్నారిని అంత వేగంగా ఎవ్వరూ మరిచిపోరు. ఈ అమ్మడు ఇప్పుడు హీరోయిన్ అయిన సంగతి అందరికి తెలిసిందే. ఈ బ్యూటీనే కావ్యా కళ్యాణ్ రామ్. మసూద సినిమాతో హీరోయిన్ గా ఎంట్రీ ఇచ్చిన సక్సెస్ అందుకున్న కావ్య తరువాత బలగం సినిమాతో బ్లాక్ బస్టర్ హిట్ ని తన ఖాతాలో వేసుకుంది. తరువాత శ్రీసింహకి జోడీగా ఉస్తాద్ మూవీలో నటించింది. ఈ చిత్రంలో ఆశించిన స్థాయిలో సక్సెస్ కాలేదు. అయితే నటిగా మాత్రం కావ్యాకి అవకాశాలు భాగానే వస్తున్నాయి. హీరోయిన్ గా ఒక్కో మెట్టు ఎక్కే ప్రయత్నం చేస్తోంది. హీరోయిన్స్ అందరూ సోషల్ మీడియాలో మరీ ముఖ్యంగా ఇన్ స్టాగ్రామ్ లో యాక్టివ్ గా ఉంటారు. ఇన్ స్టాగ్రామ్ ద్వారా తమకి సం బందించిన రెగ్యులర్ అప్డేట్స్ ని ఫ్యాన్స్ తో పంచుకోవడంతో పాటుగా అప్పుడప్పుడు కాస్తా హాట్ హాట్ ఫోటోలని షేర్ చేస్తూ ఉంటారు. ఈ



కారణంగానే అందాల భామలకి ఇన్ స్టాగ్రామ్ లో మంచి ఫాలోయింగ్ ఉంటుంది. కావ్య కళ్యాణ్ రామ్ మరీ నార్త్ ఇండియన్ హీరోయిన్స్ స్థాయిలో శృతి మించి అందాల ప్రదర్శన చేయదు కాని తన స్మైల్, కాళ్ళతో కుర్రాళ్ళ మనసులు దోచేస్తూ ఉంటుంది. పిల్లికల్ల పాప అంటూ కావ్యని చూస్తూ ఆమె ఫ్యాన్స్ డ్యూయెట్ లు కూడా పాడేసుకుంటారు. అంతలా ఆమె అందం కుర్రాళ్ళకి కనెక్ట్ అవుతూ ఉంటుంది. తాజాగా ఈ బ్యూటీ ఇన్ స్టాగ్రామ్ లో అదిరిపోయే ఫోటోలని షేర్ చేసింది. స్వచ్ఛమైన నవ్వుతో మనసులని మెలిపెడుతూ, కాళ్ళతో చూపుల బాణాలు విసిరేస్తోంది. ఈ ఫోటోలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. కడుపునిండా పులిహోరా హ్యాపీ దసరా అంటూ రైమింగ్ తో ఫ్యాన్స్ కి విషెస్ చెప్పింది. దానికి అదనంగా ఇప్పుడు నా ఫోటోలపై మీరు ఏడుపు ఎమోజీలు వేయలేరుగా అంటూ క్యాప్షన్ పెట్టింది. దీనికి నెటిజన్లు కూడా భిన్నంగా రియాక్ట్ అవుతూ ఉన్నారు. అందమైన చిరునవ్వుతో చాలా క్యూట్ గా ఉన్నావ్ అంటూ పాజిటివ్ గా ఆమె అందానికి నెటిజన్లు ప్రశంసలు ఇస్తున్నారు.

# నాలుగు పదులు దాటినా అవే పరువాలు

1991 సంవత్సరంలో విషకన్య అని హిందీ సినిమాలో చైల్డ్ ఆర్టిస్ట్ గా నటించి ఇండస్ట్రీకి పరిచయం అయిన ముద్దుగుమ్మ రియా సేన్. ఈ అమ్మడు హీరోయిన్గా ఎన్నో సినిమాల్లో నటించింది. నాలుగు పదుల వయసుకు చేరువైన సమయంలోను నటిగా బిజీగా ఉండేది. ప్రస్తుతం ఈ అమ్మడి వయసు 42 ఏళ్లు. ఈ వయసులో కూడా అందాల ఆరబోత ఫోటోలతో సోషల్ మీడియాలో జనాలను చంపేస్తోంది. సాధారణంగా రెండు పదుల వయసు హీరోయిన్స్ కి మాత్రమే సోషల్ మీడియాలో ఎక్కువ ఫాలోయింగ్ ఉంటుంది.. కానీ రియా సేన్ నాలుగు పదుల వయసు దాటినా కూడా అందాల ఆరబోత



కారణంగా మంచి ఫాలోయింగ్ ని దక్కింది. తాజాగా మరోసారి క్లీవేజ్ షేర్ చేస్తూ సోషల్ మీడియాలో తన కొత్త ఫోటోలను షేర్ చేసింది. ఎప్పటి లాగే ఈ ఫోటోలు కూడా వైరల్ అవు తున్నాయి. ఈ రేంజ్ ఫోటోలు యంగ్ హీరోయిన్స్ కూడా షేర్ చేయడం లేదంటూ కొందరు కామెంట్స్ చేస్తూ ఉంటే మరి కొందరు మాత్రం ఈ వయసులో ఇంత అందం ఏంట్రా బాబోయ్ అని కామెంట్స్ చేస్తూ ఉన్నారు.

ఈ రేంజ్ లో అందాల ఆరబోత చేస్తుంది కనుకే ఇప్పటికీ కూడా సినిమాలు సిరీస్లు అంటూ బిజీగా కొనసాగుతోంది. ఇదే అందాల ఆరబోత కొనసాగిస్తే మరో 10 సంవత్సరాల పాటు కూడా ఈమెని జనాలు అభిమానించే అవకాశాలు ఉన్నాయి.. ఇండస్ట్రీ లో కొనసాగే అవకాశాలు ఉన్నాయి.

# పెళ్లి అయిన హీరోయిన్లకు భలే డిమాండ్



పెళ్లి అయిన హీరోయిన్లకు డిమాండ్ తగ్గింది అన్నది ఒకప్పటి మాట. నేటి సన్నివేశం అందుకు పూర్తి భిన్నం. పెళ్లైతేనే బిజీ అవుతాం! అన్న తీరున తాజా సన్నివేశం కనిపిస్తుంది. మార్కెట్ లో క్రేజీ భామలుగా దూసుకుపోవాలంటే? పెళ్లి చేసుకోవాలి...ఇద్దరు పిల్లలకు తల్లి అవ్వాలి! అప్పుడే మరింత బిజీ అవుతామని ఈ భామల్నిచూస్తే తెలుస్తుంది. పెళ్లికి ముందువరకూ ఒకలాసాగిన జర్నీ వివాహం అనంతరం రెట్టింపు వేగంతో దూసుకుపోతున్నట్లు కనిపిస్తుంది. నటీమణులుగా తమ రేంజ్ ని అంతకంతకు పెంచుకుంటూ ముందుకెళ్లిపోతున్నారు? అన్నడానికి కొంత మంది భామల్ని ఉదహరించొచ్చు. రణవీర్ సింగ్ ని పెళ్లాడిన తర్వాత దీపికా పదుకొణే సినిమాల వేగం పెంచిన పెంచింది. పెళ్లైన నాలుగేళ్లలో ఏడు సినిమాలు చేసింది. అప్పటివరకూ కమర్శియల్ చిత్రాల్లోనే నటించిన అమ్మడు సోలోగానూ బాక్సాఫీస్ వద్ద సత్తా చాటడం మొదలు పెట్టింది. 'పద్మావత్' చిత్రంతో బాక్సాఫీస్ నే షేక్ చేసిన నటిగా గుర్తింపు తెచ్చుకుంది. ప్రస్తుతం దీపిక 2024 క్యాలెండర్ కూడా ఫిల్ అయింది. పారితోషికం రెట్టింపు చేసింది. కల్కితో టాలీవుడ్ లోనూ ఎంట్రీ ఇస్తోన్న సంగతి తెలిసిందే. ఇక కత్రినాకైఫ్ రెండేళ్ల క్రితం విక్కీ కౌశల్ ని ప్రేమించి పెళ్లి చేసుకుంది. అప్పటి నుంచి క్యాట్ సినిమాలు వేగంగా పూర్తిచేయలేదు కానీ..డిమాండ్ మాత్రం పీక్స్ లో ఉంది. ఒక్కో సినిమాకి కోట్లలో ఛార్జ్ చేస్తుంది. ఈ ఛార్జ్ విమర్శలకు సైతం దారి తీసింది. ప్రస్తుతం 'టైగర్-3'..'మేరి క్రిస్మస్' సినిమాలు చేస్తుంది. కొత్త ప్రాజెక్ట్ లకు అడ్వాన్సులు అందుకుంది. వాటిని అధికారికంగా కన్ఫమ్ చేయాల్సి ఉంది. అలాగే ఇదే ఏడాది సిద్దార్ధ్ మల్హోత్రాని పెళ్లాడి కొత్త జీవితం ప్రారంభించింది కియారా అద్వాణి జర్నీ కూడా రెట్టింపు వేగంతో దూసుకుపోతుంది. బాలీవుడ్ తో పాటు టాలీవుడ్ లోనూ సినిమాలు చేస్తుంది.ఎంతో మంది నాయికలు ఉన్నా శంకర్ పట్టుబట్టి మరీ 'గేమ్ ఛేంజర్' కోసం ఎంపిక చేసాడు. అమ్మడి లైనప్ లో ఇంకా చాలా సినిమాలున్నాయి. అలాగే రణబీర్ కపూర్ తో వివాహం తర్వాత అలియాభట్ ఏ రేంజ్ కి వెళ్తుందో కళ్లముందు కనిపిస్తూనే ఉంది. వరుస విజయాలతో సత్తా చాటుతుంది. జాతీయ అవార్డుల సైతం కైవసం చేసుకుంది. 'హార్ట్ ఆఫ్ స్టోన్' సినిమాతో హాలీవుడ్ లోనూ లాంచ్ అవుతుంది. 'గంగూబాయి కతియావాడి' తో సోలో నాయికగానూ సత్తా చాటింది. క్రైసస్ లో రిలీజ్ అయినా ఆ సినిమా బాలీవుడ్ కి మంచి బూస్టింగ్ ఇచ్చింది. అదే సినిమాకి ఉత్తన జాతీయ నటి అవార్డు అందుకుంది. అలియా ఎస్ చెప్పాలేగానీ టాలీవుడ్ మేకర్స్ క్యూలో ఉంటారు. వీళ్లందరి కంటే సీనియర్లు అయినా కరీనాకపూర్...ప్రియాంక చోప్రా...రాణీ ముఖర్జీ లాంటి వారు మెరుపు వేగంతో కెరీర్ పరంగా దూసుకుపోతున్నారు. కరీనా...రాణీ ముఖర్జీ లు సోలో భామలుగా ఫోకస్ చేస్తున్నారు. మార్కెట్ లో తమకంటూ ఓ బ్రాండ్ ఐడెంటిటీ ఉండే కాన్సెప్ట్ లతో ప్రేక్షకుల ముందుకొస్తున్నారు. ఇక ప్రియాంక చోప్రా గ్లోబల్ స్థాయిలోనే వెలిగిపోతున్న వైనం కనిపిస్తూనే ఉంది. నిక్ జోనాస్ తో వివాహం తర్వాత అమెరికాలో కాపురం పెట్టి ఇండియాని షేక్ చేస్తుంది. అవకాశాలు ఇస్తామన్న బాలీవుడ్ లో సినిమాలు చేయని రేంజ్ కి వెళ్లిపోయింది. అలాగే సౌత్ నుంచి నయనతార పెళ్లైన బ్యూటీల్లో అగ్ర పధాన కనిపిస్తుంది. ఇటీవలే 'జవాన్' తో భారీ హిట్ అందుకుంది. పెళ్లి అయిన తర్వాత అందుకున్న తొలి సక్సెస్ ఇది. దీంతో బాలీవుడ్ లోనూ అమ్మడు చక్రం తిప్పడం ఖాయమని తేలిపోయింది. ఉత్తరాది హీరోయిన్లకు అక్కడ గట్టిపోటీ ఇస్తుందని అంచనాలున్నాయి. టాలీవుడ్..కోలీవుడ్ లో ఇప్పటికే తాను సాధించాల్సిందంతా పూర్తయింది. ఈనేపథ్యంలో ట్రిగర్ బాలీవుడ్ పై గురి పెట్టింది. ఇక సమంత చైతన్యతో విడాకుల తర్వాత నటిగా ఎంత బిజీ అయిందో తెలిసిందే. కమర్శియల్ చిత్రాలతో పాటు ఉమెన్ సెంట్రిక్ చిత్రాలతోనూ అలరించే ప్రయత్నం చేస్తుంది. 'యశోద'..'యూటర్న్' లాంటి సినిమాలు తనకో సోలో ఐడెంటిటీని తెచ్చిపెట్టాయి. ప్రస్తుతం చెన్నై స్టోరీస్ లో నటిస్తోంది.

అలాగే ఐటం పాటల్లోనూ తగ్గేదేలే అంటూ సత్తా చాటుతుంది. 'ఊ అంటావా 'పాటతో పాన్ ఇండియానే షేక్ చేసింది. ఇదంతా పెళ్లి తర్వాత సామ్ లో వచ్చిన కెరీర్ మార్పు. అలాగే చందమామ కాజల్ అగర్వాల్ ఓ బిడ్డకు తల్లైనా అమ్మడి వేగం ఏమాత్రం తగ్గలేదు. ఇటీవలే 'భగవంత్ కేసరి'తో మరో సక్సెస్ ఖాతాలో వేసుకుంది. 'సత్యభామ' లాంటి లేడీ ఓరియేంటెడ్ సినిమా చేస్తుంది. సీనియర్ హీరోలకు పర్ఫెక్ట్ ఛాయిస్ గానూ కనిపిస్తుంది. కెరీర్ ముగిసిపోయింది అన్న విమర్శలకు అవకాశాలందుకుని ధీటైన బధులిస్తుంది.

# గోవా తీరంలో యాక్షన్..ఇది వేరే లెవల్ కొట్లాట!




ఎన్టీఆర్ 30వ చిత్రం దేవరపై అంచనాలు ఏస్థాయిలో ఉన్నాయో చెప్పాల్సిన పనిలేదు. ఇప్పటికే ఫస్ట్ లుక్ పోస్టర్ తో టైగర్ ఎలాంటి మాస్ పాత్రలో మెప్పించబోతున్నాడో? ఓ క్లారిటీ వచ్చేసింది. అందుకు తగ్గట్టు ..అభిమానుల అంచనాలు ఏమాత్రం తగ్గకుండా స్టార్ డైరెక్టర్ కొరటాల శివ చిత్రాన్ని చెక్కుతు న్నాడు. ఇప్పటికే అండర్ వాటర్ యాక్షన్ సన్నివేశాలు సినిమాలో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయని తెలుస్తుంది. సముద్ర గర్భంలో టైగర విన్యాసాలు థియేటర్లో ప్రేక్షకుల్ని కొత్త అనుభూతిని పంచుతాయని యూనిట్ ధీమా వ్యక్తంచేస్తుంది. దాని ప్రత్యేకంగా కోట్ల రూపాయల భారీ సెట్ వేసి మరీ చిత్రీకరించారు. ఇంతవరకూ షూటింగ్ అంతా దాదాపు హైదరాబాద్ సెట్స్ లోనే జరగబోతుంది. ఇక తదుపరి పరి షెడ్యూల్ రియల్ ఎక్స్ పీరియన్స్ ఇవ్వడం కోసం ఏకంగా గోవా తీరంలోనే ప్లాన్ చేసింది. మరి అక్కడ ఎలాంటి సన్నివేశాలు చిత్రీకరించబోతున్నారు. తీరం నేపథ్యంగల కొన్ని సన్నివేశాలు సెట్స్ లో కొన్ని చేసారు. మరిప్పుడు ప్రత్యేకంగా గోవా వెళ్లాల్సిన అవసరం ఏముంది? అంటే చాలా కథే ఉందని తెలుస్తోంది. గోవా బీచ్ అందాల్లో భారీ యాక్షన్ సన్నివేశాలు ప్లాన్ చేసినట్లు లీకులందుతున్నాయి. ఎన్టీఆర్...ఇతర నటీనటులు..ఫైటర్లపై ఈ మాస్ యాక్షన్ సన్నివేశాలు చిత్రీకరించనున్నారుట. ఈసన్నివేశాలు చాలా మాసివ్ గా ఉంటాయట. అందుకోసం భారీగా ఆయుధాలు కూడా వినియోగించనున్నారుట. కత్తులు..గొడ్డళ్లు..సమ్మెట వంటి భారీ ఆయుధాలు ఆ యాక్షన్ సన్నివేశాలు కనిపించనున్నాయట. ఈ ఫైట్స్ ని టాలీవుడ్ మాస్టర్లతో పాటు విదేశీ స్టంట్ మాస్టర్లు కలిసి కంపోజ్ చేస్తున్నట్లు సమాచారం.

మరి తీర నేపథ్యం గల సన్నివేశాలకు ఏపీ తీరం సరిపోదా? అంటే బీచ్ సహా రిసార్ట్ ని బేస్ చేసుకుని తెరకెక్కించాల్సిన సన్నివేశాలు ఉండటంతోనే అక్కడ ప్లాన్ చేసినట్లు చిత్ర వర్గాల నుంచి తెలుస్తుంది. అలాగే గోవాలోబీచ్ లో ఉండే విదేశీ బృందాల్ని కూడా చిత్రంలో భాగం చేస్తున్నారుట.

# లేడీ బ్రూస్ లీలా కనిపిస్తోన్న సమంత

సౌత్ ఇండియాలో స్టార్ హీరోయిన్ గా తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు సొంతం చేసుకున్న అందాల భామ సమంత. ఈ అమ్మడు ఇండస్ట్రీలోకి వచ్చి దశాబ్దానికి పైగా అయిపొయింది. ఇప్పటికి ఆమె తన బ్రాండ్ ఇమేజ్ ని ఇంకా కొనసాగిస్తూనే ఉంది. ఇదిలా ఉంటే గత ఏడాది మయోసైటిస్ బారిన పడిన సమంత ట్రీట్మెంట్ తీసుకొని మెల్లగా కోలుకుంది. మయోసైటిస్ బారి నుంచి కోలుకొని వచ్చిన తర్వాత యశోదతో సూపర్ హిట్ కొట్టిన శాకుంతలంతో పాన్ ఇండియా లెవల్ లో తనని షోకేస్ చేసుకున్న మూవీ డిజాస్టర్ అయ్యింది. తాజాగా విజయ్ దేవరకొండకి జోడీగా ఖుషి మూవీతో ప్రేక్షకుల ముందుకి వచ్చింది. ఈ సినిమా ఎవరేజ్ టాక్ తో బయటపడింది. ఖుషి తర్వాత ఏడాది పాటు సినిమాలకి విరామం ఇవ్వాలని సమంత ఫిక్స్ అయ్యింది. ప్రస్తుతం అయితే ఎలాంటి కమిట్మెంట్స్ పెట్టుకోలేదు. ఒప్పుకున్న సినిమాలు వచ్చే ఏడాది సెట్స్ పైకి వెళ్ళే అవకాశం ఉంది.



కొద్ది రోజులు వెకేషన్స్ కి వెళ్లి ప్రకృతి అందాలని ఆశ్వాదించిన అమ్మడు ప్రస్తుతం యూఎస్ లో రెస్ట్ తీసుకుంటోంది. అక్కడ ఓ వైపు మెడికేషన్ తీసుకుంటూనే మరో వైపు ఫిట్ నెస్ ఫ్రీక్ అయిన సామ్ రెగ్యులర్ వర్క్ అవుట్స్ తో మునుపటి శక్తిని తెచ్చుకునే ప్రయత్నం చేస్తోంది. తాజాగ ఈ బ్యూటీ ఇన్ స్టాగ్రామ్ లో జిమ్ లో వర్క్ అవుట్ చేసిన పిక్ ని షేర్ చేసింది. ఈ ఫోటోలో సమంత చూడటానికి పెర్ఫెక్ట్ బాడీతో లేడీ బ్రూస్ లీలా ఉందనే మాట వినిపిస్తోంది. సిటాడెల్ వెబ్ సిరీస్ చేస్తోన్న ఈ బ్యూటీ అందులో యాక్షన్ సీక్వెన్స్ కోసం తన బాడీ, లుక్ కూడా మార్చుకుంటుంది. అందుకే జిమ్ లో బరువులు ఎత్తుతూ కండలు పెంచుతుంది. టోపీ పెట్టుకొని తన స్మైలీ పేస్ తో ఓ వైపు కుర్రాళ్ళు మనసులు కొల్లగొడుతూనే మరో వైపు పెర్ఫెక్ట్ జిమ్ బాడీతో అందరిని భయపెడుతోంది. సమంత జిమ్ లుక్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

# టాలీవుడ్ కి తాప్సి కౌంటర్

మంచు మనోజ్ హీరో గా నటించిన ఝుమ్మంది నాదం సినిమా లో హీరోయిన్ గా నటించడంతో తెలుగు ప్రేక్షకుల కు పరిచయం అయిన ముద్దుగుమ్మ తాప్సి. తెలుగు లో ఈ అమ్మడికి స్టార్ హీరో సినిమాల్లో నటించే అవకాశాలు లభించాయి. కానీ అదృష్టం కలిసి రాకపోవడంతో ఈ అమ్మడికి ఏ ఒక్క సినిమా కూడా స్టార్ హీరోయిన్ స్టేటస్ తెచ్చి పెట్టలేకపోయాయి. టాలీవుడ్ లో స్టార్ హీరోయిన్ స్టేటస్ రాకపోవడంతో బాలీవుడ్ లో ప్రయత్నాలు మొదలు పెట్టింది. అక్కడ జీరో నుండి తాప్సి కెరియర్ ఆరంభించింది. అదృష్టం కలిసి రావడంతో అక్కడ వరుసగా సినిమాలు దక్కించుకుంటూ స్టార్ హీరోయిన్ హెూదాను సొంతం చేసుకుంది. అదే సమయంలో సౌత్ లో కూడా అవకాశాలు వచ్చినప్పుడు నటిస్తూనే ఉంది. కొంత మంది హీరోయిన్స్ ఇక్కడ సక్సెస్ దక్కించుకుంటే అక్కడ ఫెయిల్ అవుతారు.. మరి కొందరు హీరోయిన్స్ ఇక్కడ ఫెయిల్ అయితే అక్కడ సక్సెస్ అవుతారు. కొద్దిమంది మాత్రమే ఇక్కడ అక్కడ సక్సెస్ ని సొంతం



చేసుకుంటారు. తాప్సి ఇక్కడ సక్సెస్ లను సొంతం చేసుకోలేక పోయింది. కానీ బాలీవుడ్లో మాత్రం స్టార్ హీరోయిన్గా గుర్తింపు దక్కించుకుంది. టాలీవుడ్ లో తాప్సి సక్సెస్ దక్కించుకోక పోవడం పట్ల అప్పట్లో విమర్శలు వ్యక్తం అయ్యాయట. ఆ విషయమై తాప్సి ఒకానొక సందర్భంలో మాట్లాడుతూ.. నేను తెలుగు సినిమాల్లో నటించిన సందర్భంగా కొన్ని సినిమాలు ఫ్లాప్ అయ్యాయి. దాంతో చాలా మంది నన్ను విమర్శించారు. నేను దురదృష్టవంతురాలిన అంటూ నిందించారు. సినిమాలు ఆడక పోవడానికి కారణం నేనే అన్నట్లుగా ఆ సమయంలో కొందరు విమర్శలు చేశారు. నిజానికి నేను సినిమా ఇండస్ట్రీకి చెందిన ఫ్యామిలీ నుండి వచ్చిన దాని ని కాదు. ఇండస్ట్రీ బ్యాక్ గ్రౌండ్ లేకపోవడంతో కెరియర్ ఆరంభం లో సినిమాల ఎంపిక విషయంలో అవగాహన లేకపోవడంతో కొన్ని తప్పిదాలు చేసిన మాట వాస్తవం. ఆ తప్పుల నుండి పాఠాలు నేర్చుకున్నాను. ఆ పాటలు నేర్చుకునే క్రమంలో నేను చాలా మంది విమర్శల కు గురయ్యాను. కొన్ని సినిమాల్లో నేను పాటల కు, ఒకటి రెండు సన్నివేశాల కు మాత్రమే పరిమితమైన పాత్రల ను చేశాను. అందువల్ల కూడా నన్ను విమర్శించారని ఆవేదన వ్యక్తం చేసినట్లుగా మాట్లాడుతూనే టాలీవుడ్ కి కౌంటర్ ఇచ్చింది. ప్రస్తుతం బాలీవుడ్లో ఈమె సినిమాల కు మంచి డిమాండ్ ఉన్న విషయం తెలిసిందే.




అచ్చంపేట: తెలంగాణ కోసం తాను పోరాడుతున్నప్పుడు ఈ నేతలంతా ఎవరి కాళ్లదగ్గర ఉన్నారో తెలియదని భారాస అధినేత, సీఎం కేసీఆర్ అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా అచ్చంపేటలో నిర్వహించిన భారాస ప్రజా ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్ పాల్గొని ప్రసంగించారు. పాలమూరు ప్రజలు బొంబయికి వలస పోయినప్పుడు ఎవరైనా వచ్చారా? అని ప్రశ్నించారు. పాలమూరు జిల్లాలో గతంలో గంజి, అంబలి కేంద్రాలు ఉండేవని, పదేళ్ల క్రితం తెలంగాణ ఎలా ఉండేదో ప్రజలు గుర్తు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. "తెలంగాణ కోసం 24 ఏళ్ల క్రితం ఒంటరిగా ప్రయాణం ప్రారంభించా. నా పోరాటంలో నిజాయితీ ఉంది కాబట్టే.. విజయవంతం అయ్యాను. సరిపడా కరెంటు లేక, తాగునీరు, సాగునీరు లేక ఎన్నో కష్టాలు పడ్డాం. ఇవాళ దేశం మొత్తంలో 24గంటల కరెంటు ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ. ఇప్పుడు దేశానికి దిక్సూచిగా నిలిచేలా తెలంగాణ ఎదిగింది. ఇంటింటికీ నల్లా నీరు ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ. కొండగల్ రా.. గాంధీ బొమ్మ దగ్గరకు రా.. అని కొందరు నాకు సవాలు విసురుతున్నారు. కేసీఆర్ దమ్ము ఏంటో దేశమంతా చూసింది.. కొత్తగా చూపాల్సిన అవసరం లేదు. తెలంగాణ ప్రయాణం పదో సంవత్సరంలో ఎన్నికలు వచ్చాయి. రాష్ట్రం కోసం నావంతు పోరాటం అయిపోయింది.. ఇక చేయాల్సింది ప్రజలే. 60లక్షల టన్నుల ధాన్యం పండే తెలంగాణ.. ఇవాళ 3కోట్ల టన్నుల ధాన్యం పండిస్తోంది. 24 గంటల కరెంటు ఇస్తే.. కాంగ్రెస్‌ను వీడి తెరాస కండువా కప్పుకొంటానని జానారెడ్డి సవాల్ విసిరారు. ఆ తర్వాత వెనక్కితగ్గారు. రైతు బంధు అనే పథకానికి ఆద్యుడు కేసీఆర్. రైతు బంధును దశలవారీగా రూ.16వేలకు పెంచుతాం.

పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంపై కాంగ్రెస్ నేతలు 109 కేసులు వేశారు. ప్రాజెక్టులు పూర్తయితే కేసీఆర్‌కు మంచిపేరు వస్తుందని కేసులు వేసి అడ్డుకున్నారు. పాలమూరు ప్రాజెక్టు పూర్తి చేసి అచ్చంపేట నియోజకవర్గంలో లక్ష ఎకరాలకు నీరు ఇస్తాం. ఎవరు గెలిస్తే తెలంగాణ ముందుకు వెళ్తుందో వారినే గెలిపించాలి. ఉన్న తెలంగాణ పోగొట్టిందే కాంగ్రెస్ పార్టీ. తెలంగాణ ఇస్తామని 2004లో ప్రకటించి 2014లో ఇచ్చారు. 32 పార్టీల మద్దతు కూడగట్టి తెలంగాణ సాధించా" అని సీఎం కేసీఆర్ వివరించారు.




హైదరాబాద్: కాంగ్రెస్ అంటేనే రైతు విరోధి అని మరోసారి రుజువైందని మంత్రి కేటీఆర్ విమర్శించారు. ప్రజాక్షేత్రంలో ఆ పార్టీకి గుణపాఠం తప్పదన్నారు. 'రైతుబంధు' నిలిపివేయాలని కేంద్ర ఎన్నికల సంఘానికి కాంగ్రెస్ ఫిర్యాదు చేయడంపై ట్విటర్ (ఎక్స్) వేదికగా కేటీఆర్ స్పందించారు. "ఇంటింటికీ మంచినీళ్లు, 24 గంటల కరెంటు కూడా ఆపేయమంటారేమో? అందులో కూడా కేసీఆరే కనిపిస్తారు కదా? అన్నదాత పాలిట నంబర్ వన్ విలన్ కాంగ్రెస్ అని ఇంకోసారి తేలిపోయింది. పెట్టుబడి సాయాన్ని అడ్డుకునే కపట కుట్రను తెలంగాణ రైతులు సహించరు. అన్నదాతల పొట్టకొట్టే కాంగ్రెస్ కుతంత్రాలను ఎట్టి పరిస్థితుల్లోనూ తెలంగాణ రైతులు భరించరు. రైతుబంధును ఆపాలని లేఖలు రాస్తున్న కాంగ్రెస్ తోకలు కట్ చేయడం పక్కా. ఇప్పటికే నమ్మి ఓటేసిన పాపానికి కర్ణాటక రైతులను అరిగోస పెడుతున్నారు. తెలంగాణ రైతులకు కడుపునిండా కరెంట్ ఇస్తే ఓర్వలేక 3 గంటల మోసానికి తెర తీశారు. రైతుబంధు పథకానికి కూడా పాతరేసే ద్రోహం చేస్తున్న కాంగ్రెస్‌కు తెలంగాణ ప్రజాక్షేత్రంలో గుణపాఠం తప్పదు" అని మంత్రి కేటీఆర్ హెచ్చరించారు.

# కామారెడ్డిలో పోటీకి సిద్ధమే: రేవంత్ రెడ్డి



దిల్లీ: అధిష్ఠానం ఆదేశిస్తే కామారెడ్డిలో పోటీకి సిద్ధమేనని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి వెల్లడించారు. తానైనా, సీఎల్పీ నేత భట్టి విక్రమార్క అయినా పార్టీ ఆదేశిస్తే కేసీఆర్‌పై పోటీ చేస్తామని తెలిపారు. దిల్లీలో ఎంపీ ఉత్తమ్‌కుమార్ రెడ్డి, సీఎల్పీ నేత భట్టి విక్రమార్కతో కలిసి మీడియాతో రేవంత్ మాట్లాడారు. "కేసీఆర్, కేటీఆర్‌ను చిత్తుగా ఓడించేందుకు సిద్ధంగా ఉన్నాం.

కొడంగల్ నుంచి పోటీ చేయాలని కేసీఆర్‌ను ఆహ్వానించా. కొడంగల్‌కు పోటీకి కేసీఆర్ రాకపోతే కామారెడ్డిలో పోటీకి నేను సిద్ధం" అని తెలిపారు. ఉమ్మడి ఏపీలో ప్రజలు ఎప్పుడూ హంగ్‌కు అవకాశం ఇవ్వలేదని.. తెలంగాణలోనూ హంగ్ ఎప్పుడూ రాలేదన్నారు. రెండింట మూడో వంతు మెజారిటీతో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

**ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తున్నారు..** ఎన్నికల నియమావళిని భారాస నేతలు ఉల్లంఘిస్తున్నారని కాంగ్రెస్ నేతలు ఆరోపించారు. నియమావళి ఉల్లంఘనపై కేంద్ర ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. "సంక్షేమ పథకాల నగదు బదిలీపై ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేశాం. పార్టీ కార్యకర్తల్లా పనిచేస్తున్న అధికారులను బదిలీ చేయాలని కోరాం. నిష్పక్షపాతంగా వ్యవహరించే అధికారులను నియమించాలని విజ్ఞప్తి చేశాం.

విశ్రాంత అధికారులకు పదవులు ఇచ్చి ప్రతిపక్షాలను ఇబ్బంది పెట్టేందుకు ప్రైవేటు ఆర్మీలా వాడుతున్నారు. విశ్రాంత అధికారులను తక్షణమే విధుల నుంచి తొలగించాలని కోరాం. విశ్రాంత అధికారులపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశాం. ప్రభుత్వ జీతభత్యాలతో ప్రైవేటు ఆర్మీని నియమించారు. కొత్త ఆర్మీతో కాంగ్రెస్ నేతలపై దాడులు చేయించి కేసులు పెడుతున్నారు. కీలకమైన శాఖలను కొందరు ఐఏఎస్‌లు 7 - 8 ఏళ్లుగా నిర్వహిస్తున్నారు.

జయేశ్ రంజన్, అర్వింద్ కుమార్, సోమేశ్ కుమార్ కీలక శాఖలు నిర్వహిస్తున్నారు. భారాసకు ఎన్నికల నిధులు ఇవ్వాలని వ్యాపారులపై ఒత్తిడి తెస్తున్నారు" అని కాంగ్రెస్ నేతలు ఆరోపించారు.

# రైతుబంధును ఆపెయ్యమనడం కాంగ్రెస్ పార్టీ దుర్మార్గానికి పరాకాష్ట : మంత్రి జగదీష్ రెడ్డి ఫైర్



సూర్యాపేట : రైతుబంధును ఆపాలని ఎలక్షన్ కమిషన్‌కు ఫిర్యాదు చేయడం కాంగ్రెస్ పార్టీ దుర్మార్గానికి పరాకాష్ట అని విద్యుత్ శాఖ మంత్రి జగదీష్ రెడ్డి(%వీఱఅఱర్‌వతీ జీుస్త్రఃఅంష్ట్ర =వఃఎఎ%) ఆగ్రహం వ్యక్తం చేశారు. సూర్యాపేటలో మీడియాతో మాట్లాడిన మంత్రి.. కాంగ్రెస్ పార్టీ పై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. కాంగ్రెస్ రద్దుల పార్టీ అని పేర్కొన్నారు. కాంగ్రెస్ చర్యల పై ప్రజలు ఉద్యమించాలన్నారు. కాంగ్రెస్ తీరు ఉచిత విద్యుత్, మిషన్ భగీరథను కూడా ఆపేలా ఉందన్నారు. కేసీఆర్ పథకాలు ఆపాలని కుట్ర చేస్తున్న కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ మోడల్ పథకాలు ఇతర రాష్ట్రాల ప్రజలు అడుగుతున్నారనే భయం పట్టుకుందన్నారు.

కర్ణాటకలో ఏకంగా కరెంట్ కోసం సబ్ స్టేషన్లలో మొసళు వదిలే దుస్థితి వచ్చిందని, కాంగ్రెస్ పార్టీ పద్దుల పార్టీ కాదు రద్దుల పార్టీ అని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్, బీజేపీ మ్యాచ్ ఫిక్సింగ్ రాజకీయాలను తెలంగాణ ప్రజలు గమనించాలని కోరారు. బీఆర్ఎస్ పార్టీని ఎదగనీయకుండా చేయాలని కాంగ్రెస్, బీజేపీలు కుట్ర చేస్తున్నాయని మండిపడ్డారు. ప్రజల కోసం పనిచేసే పార్టీని ప్రజలు గుర్తించాలి. బీజేపీ పాలనలో పెనం నుంచి పొయ్యిలో పడ్డ చందంగా దేశ ప్రజల పరిస్థితి మారిందన్నారు. ఈసీకి ఫిర్యాదుతో రైతాంగం పట్ల కాంగ్రెస్ పార్టీ కపట ప్రేమ బట్టబయలైందన్నారు. గ్రామాల్లో ఆ పార్టీ అభ్యర్థులను నిలదీయాలని ప్రజలకు పిలుపు నిచ్చారు.

# కాంగ్రెస్ అంటేనే రైతు వ్యతిరేక ప్రభుత్వం: హరీశ్‌రావు



హైదరాబాద్: తెలంగాణలో సీఎం కేసీఆర్ రైతుబంధు పథకాన్ని ప్రారంభిస్తే.. కేంద్ర ప్రభుత్వం అదే పథకాన్ని కాపీ కొట్టి పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకాన్ని తీసుకొచ్చిందని మంత్రి హరీశ్‌రావు అన్నారు. రైతుబంధు పథకం ఓట్ల కోసం తీసుకొచ్చింది కాదని చెప్పారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడిన హరీశ్.. కాంగ్రెస్‌పై తీవ్ర విమర్శలు గుప్పించారు. "తెలంగాణలో అమలవుతున్న చాలా పథకాలను ఇతర రాష్ట్రాలు, కేంద్రం కాపీ కొట్టాయి. రైతులంతా భారాస వెంటే ఉన్నారని కాంగ్రెస్ పార్టీ వారిపై కోపం పెంచుకుంది. కాంగ్రెస్ అంటేనే రైతు వ్యతిరేక ప్రభుత్వం. కర్ణాటకలో కాంగ్రెస్‌ను గెలిపించినందుకు రైతులు బాధపడుతున్నారు. కరోనా సమయంలో ఎమ్మెల్యేలు, అధికారుల జీతాల్లో కోత పెట్టి రైతుబంధు ఇచ్చాం. కాంగ్రెస్ హయాంలో రాష్ట్రంలో రోజూ రైతుల ఆత్మహత్యలు ఉండేవి. ఎన్నికలు వచ్చాయని రైతుబంధు ఇవ్వొద్దని కాంగ్రెస్ నేతలు అంటున్నారు. కొంత మంది కాంగ్రెస్ నేతలు రైతుబంధుకు చేసేది వృథా ఖర్చు అంటున్నారు. దీన్నిబట్టి చూస్తే.. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రైతుబంధు ఉండదని అర్థం అవుతోంది" అని హరీశ్‌రావు వెల్లడించారు.




## ఆశావహుల జాబితాపై తెదేపా కసరత్తు పూర్తి - అభ్యర్థులను ఖరారు చేయనున్న చంద్రబాబు

హైదరాబాద్: తెలంగాణ శాసనసభ ఎన్నికల్లో 89 నియోజకవర్గాల్లో పోటీ చేయాలని తెదేపా భావిస్తోంది. నియోజకవర్గాలు, అక్కడి నుంచి టికెట్ ఆశిస్తున్నవారి ఎంపికపై రాష్ట్ర పార్టీ కసరత్తు పూర్తిచేసింది. ఈ వివరాలతో కూడిన జాబితాను తెదేపా అధినేత చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. పార్టీ అధినేత కుటుంబసభ్యులతో పాటు తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ రాజమహేంద్రవరంలో చంద్రబాబుతో ములాఖత్ కానున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి పార్టీ అధినేత గురువారం కీలక నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని తెదేపా వర్గాలు చెబుతున్నాయి. 30 నియోజకవర్గాలు మినహా..: నియోజకవర్గాలవారీగా ఆశావహులు, అభ్యర్థుల ఎంపికపై కాసాని ఆదివారం ఎన్టీఆర్ భవన్‌లో రాష్ట్రస్థాయి, పార్లమెంటరీ స్థాయి నేతలతో కలిసి కసరత్తు చేశారు. 119 నియోజకవర్గాల్లో 89 చోట్ల పోటీ చేయాలని ఓ నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. ఈ నియోజకవర్గాలకు సంబంధించి 189 మంది పేర్లతో జాబితా రూపొందించినట్లు విశ్వసనీయ సమాచారం. తెదేపా పోటీకి దూరంగా ఉండాలని భావిస్తున్న 30 నియోజకవర్గాల్లో హైదరాబాద్ లోక్‌సభ పరిధితో పాటు ఉమ్మడి వరంగల్, ఆదిలాబాద్ జిల్లాల్లో ఎక్కువగా ఉన్నట్లు సమాచారం. 89 నియోజకవర్గాల్లో కొన్నింటికి ఒక్కో పేరు, మరికొన్నింటికి రెండేసి పేర్లు.. కొన్నిచోట్ల మూడు పేర్లను ప్రతిపాదిస్తూ జాబితా రూపొందించినట్లు సమాచారం. అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ, బరిలో ఉండే స్థానాల సంఖ్య, అభ్యర్థుల ఎంపిక అంశాలపై చంద్రబాబుదే తుది నిర్ణయం అని పార్టీ నేతలు చెబుతున్నారు.

# వచ్చే ఎన్నికల్లో మళ్లీ గెలిచేది బీఆర్ఎస్ పార్టీనే : మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్



హైదరాబాద్ : వచ్చే శాసన సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ మూడోసారి విజయం సాధించడం ఖాయమని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. గురువారం సనత్ నగర్ నియోజకవర్గ పరిధిలోని బన్సీలాల్ పేటలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మంత్రి తలసానికి ఇంటింటా మంగళ హారతులు పట్టి, శాలువాలతో సత్కరించి సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చూస్తానని స్పష్టం చేశారు. సనత్ నగర్‌ను గతంలో ఎన్నడూ జరుగనంత అభివృద్ధి చేశాం. మురుగు నీరు, తాగు నీరు సమస్యలు తీర్చామని చెప్పారు. అభివృద్ధికి కేరాఫ్‌గా సనత్ నగర్ నియోజకవర్గాన్ని తీర్చిదిద్దామని పేర్కొన్నారు. అభివృద్ధిని చూసి ఆశీర్వదించండి.

మరింత అభివృద్ధి కోసం అత్యధిక మెజార్టీతో తనని గెపించాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటిని నెరవేరుస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# 'నా నలభై ఏళ్ల రాజకీయ జీవితంలో ఇంత అరాచకం చూడలేదు



ఖమ్మం: "నా నలభై ఏళ్ల రాజకీయ జీవితంలో ఇంత అరాచకం చూడలేదు" అని మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. గురువారం 8వ డివిజన్‌లో నిర్వహించిన ఇంటింటికీ కాంగ్రెస్ కార్యక్రమంలో తుమ్మల మాట్లాడుతూ... అధికారాన్ని అడ్డుపెట్టుకొని పోలీసులను ప్రైవేట్ సైన్యంగా మార్చారన్నారు. బెదిరింపులు దౌర్జన్యంతో కాంగ్రెస్ నేతలను భయపెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఖమ్మంలో అరాచక పాలన తరమి కొట్టడానికి కాంగ్రెస్ శ్రేణులు కథం తొక్కాలని పిలుపునిచ్చారు. దేశంలో మత విద్వేషాలు లేకుండా భారత్ జోడో యాత్రతో యావత్ దేశాన్ని ఐక్యం చేసిన రాహుల్ గాంధీ ఆహ్వానంతో కాంగ్రెస్లో చేరినట్లు తెలిపారు. నియంత రాజకీయాలకు కాలం చెల్లిందన్నారు. కొంత మంది పోలీస్ అధికారులు పరిధి దాటి కాంగ్రెస్ నేతల్ని ఇబ్బంది పెడుతున్నారని మండిపడ్డారు. నెల రోజులు తరువాత అధికారం లేని వారి కోసం అధికారులు తమ జీవితాలు నాశనం చేసుకోవొద్దని సూచించారు. పోలీస్ అధికారులు తమ పద్దతి మార్చుకోకపోతే ప్రజా తిరుగుబాటు చూస్తారని హెచ్చరించారు. అహంకార పాలనకు పాతరేసి ఖమ్మం అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని తుమ్మల నాగేశ్వరరావు కోరారు.

# పార్టీ మారడంపై డీకే అరుణ క్లారిటీ



హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీలో చేరబోతున్నట్లు వస్తున్న వార్తలను బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ తీవ్రంగా ఖండించారు. ఈ విషయంపై గురువారం డీకే అరుణ్ పత్రికా ప్రకటనను విడుదల చేశారు. తాను కాంగ్రెస్ పార్టీలో చేరే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు కావాలని మైండ్ గేమ్ ఆడుతున్నారని మండిపడ్డారు. బీజేపీ జాతీయ నాయకత్వం తనను గుర్తించి జాతీయ ఉపాధ్యక్ష పదవి ఇచ్చిందని, మోడీ నాయకత్వంలో పని చేయడానికి అదృష్టం ఉండాలని అన్నారు. కనీసం తన స్పందన తీసుకోకుండా వార్తా కథనాలు రాయడం సరైంది కాదని మండిపడ్డారు. తన రాజకీయ భవిష్యత్‌ను నిర్ణయించాల్సిన హక్కు మీడియాకు ఎవరు ఇచ్చారంటూ కాంగ్రెస్‌లో తన చేరికపై దుష్ప్రచారం చేస్తున్న మీడియా సంస్థలను ప్రశ్నించారు. తనపై దుష్ప్రచారం చేసిన మీడియా సంస్థలపై పరువు నష్టం దావా వేస్తానని డీకే అరుణ హెచ్చరించారు.

# శ్రీశైలం గౌడ్‌పై దాడిని ఖండించిన బండి సంజయ్



మేడ్చల్: నిన్న ఓ చానెల్ టిబెట్‌లో బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే కేపీ వివేకానందగౌడ్ బీజేపీ పార్టీ నేత శ్రీశైలం గౌడ్‌పై దాడి చేశారు. ఈ దాడిని బీజేపీ జాతీయ ప్రదాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ ఖండించారు. గురువారం నాడు జీడిమెట్లలో గల షాపూర్‌లోని కూన శ్రీశైలంగౌడ్ ఇంటికి వెళ్లి శ్రీశైలం గౌడ్‌ను పరామర్శించి దాడి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మీడియాతో మాట్లాడుతూ.." నిన్న జరిగిన సంఘటనలో తప్పతాగి వచ్చి గొడవకు కారణమైన బీఆర్ఎస్ నేతలపై పోలీసులు చర్యలు తీసుకోవాలి. అంబేద్కర్ రాజ్యాంగం కావాలా లేక కల్వకుంట్ల రాజ్యాంగం కావాలా అని నిలదీశారు. శ్రీశైలంపై దాడిని ఎన్నికల కమిషన్ దృష్టికి తీసికెళ్తాం. ఈ ఎన్నికల్లో వివేకానందగౌడ్‌ను అనర్హుడుగా ప్రకటించాలి. తెలంగాణ రాష్ట్రంలో రాజకీయ సమీకరణలు వేగంగా మారుతున్నాయి. మీడియా పార్టీల వారిగా విడిపోయింది. ప్రజలు మాత్రం బీజేపీ పార్టీ పక్షాన ఉన్నారు. ఆ ఎమ్మెల్యే పేరు వివేకానంద - బుద్దులు మాత్రం ఔరంగజేబులా ఉన్నాయి. సర్వేలన్నీ బీజేపీ పార్టీకి అనుకూలంగా ఉన్నాయి. ప్రశ్నిస్తే దాడులా, శ్రీశైలంపై దాడి ప్రజలపై దాడి. అక్రమంగా సంపాదించిన డబ్బులు వెదజల్లి గెలుస్తాననే అహంకారంతో సంస్కారహీనంగా వివేకానందగౌడ్ ప్రవర్తన ఉంది. ఎలాంటి దాడులైన పేదల కోసం బీజేపీ భరిస్తుంది. ప్రజల సమస్యల కోసం ప్రశ్నించిన వారిపై దాడులు చేసే %దీ=ూ% నాయకులు మనకు అవసరమా అని ప్రశ్నించారు. కండకావరంతో దాడి చేసిన వివేకానందగౌడ్‌ను ఈ ఎన్నికల్లో ప్రజలు ఓడించాలి. కబ్జాలు చేసే వారిని ఈ ఎన్నికల్లో బహిష్కరించాలి. కుత్బుల్లాపూర్ ప్రజలు ఆలోచించి మంచి నిర్ణయం తీసుకోవాలి" అని బండి సంజయ్ అన్నారు.

# ట్యాంక్‌బండ్ పరిసరాల్లో ట్రాఫిక్ జామ్..



హైదరాబాద్: హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్ పరిసరాల్లో భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. దుర్గామాత నిమజ్జనాల కోసం పెద్ద సంఖ్యలో వాహనాలు హుస్సేన్‌సాగర్ తీరానికి తరలివచ్చాయి. దీంతో సెక్రటేరియట్ రోడ్డు, నెక్లెస్ రోడ్, తెలుగుతల్లి ఫ్లై ఓవర్, టెలిఫోన్ భవన్ రోడ్డు వరకు వాహనాలు నెమ్మదిగా కదులుతున్నాయి. ట్యాంక్‌బండ్ పరిసరాలన్నీ కిక్కిరిసిపోవడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. కాగా, దుర్గామాత నిమజ్జనాల కోసం ట్యాంక్‌బండ్ చుట్టూ 11 క్రేన్‌లను ఏర్పాటు చేశారు. ఈ నెల 23 నుంచి కొనసాగుతున్న దుర్గా విగ్రహాల నిమజ్జనాలు నేటితో ముగియనున్నాయి. ఈ నేపథ్యంలో హుస్సేన్‌సాగర్ ప్రాంతంలో అధికారులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com